# రాజ్య సంస్కరణ

TGBIL/26/A6717 RAJYA SAMSKARANA తెలుగు దినపత్రిక

'రాజ్య సంస్కరణ' ఈ-పేపర్ కోసం ఇక్కడ స్కాన్ చేయండి..

మేడ్చల్ మల్కాజిగిరి | సంపుటి : 1 | సంచిక : 5 | బుధవారం | 19.08.2026 | పేజీలు : 8 | వెల రూ. 2

Medchal Malkajgiri | Volume: 1 | Issue: 5 | Wednesday | 19.08.2026 | Pages: 8 | Rate: 2


## 22-ఏ భూములపై సీఎం భరోసా

**• ప్రైవేట్ ఆస్తులకు అడ్డంకులు తొలగింపు • ఆస్తి హక్కులకు అండగా ప్రభుత్వం**



22ఏ నిషేధిత భూముల రిజిస్ట్రేషన్ల అంశంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంగళవారం సమీక్ష నిర్వహించారు. రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఉన్నతాధికారులతో చర్చించిన సీఎం.. ప్రజల ఆస్తి హక్కుల పరిరక్షణకు ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. ప్రైవేట్ ఆస్తులు కలిగిన వారు రిజిస్ట్రేషన్లు చేసుకునే విషయంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

**• రెండు రోజుల్లోనే పరిశీలన**

రిజిస్ట్రేషన్ కోసం ఆన్‌లైన్‌లో స్లాట్ తీసుకున్న వ్యక్తి భూమి 22ఏ నిషేధిత జాబితాలో ఉన్నా ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ప్రభుత్వం స్పష్టం చేసింది. సంబంధిత రెవెన్యూ అధికారులు ఆ భూమిని రెండు రోజుల్లో పరిశీలించాలని... అది ప్రైవేట్ భూమిగా నిర్ధారణ అయితే వెంటనే రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేయాలని సీఎం ఆదేశించారు. 22ఏ జాబితాలో ఉన్న భూములను జిల్లా కలెక్టర్లు క్షుణ్ణంగా పరిశీలించి సరైన జాబితాను రూపొందించాలని రేవంత్ రెడ్డి ఆదేశించారు. జాబితాలో ఎలాంటి తప్పులు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. శాశ్వత పరిష్కారం దిశగా ఈ ప్రక్రియను వేగంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

**• ప్రైవేట్ భూములకు రక్షణ**

ప్రజలు తమ భూ హక్కుల విషయంలో ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని సీఎం స్పష్టం చేశారు. ప్రైవేట్ భూముల విషయంలో ప్రభుత్వం స్పష్టమైన వైఖరితో ఉందన్నారు. ప్రైవేట్ భూముల్లో ఒక్క అంగుళానికి కూడా ఇబ్బంది రానివ్వబోమని హామీ ఇచ్చారు. ఆస్తి హక్కుల పరిరక్షణకు ప్రభుత్వం పూర్తి బాధ్యత తీసుకుంటుందని చెప్పారు. 22ఏ భూముల అంశాన్ని ఆసరాగా చేసుకుని ప్రజలను తప్పుదోవ పట్టించే దళారులు, మధ్యవర్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వం సూచించింది. భూముల రిజిస్ట్రేషన్ల విషయంలో ఎవరి మాటనో నమ్మి మోసపోవద్దని హెచ్చరించింది. ఈ అంశంపై వచ్చే పుకార్లు, కట్టుకథలను నమ్మవద్దని ప్రజలకు సూచించింది.



## సర్దార్ పాపన్న స్ఫూర్తితో సామాజిక న్యాయం

**గీత కార్మికులకు అండగా ఉన్నామన్న సీఎం**

గీత కార్మికుల వృత్తిని కాపాడే బాధ్యతను తమ ప్రభుత్వం తీసుకుంటుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. అర్హత ఉన్న నేత, గీత కార్మికులు ఎంతమంది ఉన్నా అందరికీ సంతృప్త స్థాయిలో పింఛన్లు అందించాలని అధికారులను ఆదేశించామని తెలిపారు. గౌడ సోదరులకు ఇప్పటికే 50 వేల కాటమయ్య కిట్లు పంపిణీ చేశామని, ప్రమాదవశాత్తు గీత కార్మికులు మరణిస్తే ₹5 లక్షల పరిహారం అందిస్తున్నామని చెప్పారు. గీత వృత్తికి భవిష్యత్తు కల్పించేందుకు నీటిపారుదల ప్రాజెక్టుల కాలువల గట్లపై ఈత, తాటి చెట్లు పెంచేలా చర్యలు తీసుకోవాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిని ఆదేశించారు. (వివరాలు 2లో..)




## పీఎం కేర్స్‌లో వేల కోట్లు చేసిన ఖర్చు నామమాత్రం!

**₹ 8,452 కోట్లలో వాడిందెంత? • విరాళాలు తగ్గినా నిధుల కొండ**

**పారదర్శకతపై అనేక ప్రశ్నలు**

అత్యవసర పరిస్థితుల్లో ప్రజలకు సహాయం అందించేందుకు ఏర్పాటు చేసిన పీఎం కేర్స్ ఫండ్ మరోసారి పారదర్శకత చర్చకు కేంద్రంగా మారింది. 202425 ఆర్థిక సంవత్సరంలో ఈ ఫండ్‌కు సుమారు ₹480 కోట్ల విరాళాలు అందాయి. అంతకుముందు ఏడాదితో పోలిస్తే విరాళాలు దాదాపు 30 శాతం తగ్గాయి. దేశీయ విరాళాలు సుమారు ₹479 కోట్లకు పరిమితం కాగా, విదేశీ విరాళాలు ₹92.8 లక్షలకు తగ్గినట్లు తాజా ఆడిట్ వివరాలు వెల్లడించాయి.



## నీట్ నిరసనలపై కేసులకు సుప్రీం బ్రేక్

**విద్యార్థులపై ఎఫ్ఐఆర్‌ల రద్దుకు సిద్ధం**

నీట్ యూజీ పేపర్ లీక్‌కు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా జరిగిన నిరసనల్లో పాల్గొన్న విద్యార్థులపై నమోదైన ఎఫ్ఐఆర్‌ల విషయంలో సుప్రీంకోర్టు కీలక నిర్ణయం తీసుకుంది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 142 కింద ఉన్న ప్రత్యేక అధికారాన్ని ఉపయోగించి విద్యార్థులపై నమోదైన ఎఫ్ఐఆర్‌లను రద్దు చేసేందుకు సిద్ధమని సుప్రీంకోర్టు మంగళవారం స్పష్టం చేసింది. (3లో..)

## 22-ఏ భూములపై సమరం

**• ప్రభుత్వం జవాబు చెప్పాలి • పొంగులేటి రాజీనామా చేయాలి**

**• నిషేధిత జాబితాలో పెట్టిందెవరు? • ప్రజలకు చెప్పాల్సిందే: హరీశ్ రావు**



మల్కాజ్‌గిరిలో 22ఏ నిషేధిత భూముల జాబితాను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ నిర్వహించిన నిరసన కార్యక్రమంలో మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నేత హరీశ్ రావు తీవ్ర స్థాయిలో ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. "సమస్యలు పరిష్కరించాల్సిన ప్రభుత్వం కొత్త సమస్యలు సృష్టిస్తోంది. రాత్రికి రాత్రే కాలనీలకు కాలనీలను 22ఏ జాబితాలో చేరిస్తే ప్రజలు ఎక్కడికి పోవాలి?" అని నిలదీశారు. 2008లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం యూఎల్‌సీని రద్దు చేసిన తర్వాత ఆ భూములు (వివరాలు 2లో..)

## ధరణి పోయినా... భూదందా ధోరణి పోలేదు

**22-ఏపై ప్రభుత్వాన్ని నిలదీసిన ఎంపీ ఈటల**



హైదరాబాద్‌లోని నాంపల్లి బీజేపీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఎంపీ ఈటల రాజేందర్ రాష్ట్ర ప్రభుత్వ భూవిధానాలపై తీవ్ర విమర్శలు చేశారు. "ధరణి పోయింది కానీ ధోరణి పోలేదు.. భూభారతి కాదు ఇది భూహారతి" అంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. కేసీఆర్ హయాంలో ధరణి కారణంగా పేదల భూ హక్కులు దెబ్బతిన్నాయని ఆరోపించిన ఆయన.. అధికారంలోకి వస్తే ధరణిని రద్దు చేసి (వివరాలు 2లో..)



## తప్పు ఒప్పుకున్నాం.. .సరిదిద్దుతున్నాం

**• 22ఏ భూములపై పొంగులేటి క్లారిటీ • 24 గంటల్లో 34 రిజిస్ట్రేషన్లు పూర్తి**

22ఏ నిషేధిత భూముల జాబితా విషయంలో ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. హైకోర్టు ఆదేశాల మేరకు భూముల వివరాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసే సమయంలో క్షేత్రస్థాయిలో జరిగిన పొరపాట్ల వల్ల కొన్ని ప్రైవేట్ భూములు 22ఏ జాబితాలో చేరాయని వివరించారు. తప్పు జరిగిందని ప్రభుత్వం బహిరంగంగా అంగీకరించిందని, అదే సమయంలో దాన్ని సరిదిద్దే బాధ్యత కూడా తీసుకుందని చెప్పారు. 24 గంటల్లోనే మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాలో 30, రంగారెడ్డి జిల్లాలో 4 కలిపి 34 రిజిస్ట్రేషన్లు పూర్తయ్యాయని తెలిపారు. పేదల న్యాయబద్ధమైన భూమిలో ఒక్క అంగుళం కూడా అన్యాయం జరగనివ్వబోమని హామీ ఇచ్చారు. (2లో..)




## పాలకులు మారినా పరిస్థితుల్లో నో చేంజ్.. ప్రభుత్వంపై ప్రజల్లో పెరుగుతున్న రివేంజ్

- అధికార కేంద్రం చుట్టూ తెలంగాణ దారులు
- రాజకీయ ముఖచిత్రం మార్చనున్న ప్రెజర్ గ్రూపులు

తెలంగాణ ఇప్పుడు మరో కీలక రాజకీయ మలుపు ముందు నిలబడింది. అధికారం ఎవరిది అన్నది మాత్రమే కాదు.. తెలంగాణ ఎవరిది అన్న ప్రశ్న మళ్లీ గుండెల్లో గర్జిస్తోంది. ఒకవైపు రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ మరోసారి అధికారంలోకి వస్తామని ధీమాగా చెబుతోంది. మరోవైపు కేసీఆర్ నాయకత్వంలో బీఆర్ఎస్ తిరిగి పీఠం దక్కించుకుంటామని నమ్మకం ప్రకటిస్తోంది. బీజేపీ మాత్రం ఒక్కసారి అవకాశం ఇవ్వాలని ప్రజలను కోరుతోంది. ఈ మూడు పార్టీల పోటీకి మించి ఇప్పుడు మరో స్వరం బలపడుతోంది. తెలంగాణ కోసం కొట్లాడిన వాళ్ల తెలంగాణ ఎక్కడ? ఉద్యమంలో రక్తం చిందించిన యువతకు ఏం దక్కింది? ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న తరానికి ఎవరు జవాబు చెబుతారు? తెలంగాణ వనరులపై మొదటి హక్కు తెలంగాణ ప్రజలదే కాదా? అన్న ప్రశ్నలు రాజకీయ వేదికలపైకి వస్తున్నాయి. కాంగ్రెస్ పార్టీలోనే ఉంటూ... కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి లాంటి నాయకులు ఈ ప్రశ్నలను గట్టిగా లేవనెత్తితే, కాంగ్రెస్‌లోనే ప్రెజర్ గ్రూపులతో... తెలంగాణ రాజకీయ ముఖచిత్రం ఒక్కసారిగా మారే అవకాశం కన్పిస్తోంది. కేసీఆర్ మళ్లీ రావాలన్న బీఆర్ఎస్ ఆకాంక్ష, రేవంత్ దీర్ఘకాల పాలన లక్ష్యం, బీజేపీ ప్రత్యామ్నాయ వ్యూహం, కవిత కొత్త రాజకీయ ఆలోచనలు.. ఇవన్నీ ఒకవైపు ఉంటే... తెలంగాణ దొరలెవరు.. దొంగలెవరు.. అన్న ట్యాగ్‌లైన్... తెలంగాణ గుండె స్వరం మరోవైపు నిలుస్తోంది. రాబోయే రోజుల్లో ఈ స్వరం ఎవరిని నిలబెడుతుంది? ఎవరిని కూలదోస్తుంది? ఇదే తెలంగాణ రాజకీయాల అసలు కథ. అయితే ఇక పదండి... చదవండి..!



## యూఏఈలో మిసైల్ ముప్పు కలకలం

**సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని హెచ్చరిక**

**అన్నంత పని చేసిన ఇరాన్**

యూఏఈలో మరోసారి క్షిపణి ముప్పు హెచ్చరిక కలకలం రేపింది. దేశంపై క్షిపణి దాడి జరిగే అవకాశం ఉందని రక్షణ వ్యవస్థలు గుర్తించినట్లు యూఏఈ అధికారులు ప్రకటించారు. ప్రజలు వెంటనే సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని, అధికారిక మార్గాల ద్వారా వచ్చే హెచ్చరికలను మాత్రమే పాటించాలని సూచించారు. (వివరాలు 3లో..)




## విగ్రహం నిలబడితేనే భయమా?

**పెద్ది విగ్రహం తొలగింపుపై కేటీఆర్ ఫైర్**

తెలంగాణ ఉద్యమకారుడు, దివంగత మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి విగ్రహాన్ని రాత్రికి రాత్రే తొలగించడం పాశవిక చర్య అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా మండిపడ్డారు. నర్సంపేట గడ్డపై పెద్ది సుదర్శన్‌రెడ్డి విగ్రహం నిలబడితేనే కాంగ్రెస్ ప్రభుత్వానికి ముచ్చెమటలు పడుతున్నాయని ఆయన ఆరోపించారు. అందుకే పోలీసులను ఉపయోగించి అర్ధరాత్రి విగ్రహాన్ని తొలగించారని విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మెప్పు కోసం పోలీసులు దొంగల్లా రాత్రివేళ వ్యవహరించాల్సిన పరిస్థితి ఎందుకు వచ్చిందని ప్రశ్నించారు. పోలీసులు రాజకీయ ఆదేశాలకు కాకుండా చట్టానికి, ప్రజాస్వామ్య విలువలకు కట్టుబడి పనిచేయాలని సూచించారు. అధికారం ఎవరికీ శాశ్వతం కాదనే విషయాన్ని ప్రభుత్వం గుర్తుంచుకోవాలని హెచ్చరించారు. (వివరాలు 2లో..)

## బీజేపీకి అనుబంధంగా ఈసీ

**రాజ్యాంగ సంస్థలపై కమలం ప్రభావం**

**ఓటు హక్కు కోసం కాంగ్రెస్ సమరం**

**టీపీసీసీ చీఫ్ సంచలన ఆరోపణలు**

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం 2014 నుంచి రాజ్యాంగ సంస్థలను బలహీనపరుస్తోందని టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బి. మహేష్‌కుమార్ గౌడ్ ఆరోపించారు. ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా కూడా బీజేపీ అనుబంధ సంస్థగా మారిందని ఆయన తీవ్ర వ్యాఖ్యలు చేశారు. తెలంగాణలో కొనసాగుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్, సర్ ప్రక్రియపై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు ఉండేలా చర్యలు తీసుకోవాలని, సర్ గడువును పొడిగించాలని ఈసీని కోరారు. ఈ ప్రక్రియలో పేదలు, సామాన్యులు తమ ఓటు హక్కును కోల్పోయే పరిస్థితి రాకుండా స్పష్టమైన రక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. (వివరాలు 2లో..)






## వినాయక మండపాలకు ఫ్రీ పవర్

**కరీంనగర్ కార్పొరేషన్ కీలక నిర్ణయం**

**అన్ని మండపాలకు ఉచిత విద్యుత్ • బండి సంజయ్ వెల్లడి**

## దిమాగీ నక్సల్ వ్యాఖ్యల కలకలం

**మోదీపై కేజ్రీవాల్ తీవ్ర విమర్శలు**

**భగత్‌సింగ్, అంబేద్కర్ ఏమవుతారు?**

**అలా ఐతే నేనూ దిమాగీ నక్సల్‌నే!**



ప్రధాని నరేంద్ర మోదీపై ఆమ్‌ఆద్మీ పార్టీ అధినేత అరవింద్ కేజ్రీవాల్ తీవ్ర విమర్శలు చేశారు. దేశ వ్యవస్థను ప్రశ్నించే వారిని 'దిమాగీ నక్సల్స్'గా ముద్ర వేస్తున్నారని ఆరోపించారు. దేశభక్తితో వ్యవస్థలోని లోపాలను ప్రశ్నిస్తే తనను కూడా 'దిమాగీ నక్సల్' అని పిలిచినా గర్విస్తానని వ్యాఖ్యానించారు. (వివరాలు 3లో..)

## కేబీఆర్ పార్క్ చుట్టూ వన్ వే తిప్పలు

**ప్రయోగం తొలిరోజే ట్రాఫిక్ చిక్కులు**

**లబోదిబోమన్న వాహనదారులు**




హైదరాబాద్‌లో కేబీఆర్ పార్క్ చుట్టూ వన్‌వే ట్రాఫిక్ విధానం అమల్లోకి వచ్చిన తొలిరోజే గందరగోళం నెలకొంది. ఉదయం 6 గంటల నుంచి కొత్త ట్రాఫిక్ విధానం అమలు చేయడంతో వాహనదారులు, పాదచారులు, బస్సు ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సాధారణంగా కొన్ని నిమిషాల్లో చేరుకునే ప్రాంతాలకు వెళ్లేందుకు పలువురు కిలోమీటర్ల కొద్దీ చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఏర్పడింది. కేబీఆర్ పార్క్ హైదరాబాద్ తూర్పు, పడమర ప్రాంతాలను కలిపే కీలక మార్గం కావడంతో ప్రభావం మరింత ఎక్కువగా కనిపించింది. హెచ్‌సిటీ నిర్మాణ పనుల కారణంగా రహదారి అందుబాటులో తగ్గిపోవడంతో ట్రాఫిక్‌ను సులభతరం చేసేందుకు ఈ వన్‌వే విధానాన్ని తీసుకొచ్చినట్లు పోలీసులు తెలిపారు. అయితే తొలిరోజే వాహనాల రద్దీ బంపర్ టు బంపర్‌గా మారడంతో ప్రయాణికుల్లో అసహనం పెరిగింది. (వివరాలు 2లో..)




## కాంగ్రెస్‌లో టికెట్ రగడ

**చిన్నారెడ్డిపై మేఘారెడ్డి ఫిర్యాదు**

**హస్తంలో అంతా అంతేనన్న జీవన్ రెడ్డి**



# సర్దార్ పాపన్న స్ఫూర్తితో సామాజిక న్యాయం

- గీత కార్మికులకు అండగా ఉన్నామన్న సీఎం

**సర్దార్ పాపన్నకు ఘన నివాళి**

సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ బహుజనుల ఆత్మగౌరవానికి ప్రతీక అని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. పాపన్న ఒక కులానికి, కుటుంబానికి పరిమితమైన వ్యక్తి కాదని, బహుజనుల నుంచి పుట్టుకొచ్చిన వీరుడని పేర్కొన్నారు. గోల్కొండ కోటపై జెండా ఎగురవేసిన ఆయన పోరాట స్ఫూర్తి తెలంగాణ తరతరాలకు ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. పాపన్న విగ్రహం కోసం ట్యాంక్‌బండ్ వద్ద పర్యాటక శాఖ కార్యాలయాన్ని మరోచోటికి తరలించి స్థలం కేటాయించినట్లు చెప్పారు. హైదరాబాద్‌కు వచ్చే పర్యాటకులు, గణేష్ నిమజ్జన సమయంలో ట్యాంక్‌బండ్ మీదుగా వెళ్లే ప్రతి ఒక్కరికీ పాపన్న స్ఫూర్తి కనిపించేలా ఆ ప్రాంతాన్ని ఎంపిక చేశామని వివరించారు. మహారాష్ట్రలో శివాజీ మహారాజ్‌కు మరాఠీలు ఇచ్చే గౌరవం తెలంగాణలో పాపన్నకు దక్కాలని సీఎం ఆకాంక్షించారు.

**చదువుతోనే పిల్లల తలరాత మార్పు**

కులవృత్తులను కొనసాగిస్తూ గౌరవించుకోవాలని, అయితే పిల్లలను మాత్రం తప్పనిసరిగా చదివించాలని రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. బలహీన వర్గాల పిల్లలు డాక్టర్లు, న్యాయవాదులు, ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లు కావాలని, తెలంగాణ పునర్నిర్మాణంలో భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు. విద్యార్థుల కోసం ఎన్ని నిధులైనా కేటాయిస్తామని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో సన్నబియ్యంతో భోజనం, నాణ్యమైన అల్పాహారం, పాలు, రాగిజావ అందిస్తున్నామని తెలిపారు. ఏటీసీల్లో చేరే విద్యార్థులకు నెలకు ₹2 వేల ఉపకార వేతనం అందిస్తున్నామని వెల్లడించారు. బీసీ కులగణన, ఎస్సీ ఉపకులాల వర్గీకరణ ద్వారా సామాజిక న్యాయానికి ప్రభుత్వం బాటలు వేసిందని చెప్పారు. "ఇది నా ప్రభుత్వం కాదు.. మన ప్రభుత్వం" అంటూ ప్రజల సంక్షేమం, సామాజిక న్యాయం, సమాన అవకాశాలే లక్ష్యంగా పాలన సాగిస్తామని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

# 22-ఏ భూములపై సమరం



- ప్రభుత్వం జవాబు చెప్పాలి
- పొంగులేటి రాజీనామా చేయాలి
- ప్రజలకు చెప్పాల్సిందే: హరీశ్ రావు

మల్కాజ్‌గిరిలో 22ఏ నిషేధిత భూముల జాబితాను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ నిర్వహించిన నిరసన కార్యక్రమంలో మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నేత హరీశ్ రావు తీవ్ర స్థాయిలో ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. "సమస్యలు పరిష్కరించాల్సిన ప్రభుత్వం కొత్త సమస్యలు సృష్టిస్తోంది. రాత్రికి రాత్రే కాలనీలకు కాలనీలను 22ఏ జాబితాలో చేరిస్తే ప్రజలు ఎక్కడికి పోవాలి?" అని నిలదీశారు. 2008లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం యూఎల్‌సీని రద్దు చేసిన తర్వాత ఆ భూములు పట్టా భూములుగా మారి, ప్రజలు ఏళ్లుగా అక్కడ నివసిస్తున్నారని చెప్పారు. 20 ఏళ్లుగా లేని సమస్యను ఇప్పుడు ఎందుకు సృష్టించారో ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. రంగారెడ్డిలో 7,500కు పైగా జీఓల ద్వారా మినహాయింపు పొందిన భూములు, మేడ్చల్‌లో 6,000కు పైగా భూములు, హెచ్ఎండీఏ, హుడా భూములు కూడా నిషేధిత జాబితాలో చేరాయని ఆరోపించారు.

**బాధ్యులెవరో తేల్చాలి**

భూమిని విక్రయించేందుకు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లే వరకు తమ ఆస్తి 22ఏ జాబితాలో ఉందన్న విషయం కూడా ప్రజలకు తెలియడం లేదని హరీశ్ రావు అన్నారు. తిలక్‌నగర్‌కు చెందిన అశోక్ 450 గజాల ఇంటిని విక్రయించేందుకు వెళ్లిన తర్వాత నిషేధిత జాబితాలో ఉన్నట్లు తెలిసిందని ఉదాహరణగా చెప్పారు. "నిషేధిత జాబితాలో భూములను పెట్టాలని చెప్పింది ఎవరు? ఆదేశాలు ఇచ్చింది ఎవరు? అధికారుల పేర్లు చెప్పి తప్పించుకుంటామంటే చూస్తూ ఊరుకోం" అని హెచ్చరించారు. బిగ్ టీవీ జర్నలిస్ట్ అశోక్ తన సమస్యను సోషల్ మీడియాలో వెల్లడించారని, ఆయన ఒక్కరే కాదని, రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది మంది ఇలాంటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం చేసిన తప్పులకు ప్రజలు అధికారుల చుట్టూ తిరిగి చెప్పులు అరిగించుకోవాలా అని ప్రశ్నించారు. జాబితాలో చేర్చిన భూముల వివరాలు, తొలగించిన భూముల వివరాలను పబ్లిక్ డొమైన్‌లో ఉంచి వైట్ పేపర్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

**మంత్రి రాజీనామా చేయాలి**

నిషేధిత భూముల వ్యవహారంలో రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి నైతిక బాధ్యత వహించి వెంటనే పదవికి రాజీనామా చేయాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు. "నిషేధిత జాబితాలో పెట్టింది మీరే.. తీసేయాల్సింది కూడా మీరే. ప్రజల నుంచి దరఖాస్తులు తీసుకోకుండా, కార్యాలయాల చుట్టూ తిప్పకుండా భూములను జాబితా నుంచి తొలగించాలి" అని అన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన టోల్‌ఫ్రీ నంబర్ కూడా సక్రమంగా పనిచేయడం లేదని విమర్శించారు. సీఎం రేవంత్ రెడ్డి సంబంధిత మంత్రిపై చర్యలు తీసుకోవాలని, లేకపోతే ఇద్దరూ కలిసి కుట్రపూరితంగా భూదందాకు పాల్పడుతున్నారన్న అనుమానాలు ప్రజల్లో బలపడతాయని హెచ్చరించారు. 22ఏ భూములపై అసెంబ్లీ వేదికగా బీఆర్ఎస్ పోరాటం చేస్తుందని, బాధితులకు తెలంగాణ భవన్‌లోని "జనతా గ్యారేజీ" ఎప్పుడూ అందుబాటులో ఉంటుందని తెలిపారు. భవిష్యత్తులో బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే తప్పుడు పనులకు బాధ్యులైన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హరీశ్ రావు స్పష్టం చేశారు.

# ధరణి పోయినా... భూదందా ధోరణి పోలేదు

**22-ఏపై ప్రభుత్వాన్ని నిలదీసిన ఎంపీ ఈటల**

హైదరాబాద్‌లోని నాంపల్లి బీజేపీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఎంపీ ఈటల రాజేందర్ రాష్ట్ర ప్రభుత్వ భూవిధానాలపై తీవ్ర విమర్శలు చేశారు. "ధరణి పోయింది కానీ ధోరణి పోలేదు.. భూభారతి కాదు ఇది భూహారతి" అంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. కేసీఆర్ హయాంలో ధరణి కారణంగా పేదల భూ హక్కులు దెబ్బతిన్నాయని ఆరోపించిన ఆయన.. అధికారంలోకి వస్తే ధరణిని రద్దు చేసి బంగాళాఖాతంలో వేస్తామని చెప్పిన రేవంత్ రెడ్డి ఇప్పుడు భూభారతితో ప్రజలను మరింత ఇబ్బందులకు గురిచేస్తున్నారని విమర్శించారు. 22ఏ నిషేధిత భూముల జాబితా వల్ల ముఖ్యంగా మల్కాజ్‌గిరి నియోజకవర్గ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు.

**22-ఏపై తీవ్ర అభ్యంతరాలు**

ఏళ్ల తరబడి సాగు చేసుకుంటున్న భూములను ప్రభుత్వ భూముల పేరుతో లాక్కోవడం దౌర్జన్యమని ఈటల ఆరోపించారు. బడంగిపేట, దుండిగల్, బోరంపేట, బొమ్మరాసుపేట, ఎన్కేపల్లి, హాజీజ్‌నగర్, హిమాయత్‌నగర్, పెద్దమంగళారం ప్రాంతాల్లో భూముల సమస్యలను ఆయన ప్రస్తావించారు. దుండిగల్‌లో సర్వే నంబర్లు 452, 453లో సుమారు 400 ఎకరాలు, బోరంపేటలో 166, 472 సర్వే నంబర్లలో సాగుభూములు వివాదంలో ఉన్నాయని చెప్పారు. 50 నుంచి 80 ఏళ్లుగా సాగు చేసుకుంటున్న రైతుల భూములను కూడా ఇప్పుడు స్వాధీనం చేసుకునే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. ప్రజల భూ హక్కులపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆర్టీఐల ద్వారా అధ్యయనం చేశానని చెప్పుకుంటున్నారని, అయితే పరిష్కారాలు ఎందుకు కనిపించడం లేదని ప్రశ్నించారు.

**ఫినిక్స్, హానర్ హోమ్స్‌పై ఆరోపణలు**



కూకట్‌పల్లి ఎల్లమ్మబండలోని భూముల వ్యవహారాన్ని కూడా ఈటల ప్రస్తావించారు. పేదలు, జర్నలిస్టులకు గతంలో కేటాయించిన భూములపై వివాదాలు కొనసాగుతున్నాయని చెప్పారు. ఇండియన్ డిటోనేటర్ కంపెనీ తర్వాత గల్ఫ్ ఆయిల్ కార్పొరేషన్‌కు సంబంధించిన భూముల విషయంలోనూ అక్రమాలు జరిగాయని ఆరోపించారు. ఫినిక్స్ కంపెనీపై ఆరోపణలు చేస్తూ, హానర్ హోమ్స్ నిర్మాణానికి సంబంధించిన భూముల వ్యవహారంపై ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. వేల కోట్ల విలువైన భూములపై చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. పేదల భూములను కాపాడే బాధ్యత బీజేపీ తీసుకుంటుందని స్పష్టం చేశారు. భూములు అమ్మి ₹10 లక్షల కోట్ల వరకు సమీకరించాలనే కుట్ర జరుగుతోందని ఆరోపించిన ఈటల.. భూదందాలపై ప్రజా ఉద్యమాలతో పాటు దేశంలోని అత్యున్నత దర్యాప్తు సంస్థలను ఆశ్రయిస్తామని హెచ్చరించారు.

# బీజేపీకి అనుబంధంగా ఈసీ

- రాజ్యాంగ సంస్థలపై కమలం ప్రభావం
- ఓటు హక్కు కోసం కాంగ్రెస్ సమరం
- టీపీసీసీ చీఫ్ సంచలన ఆరోపణలు



**అన్ని ఓట్లపై అనుమానాలా?**

తెలంగాణలో సుమారు 3.38 కోట్ల మంది ఓటర్లు ఉన్నారని మహేష్ గౌడ్ తెలిపారు. ఓటర్ల జాబితాలో భారీ స్థాయిలో వ్యత్యాసాలు ఉన్నాయని ఆయన ఆరోపించారు. 32.37 లక్షల ఓటు రికార్డులు 'అన్‌మ్యాప్డ్'గా, మరో 60.50 లక్షల రికార్డులు 'అనామలీస్'గా గుర్తించారని చెప్పారు. ఈ రెండు విభాగాల్లో కలిపి సుమారు 92 లక్షల ఓటర్ రికార్డులు పరిశీలనలో ఉన్నాయని పేర్కొన్నారు. ఏఎస్‌బీడీ అంటే గైర్హాజరు, వేరే ప్రాంతానికి వెళ్లిన వారు, మరణించిన వారు, డూప్లికేట్ ఓటర్లుగా గుర్తించిన రికార్డుల విషయంలోనూ స్పష్టత ఇవ్వాలని కోరారు. సుమారు 1.6 కోట్ల ఓటర్ రికార్డులను ఎందుకు పరిశీలనకు పెట్టారు? అర్హులైన ఓటర్లను తొలగించే అధికారం ఎవరికుంది? అని మహేష్ గౌడ్ ప్రశ్నించారు.

**పేదల ఓటు హక్కుకు ముప్పు**

2002 నాటి ఓటింగ్ రికార్డులకు సంబంధించిన నిబంధన కారణంగా పలువురు ప్రజలు ఎన్యుమరేషన్ ఫారాలు పొందలేకపోతున్నారని మహేష్ గౌడ్ ఆరోపించారు. దీంతో అర్హత ఉన్న ప్రజలు ఓటర్ల జాబితా నుంచి బయటపడే ప్రమాదం ఉందన్నారు. కాంగ్రెస్ సుమారు 35 వేల బూత్ లెవల్ ఏజెంట్లను నియమించినా, ఈసీ కేవలం 13,100 మందిని మాత్రమే గుర్తించిందని తెలిపారు. అవసరమైన జాబితాలు, రసీదులు సమర్పించిన తర్వాత కూడా వ్యత్యాసాలు ఎలా వచ్చాయని ప్రశ్నించారు. అనామలీస్, అన్‌మ్యాప్డ్ విభాగాల్లో ఉన్న ప్రతి ఓటు వివరాలను ఈసీ బహిరంగంగా వెల్లడించాలని డిమాండ్ చేశారు. ఓటు హక్కు ప్రజాస్వామ్యానికి పునాది కాబట్టి ఒక్క అర్హుడి ఓటు కూడా తొలగించకూడదని, తెలంగాణలో సర్ ప్రక్రియకు మరింత సమయం ఇచ్చి పూర్తి పారదర్శకతతో నిర్వహించాలని మహేష్ గౌడ్ స్పష్టం చేశారు.

# తప్పు ఒప్పుకున్నాం.. .సరిదిద్దుతున్నాం

- 22ఏ భూములపై పొంగులేటి క్లారిటీ
- 24 గంటల్లో 34 రిజిస్ట్రేషన్లు పూర్తి



22ఏ నిషేధిత భూముల జాబితా విషయంలో ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. హైకోర్టు ఆదేశాల మేరకు భూముల వివరాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసే సమయంలో క్షేత్రస్థాయిలో జరిగిన పొరపాట్ల వల్ల కొన్ని ప్రైవేట్ భూములు 22ఏ జాబితాలో చేరాయని వివరించారు. తప్పు జరిగిందని ప్రభుత్వం బహిరంగంగా అంగీకరించిందని, అదే సమయంలో దాన్ని సరిదిద్దే బాధ్యత కూడా తీసుకుందని చెప్పారు. 24 గంటల్లోనే మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాలో 30, రంగారెడ్డి జిల్లాలో 4 కలిపి 34 రిజిస్ట్రేషన్లు పూర్తయ్యాయని తెలిపారు. పేదల న్యాయబద్ధమైన భూమిలో ఒక్క అంగుళం కూడా అన్యాయం జరగనివ్వబోమని హామీ ఇచ్చారు.

**15 రోజులు రోజువారీ పరిశీలన**

గత ప్రభుత్వాల కాలంలో వివిధ జీవోలు, మెమోల ద్వారా క్రమబద్ధీకరించిన ప్రైవేట్ భూములు, హైకోర్టు, జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ అనుమతులు పొందిన స్థలాలు కూడా సాంకేతిక లోపంతో 22ఏ జాబితాలో చేరాయని మంత్రి తెలిపారు. సమస్య పరిష్కారం కోసం రెవెన్యూ ప్రిన్సిపల్ సెక్రటరీ, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ ఐజీతో పాటు ఉన్నతాధికారులతో ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేశామని చెప్పారు. రాబోయే 15 రోజుల పాటు ప్రతిరోజూ దరఖాస్తులను పరిశీలించి, నిజమైన ప్రైవేట్ ఆస్తులను వెంటనే క్లియర్ చేస్తామని వెల్లడించారు. ప్రజలను కార్యాలయాల చుట్టూ తిప్పే ఉద్దేశం ప్రభుత్వానికి లేదని స్పష్టం చేశారు.

**హరీశ్ వ్యాఖ్యలకు పొంగులేటి కౌంటర్**

22ఏలో కావాలనే భూములు చేర్చి వాటిని తొలగించేందుకు డబ్బులు వసూలు చేస్తున్నారన్న బీఆర్ఎస్ నేత హరీశ్ రావు ఆరోపణలను పొంగులేటి తీవ్రంగా ఖండించారు. "మేం తప్పును ఒప్పుకుని దిద్దుతున్నాం.. ధరణి పేరుతో జరిగిన తప్పులకు మీరు ఎప్పుడైనా బాధ్యత తీసుకున్నారా?" అని ప్రశ్నించారు. కాళేశ్వరం విషయంలో జరిగిన పరిణామాలకు హరీశ్ రావు బాధ్యత తీసుకున్నారా అని నిలదీశారు. తప్పును అధికారులపై నెట్టి ప్రభుత్వం తప్పించుకోదని చెప్పారు. ఇదే సమయంలో బీజేపీ ఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి చేస్తున్న ఆరోపణలపై స్పందిస్తూ ఆధారాలు ఉంటే ప్రజల ముందు పెట్టాలని సవాల్ చేశారు. ఫీనిక్స్, రాఘవ వంటి సంస్థలతో వ్యాపార లావాదేవీలు జరగడం సహజమని, వాటిని రాజకీయ ఆరోపణలకు ఉపయోగించడం సరికాదన్నారు. ప్రజల ఆస్తులకు సంపూర్ణ రక్షణ కల్పించడం ప్రభుత్వ బాధ్యత అని మంత్రి మరోసారి స్పష్టం చేశారు.

# వినాయక మండపాలకు ఫ్రీ పవర్



వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని అన్ని వినాయక మండపాలకు ఉచిత విద్యుత్ అందించాలని నిర్ణయించినట్లు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ తెలిపారు. మండపాలకు వచ్చే విద్యుత్ బిల్లులను కార్పొరేషనే భరిస్తుందని చెప్పారు. భక్తులు ప్రశాంతమైన భక్తి వాతావరణంలో ఉత్సవాలను నిర్వహించాలని ఆయన కోరారు. కరీంనగర్ నగరంలో ప్రతి ఏడాది సుమారు 2 వేల వినాయక మండపాలు ఏర్పాటు అవుతున్నాయని తెలిపారు. గత మూడేళ్లుగా మండపాల విద్యుత్ ఖర్చులను తానే భరించానని, ఇప్పుడు మేయర్ పదవి బీజేపీ ఆధ్వర్యంలో ఉండటంతో కార్పొరేషన్ ఈ బాధ్యత తీసుకుందని వివరించారు.

**అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు**

కరీంనగర్ పర్యటనలో బండి సంజయ్ పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. 21వ డివిజన్ శ్రీరామ్‌నగర్ కాలనీలో మున్సిపల్ జనరల్ ఫండ్ నుంచి ₹1 కోటి వ్యయంతో సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులకు భూమిపూజ చేశారు. 16వ డివిజన్ లక్ష్మీపూర్, మల్కాపూర్ కాలనీల్లో 15వ ఆర్థిక సంఘం నిధులతో ₹15 లక్షలతో చేపట్టే నీటి పైప్‌లైన్ పనులకు కూడా శంకుస్థాపన చేశారు. నగర అభివృద్ధికి రాజకీయాలకు అతీతంగా కార్పొరేటర్లు కలిసి పనిచేయాలని బండి సంజయ్ సూచించారు. ఎన్నికలు పూర్తయ్యాక రాజకీయ విభేదాలను పక్కనపెట్టి అభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు.

**₹22 వేల కోట్ల అభివృద్ధి లక్ష్యం**

కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గంలో మొత్తం ₹22 వేల కోట్ల విలువైన అభివృద్ధి పనులు చేపట్టినట్లు బండి సంజయ్ తెలిపారు. ఇందులో జాతీయ రహదారుల అభివృద్ధికి ₹5 వేల కోట్లు కేటాయించినట్లు చెప్పారు. కరీంనగర్‌కు 100 రోజుల్లో ₹840 కోట్ల యూసీఎఫ్ నిధులు సాధించినట్లు వివరించారు. గతంలో స్మార్ట్ సిటీ పథకం కింద వచ్చిన ₹940 కోట్ల నిధులను నగర అభివృద్ధికి వినియోగించినట్లు తెలిపారు. కరీంనగర్‌ను తెలుగు రాష్ట్రాల్లో అభివృద్ధి, భారీ కార్యక్రమాలకు ప్రముఖ గమ్యస్థానంగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని స్పష్టం చేశారు. మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ సునీల్ రావు, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, పలువురు కార్పొరేటర్లు కార్యక్రమాల్లో పాల్గొన్నారు.




# కేబీఆర్ పార్క్ చుట్టూ వన్ వే తిప్పలు

- ప్రయోగం తొలిరోజే ట్రాఫిక్ చిక్కులు
- లబోదిబోమన్న వాహనదారులు

**ఐదు కిలోమీటర్ల డిటూర్**

జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్, రోడ్ నంబర్ 5, యూసుఫ్‌గూడ, శ్రీనగర్ కాలనీ, మధురానగర్ ప్రాంతాల్లో ట్రాఫిక్ ప్రభావం స్పష్టంగా కనిపించింది. చెక్‌పోస్ట్ వద్ద గతంలో కుడివైపు మలుపు తీసుకునే వాహనాలు ఇప్పుడు దాదాపు ఐదు కిలోమీటర్ల డిటూర్ తీసుకోవాల్సి వచ్చింది. రోడ్ నంబర్ 5 జూబ్లీహిల్స్ మెట్రో స్టేషన్ సమీపంలో ఓ ప్రయాణికుడు సుమారు అరగంట ట్రాఫిక్‌లో చిక్కుకున్నట్లు తెలిపాడు. పాదచారులు రోడ్డు దాటేందుకు కూడా ఇబ్బందులు పడ్డారు. బస్సులు పట్టుకోవాల్సిన వారు, కార్యాలయాలకు వెళ్లే ఉద్యోగులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. సోషల్ మీడియాలోనూ ట్రాఫిక్ మళ్లింపుపై తీవ్ర విమర్శలు వచ్చాయి. ఉద్యోగులు ఆలస్యంగా చేరుకునే పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని కార్యాలయాలకు ఒక గంట గ్రేస్ పీరియడ్ ఇవ్వాలని కొందరు డిమాండ్ చేశారు. ఆసుపత్రులు సమీపంలో ఉండటంతో అంబులెన్స్‌ల రాకపోకలపై కూడా ఆందోళన వ్యక్తమైంది.

**200 మందితో ట్రాఫిక్ నియంత్రణ**

ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించేందుకు 200 మందికి పైగా పోలీసు సిబ్బందిని రంగంలోకి దించారు. బీట్ కానిస్టేబుళ్లు, హోంగార్డులతో పాటు పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ స్థాయిలో అధికారులు పరిస్థితిని పర్యవేక్షించారు. మార్గాలను సూచించేందుకు పలుచోట్ల సైన్‌బోర్డులు ఏర్పాటు చేశారు. తొలిరోజు గందరగోళం సహజమేనని ట్రాఫిక్ పోలీసులు చెబుతున్నారు. కొత్త మార్గాలను అర్థం చేసుకునే సమయంలో వాహనదారులు ఆగి పోలీసులను ప్రశ్నించడం కూడా రద్దీకి కారణమవుతోందని అధికారులు తెలిపారు. కేబీఆర్ పార్క్ ప్రవేశం వద్ద సిగ్నల్ దగ్గర పాదచారులు రోడ్డు దాటేలా అవకాశం కల్పించామని, ఇతర ప్రాంతాల్లో ఎదురవుతున్న సమస్యలను పరిశీలించి పరిష్కారం చూపుతామని చెప్పారు. ముఖ్యమైన ప్రాంతాల్లో పోలీసులు 24 గంటలూ అందుబాటులో ఉండేలా సిబ్బందిని మోహరిస్తామని వెల్లడించారు. కొత్త విధానం సాఫీగా అమలైతే రద్దీ తగ్గే అవకాశం ఉన్నా, తొలి రోజు అనుభవం మాత్రం నగరవాసులకు ట్రాఫిక్ తిప్పలు తప్పవని స్పష్టం చేసింది.

# విగ్రహం నిలబడితేనే భయమా?

**పెద్ది విగ్రహం తొలగింపుపై కేటీఆర్ ఫైర్**



తెలంగాణ ఉద్యమకారుడు, దివంగత మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి విగ్రహాన్ని రాత్రికి రాత్రే తొలగించడం పాశవిక చర్య అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా మండిపడ్డారు. నర్సంపేట గడ్డపై పెద్ది సుదర్శన్‌రెడ్డి విగ్రహం నిలబడితేనే కాంగ్రెస్ ప్రభుత్వానికి ముచ్చెమటలు పడుతున్నాయని ఆయన ఆరోపించారు. అందుకే పోలీసులను ఉపయోగించి అర్ధరాత్రి విగ్రహాన్ని తొలగించారని విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మెప్పు కోసం పోలీసులు దొంగల్లా రాత్రివేళ వ్యవహరించాల్సిన పరిస్థితి ఎందుకు వచ్చిందని ప్రశ్నించారు. పోలీసులు రాజకీయ ఆదేశాలకు కాకుండా చట్టానికి, ప్రజాస్వామ్య విలువలకు కట్టుబడి పనిచేయాలని సూచించారు. అధికారం ఎవరికీ శాశ్వతం కాదనే విషయాన్ని ప్రభుత్వం గుర్తుంచుకోవాలని హెచ్చరించారు.

**అరెస్టులపై కేటీఆర్ ఆగ్రహం**


విగ్రహ తొలగింపును నిరసిస్తూ ఆందోళన చేస్తున్న ఉమ్మడి వరంగల్ జిల్లా బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలను అరెస్టు చేయడం, గృహనిర్బంధాలు విధించడాన్ని కూడా కేటీఆర్ తప్పుబట్టారు. శాసనసభ విపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి, మాజీ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్, మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ సహా పలువురు నేతలను నిర్బంధించడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. అరెస్టు చేసిన వారిని బేషరతుగా వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పార్టీ కార్యకర్తలపై అక్రమ కేసులు పెడితే సహించబోమని హెచ్చరించారు. ప్రజల నిరసన హక్కులను అణచివేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని స్పష్టం చేశారు.

**పెద్ది కుటుంబానికి అండగా ఉంటాం**

ఇప్పటికే విషాదంలో ఉన్న పెద్ది సుదర్శన్‌రెడ్డి కుటుంబ సభ్యుల మనోధైర్యాన్ని విగ్రహ తొలగింపు వంటి చర్యలతో దెబ్బతీయవద్దని కేటీఆర్ కోరారు. బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి వస్తుందని, నర్సంపేట మెడికల్ కాలేజీకి పెద్ది సుదర్శన్‌రెడ్డి పేరు పెడతామని ఆయన ప్రకటించారు. ఆయన తెలంగాణ కోసం చేసిన పోరాటాన్ని శాశ్వతంగా గుర్తుండేలా చేస్తామని తెలిపారు. పెద్ది విగ్రహం తొలగింపుపై ప్రభుత్వం వెంటనే వెనక్కి తగ్గాలని డిమాండ్ చేస్తూ, ఈ వ్యవహారం ప్రజాస్వామ్య హక్కులు, ఉద్యమకారుల గౌరవానికి సంబంధించిన అంశమని కేటీఆర్ స్పష్టం చేశారు.

# కాంగ్రెస్‌లో టికెట్ రగడ

- చిన్నారెడ్డిపై మేఘారెడ్డి ఫిర్యాదు
- హస్తంలో అంతా అంతేనన్న జీవన్ రెడ్డి



కాంగ్రెస్‌లో టికెట్ కేటాయింపుపై మరోసారి అంతర్గత వివాదం తెరపైకి వచ్చింది. వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి పార్టీ సీనియర్ నేత, రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ జి. చిన్నారెడ్డిపై టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌కు ఫిర్యాదు చేశారు. 2023 ఎన్నికల్లో బీఫామ్ కేటాయింపు విషయంలో చిన్నారెడ్డి చేసిన వ్యాఖ్యలు పార్టీ అధిష్ఠానం, కొందరు నేతల ప్రతిష్ఠను దెబ్బతీసేలా ఉన్నాయని ఫిర్యాదులో పేర్కొన్నారు. తన ఎమ్మెల్యే టికెట్‌ను హైకమాండ్, కొందరు నాయకులు అమ్ముకున్నారన్నట్టుగా చిన్నారెడ్డి వ్యాఖ్యానించారని ఆరోపించారు. ఒక పార్టీ ఎమ్మెల్యేపై ఇలాంటి వ్యాఖ్యలు చేయడాన్ని తీవ్రంగా పరిగణించాలని మేఘారెడ్డి కోరారు. పార్టీ క్రమశిక్షణ, ఐక్యత, ప్రతిష్ఠకు నష్టం కలిగించే వ్యాఖ్యలపై సమగ్ర విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

**వీడియో ఆధారాలు.. కాల్ డేటాపైనా విచారణ**


చిన్నారెడ్డి చేసిన వ్యాఖ్యలకు సంబంధించిన వీడియో ఆధారాలను ఫిర్యాదుతో పాటు మేఘారెడ్డి సమర్పించారు. వనపర్తి నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై కూడా చిన్నారెడ్డి విమర్శలు చేశారని తెలిపారు. ఈ వ్యాఖ్యల వెనుక ఉన్న వాస్తవాలను పూర్తిగా వెలికి తీయాలని కోరారు. అవసరమైతే కొందరు నేతల కాల్ డేటాను కూడా పరిశీలించాలని విజ్ఞప్తి చేశారు. పార్టీకి మరింత నష్టం జరగకుండా టీపీసీసీ వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ వ్యవహారంపై క్రమశిక్షణ కమిటీ పరిశీలన చేపట్టే అవకాశం ఉండటంతో కాంగ్రెస్‌లో అంతర్గత విభేదాలు మరోసారి బహిర్గతమయ్యాయి. టికెట్ కేటాయింపు, బీఫామ్ వ్యవహారం, పార్టీ అధిష్ఠానంపై వ్యాఖ్యలు ఇప్పుడు కాంగ్రెస్‌లో చర్చనీయాంశంగా మారాయి.

**రేవంత్ రెడ్డి లిమిటెడ్ కంపెనీ.. జీవన్ రెడ్డి విమర్శలు**

ఈ వివాదంపై బీఆర్ఎస్ మాజీ మంత్రి, నేత జీవన్‌రెడ్డి తీవ్రంగా స్పందించారు. కాంగ్రెస్ పార్టీ "రేవంత్ రెడ్డి లిమిటెడ్ కంపెనీలా మారింది" అంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. "నేను కూడా జీవన్‌రెడ్డిలా తిరగబడతాను" అంటూ చిన్నారెడ్డి చేసిన వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ.. ఆయనది ధిక్కార స్వరం కాదని, పార్టీలో నెలకొన్న పరిస్థితులపై ఆవేదనగా చూడాలని అన్నారు. కాంగ్రెస్‌లో అసలైన కాంగ్రెస్ నేతలు మిగలకపోవచ్చని వ్యాఖ్యానించారు. డబ్బులు ఇచ్చినవారికే టికెట్లు దక్కుతున్నట్లుగా పార్టీ పరిస్థితి మారిందని ఆరోపించారు. మేఘారెడ్డి ఫిర్యాదు, చిన్నారెడ్డి వ్యాఖ్యలు, జీవన్‌రెడ్డి విమర్శలు కలిసి తెలంగాణ కాంగ్రెస్‌లో టికెట్ కేటాయింపులు, అంతర్గత ప్రజాస్వామ్యం, పార్టీ క్రమశిక్షణపై కొత్త రాజకీయ చర్చకు తెరతీశాయి.

# అవమానం!

- రామమందిరం విరాళాలపై కలకలం
- దుర్వినియోగం భక్తుల విశ్వాసానికి దెబ్బ
- నిర్మాణ కమిటీ చైర్మన్ మిశ్రా ఆవేదన
- నిర్వహణలో మార్పులకు కీలక నిర్ణయాలు



అయోధ్య రామమందిరానికి భక్తులు సమర్పించిన విరాళాల దుర్వినియోగం ఆరోపణలు తీవ్ర కలకలం రేపుతున్నాయి. ఈ వ్యవహారం అవమానకరమని రామమందిర నిర్మాణ కమిటీ చైర్మన్ నృపేంద్ర మిశ్రా ఆవేదన వ్యక్తం చేశారు. జరిగిన పరిణామాలపై క్షమాపణలు చెప్పాల్సి రావడం బాధాకరంగా ఉందన్నారు. దేశవ్యాప్తంగా భక్తులు ఎంతో విశ్వాసంతో సమర్పించిన విరాళాల విషయంలో ఇలాంటి ఆరోపణలు రావడం ఆలయ ప్రతిష్ఠతో పాటు భక్తుల నమ్మకంపైనా ప్రభావం చూపే అంశంగా మారింది.

### నిర్వహణలో కీలక మార్పులు


ఈ వ్యవహారం ఇక కేవలం రామమందిర నిర్మాణానికి సంబంధించిన అంశం కాదని, ఆలయ నిర్వహణ వ్యవస్థకు సంబంధించిన కీలక సమస్యగా మారిందని నృపేంద్ర మిశ్రా స్పష్టం చేశారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా నిర్వహణ విధానంలో అవసరమైన మార్పులు తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. ట్రస్ట్‌లో బాధ్యతలు, ఆర్థిక వ్యవహారాల పర్యవేక్షణ మరింత పారదర్శకంగా ఉండేలా చర్యలు తీసుకునే దిశగా కసరత్తు జరుగుతోంది. ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి చంపత్ రాయ్, ట్రస్టీ అనిల్ మిశ్రా రాజీనామాలు కూడా ఈ పరిణామాలకు మరింత ప్రాధాన్యం తెచ్చాయి.

### సీఈవో నియామకంపై దృష్టి

ఆలయ ట్రస్టుకు ప్రత్యేక సీఈవోను నియమించాలనే ఆలోచన తొలినాళ్ల నుంచే ఉందని నృపేంద్ర మిశ్రా తెలిపారు. రిటైర్డ్ జడ్జి నేతృత్వంలో ఉన్నత స్థాయి కమిటీ ఏర్పాటు చేసి సమర్థమైన అభ్యర్థిని ఎంపిక చేసి ట్రస్టుకు సిఫార్సు చేయనున్నారు. తుది నిర్ణయం మాత్రం ట్రస్ట్ తీసుకోనుంది. ఇదే సమయంలో రామమందిర నిర్మాణ పనులు తుది దశకు చేరుకున్నాయి. పాత ఆలయాన్ని స్మారకంగా మార్చే పనులు దాదాపు పూర్తయ్యాయి. నిరంతరం వెలిగే జ్యోతి ఏర్పాటు వంటి కొన్ని పనులు మాత్రమే మిగిలాయి. ఆలయ ప్రాంగణం చుట్టూ సుమారు 4 కిలోమీటర్ల ప్రహరీ గోడ, ఆడిటోరియం వంటి అదనపు నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. కొన్ని పనులు నవంబర్, డిసెంబర్ నాటికి పూర్తయ్యే అవకాశం ఉంది. భక్తుల విశ్వాసాన్ని కాపాడేందుకు పారదర్శక ఆర్థిక నిర్వహణ, కఠిన పర్యవేక్షణ, స్పష్టమైన బాధ్యతలు ఇప్పుడు అత్యంత కీలకంగా మారాయి.

# నీట్ నిరసనలపై కేసులకు సుప్రీం బ్రేక్

## విద్యార్థులపై ఎఫ్ఐఆర్‌ల రద్దుకు సిద్ధం



నీట్ యూజీ పేపర్ లీక్‌కు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా జరిగిన నిరసనల్లో పాల్గొన్న విద్యార్థులపై నమోదైన ఎఫ్ఐఆర్‌ల విషయంలో సుప్రీంకోర్టు కీలక నిర్ణయం తీసుకుంది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 142 కింద ఉన్న ప్రత్యేక అధికారాన్ని ఉపయోగించి విద్యార్థులపై నమోదైన ఎఫ్ఐఆర్‌లను రద్దు చేసేందుకు సిద్ధమని సుప్రీంకోర్టు మంగళవారం స్పష్టం చేసింది.

### 2,873 మందిపై మాత్రమే దర్యాప్తు

చీఫ్ జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ముగ్గురు సభ్యుల ధర్మాసనం విద్యార్థులను మాత్రమే నిందితులుగా పేర్కొన్న ఎఫ్ఐఆర్‌ల జాబితాను సమర్పించాలని ఆదేశించింది. విద్యార్థులపై నమోదైన కేసులను పరిశీలించి, శాంతియుతంగా నిరసన తెలిపిన వారిపై చర్యలు తీసుకోకుండా రక్షణ కల్పించాలన్న దిశగా కోర్టు ముందుకు సాగింది. ఢిల్లీ పోలీసులు గుర్తించిన 2,873 మంది తీవ్ర నేర చరిత్ర కలిగిన వ్యక్తులపై మాత్రమే దర్యాప్తు కొనసాగిస్తామని కేంద్రం తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా కోర్టుకు తెలిపారు. వీరిలో హత్య, అత్యాచారం, బాలలపై లైంగిక నేరాలు వంటి తీవ్రమైన కేసులు ఎదుర్కొంటున్న హిస్టరీ షీటర్లు ఉన్నారని వివరించారు. మిగిలిన వారు విద్యార్థులేనని ఆయన కోర్టుకు తెలిపారు.

### 'వారిని గుర్తించాల్సిందే'

'అవాంఛనీయ వ్యక్తులు' అంటూ సాధారణంగా చెప్పడం సరిపోదని జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చి స్పష్టం చేశారు. అలాంటి వ్యక్తులను కనీసం గుర్తించి వివరాలు ఇవ్వాల్సిందేనని అన్నారు. ఎఫ్ఐఆర్‌ల పూర్తి జాబితా లేకుండా వాటిని ఎలా రద్దు చేయగలమని చీఫ్ జస్టిస్ సూర్యకాంత్ ప్రశ్నించారు. శాంతియుతంగా నిరసన తెలిపే విద్యార్థులకు రాజ్యాంగంలోని ఆర్టికల్ 19 కల్పించిన భావప్రకటన, అసమ్మతి హక్కు ఉందని చీఫ్ జస్టిస్ పేర్కొన్నారు. చట్టాన్ని ఉల్లంఘించే ఉద్దేశం లేకుండా తమ డిమాండ్లను అధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు శాంతియుతంగా ఆందోళన చేసిన విద్యార్థులను కోర్టు రక్షిస్తుందని స్పష్టం చేశారు.

### విద్యార్థులు.. నేరగాళ్లు ఒకటే కాదు


నిరసనల్లో పాల్గొన్న అమాయక విద్యార్థులు, హింసను ప్రేరేపించేందుకు చొరబడిన నేరచరిత్ర ఉన్న వ్యక్తుల మధ్య స్పష్టమైన తేడా ఉందని సుప్రీంకోర్టు పేర్కొంది. వేలాది మంది విద్యార్థుల భవిష్యత్తు, వారి కుటుంబాల ఆశలు ఈ కేసుతో ముడిపడి ఉన్నాయని చీఫ్ జస్టిస్ అన్నారు. వ్యవస్థపై విద్యార్థుల్లో నమ్మకాన్ని పెంచడం అత్యంత ముఖ్యమని వ్యాఖ్యానించారు. నిరసనల్లో మహిళా ఆందోళనకారులపై పోలీసులు లైంగిక వేధింపులకు పాల్పడ్డారన్న ఆరోపణలను కూడా హైపవర్ కమిటీ అత్యవసరంగా పరిశీలించనుంది. పేర్లు, గుర్తింపు వివరాలు లేకుండా మఫ్టీలో ఉన్న పోలీసులు నిరసనల్లో పాల్గొన్నారని పిటిషనర్ల తరఫు న్యాయవాదులు ఆరోపించారు. వారిపై అంతర్గతంగా ఎలాంటి చర్యలు తీసుకున్నారో పోలీసులు వెల్లడించలేదని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు.

### హైపవర్ కమిటీ ఏర్పాటు

నీట్ యూజీ నిరసనలకు సంబంధించిన అన్ని అంశాలను పరిశీలించేందుకు సుప్రీంకోర్టు హైపవర్ కమిటీని ఏర్పాటు చేయనుంది. పోలీసుల చర్యలు, విద్యార్థులపై కేసులు, నిరసనల సమయంలో జరిగిన హింస, మహిళా ఆందోళనకారులపై వచ్చిన ఆరోపణలు వంటి అంశాలను కమిటీ పరిశీలించనుంది. కమిటీలో మహిళా సభ్యురాలు కూడా ఉండాలని పిటిషనర్ల తరఫు న్యాయవాదులు సూచించారు. నీట్ పేపర్ లీక్‌లపై ఆగ్రహంతో రోడ్డెక్కిన విద్యార్థులపై కేసులు నమోదు చేయడం వారి భవిష్యత్తుపై ప్రభావం చూపకూడదన్న అభిప్రాయాన్ని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. శాంతియుత నిరసన హక్కును కాపాడుతూనే హింసకు పాల్పడిన నేరచరిత్ర ఉన్న వ్యక్తులపై చట్టపరమైన చర్యలు కొనసాగించాల్సిన అవసరాన్ని కోర్టు గుర్తించింది. ఈ నేపథ్యంలో రేపు వెలువడే ఆదేశాలు దేశవ్యాప్తంగా నమోదైన కేసులపై కీలక ప్రభావం చూపే అవకాశం ఉంది.

# పీఎం కేర్స్‌లో వేల కోట్లు

- చేసిన ఖర్చు నామమాత్రం!
- ₹ 8,452 కోట్లలో వాడిందెంత?
- విరాళాలు తగ్గినా నిధుల కొండ
- పారదర్శకతపై అనేక ప్రశ్నలు




అత్యవసర పరిస్థితుల్లో ప్రజలకు సహాయం అందించేందుకు ఏర్పాటు చేసిన పీఎం కేర్స్ ఫండ్ మరోసారి పారదర్శకత చర్చకు కేంద్రంగా మారింది. 202425 ఆర్థిక సంవత్సరంలో ఈ ఫండ్‌కు సుమారు ₹480 కోట్ల విరాళాలు అందాయి. అంతకుముందు ఏడాదితో పోలిస్తే విరాళాలు దాదాపు 30 శాతం తగ్గాయి. దేశీయ విరాళాలు సుమారు ₹479 కోట్లకు పరిమితం కాగా, విదేశీ విరాళాలు ₹92.8 లక్షలకు తగ్గినట్లు తాజా ఆడిట్ వివరాలు వెల్లడించాయి.

### ఆదాయం మాత్రం ₹1,279.9 కోట్లు

విరాళాలు తగ్గినప్పటికీ పీఎం కేర్స్ మొత్తం ఆదాయం భారీగా పెరిగింది. విరాళాలతో పాటు బ్యాంకు డిపాజిట్లు, ఫిక్స్‌డ్ డిపాజిట్లపై వడ్డీ, అమలు సంస్థల నుంచి తిరిగి వచ్చిన నిధులను కలిపితే 202425లో మొత్తం ఆదాయం ₹1,279.9 కోట్లకు చేరింది. అంతకుముందు ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే ఇది సుమారు 41 శాతం ఎక్కువ. అయితే ఇక్కడే ప్రధాన ప్రశ్న తలెత్తుతోంది. 202425లో వచ్చిన మొత్తం ఆదాయంతో పోలిస్తే పీఎం కేర్స్ ఫండ్ నుంచి ఖర్చయింది కేవలం ₹87.85 లక్షలు మాత్రమే. ఇది ఆ ఏడాది ఆదాయంలో సుమారు 0.1 శాతం. ఆర్థిక సంవత్సరం చివరికి అందుబాటులో ఉన్న మొత్తం నిధులతో పోలిస్తే ఈ వ్యయం సుమారు 0.01 శాతం మాత్రమేనని సమాచార హక్కు కార్యకర్త అంజలి భరద్వాజ్ పేర్కొన్నారు.

### ఖాతాలో ₹8,452.06 కోట్లు

202425 ఆర్థిక సంవత్సరం ముగిసే సమయానికి పీఎం కేర్స్ ఫండ్‌లో ₹8,452.06 కోట్ల క్లోజింగ్ బ్యాలెన్స్ ఉన్నట్లు ఆడిట్ పత్రాలు చెబుతున్నాయి. గత ఏడాది ముగింపు నిల్వతో పోలిస్తే ఇది 17.8 శాతం ఎక్కువ. ఇంత భారీ మొత్తం అందుబాటులో ఉన్నప్పటికీ అత్యవసర సహాయ కార్యక్రమాలకు నిధుల వినియోగం ఎందుకు పరిమితంగా ఉందన్న ప్రశ్నలు వస్తున్నాయి. 2020 మార్చిలో పీఎం కేర్స్ ఏర్పాటు చేసినప్పటి నుంచి 2025 మార్చి 31 వరకు వచ్చిన మొత్తం ఆదాయంలో 18.1 శాతం కన్నా తక్కువ మొత్తమే ఖర్చు చేసినట్లు తాజా లెక్కలు సూచిస్తున్నాయి. ప్రజారోగ్య అత్యవసర పరిస్థితులు, ప్రకృతి విపత్తులు వంటి సందర్భాల్లో సహాయం అందించాలన్న లక్ష్యంతో ఏర్పడిన ఫండ్‌లో వేల కోట్ల రూపాయలు నిల్వ ఉండటం విమర్శలకు కారణమవుతోంది.

### ₹324 కోట్లు ఎందుకు తిరిగొచ్చాయి?

202425లో వివిధ సంస్థల నుంచి ₹324 కోట్లు తిరిగి పీఎం కేర్స్‌కు చేరాయి. అయితే ఈ నిధులు ఏ ప్రాజెక్టులకు ఇచ్చారు, ఏ సంస్థలు తిరిగి చెల్లించాయి, ఎందుకు తిరిగి వచ్చాయి అనే వివరాలు ఆడిట్ ప్రకటనలో స్పష్టంగా లేవని తెలుస్తోంది. ఆడిట్ నివేదికకు సంబంధించిన వివరణాత్మక నోట్స్ కూడా అందుబాటులో లేకపోవడంపై ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి. పీఎం కేర్స్‌కు సంబంధించిన 202324, 202425 ఆడిట్ ఆర్థిక నివేదికలు ఆగస్టు 18న అందుబాటులోకి వచ్చాయి. 202223 తర్వాత వార్షిక ఆర్థిక వివరాలను బహిరంగంగా అప్‌లోడ్ చేయడంలో ఆలస్యం జరగడం ఇప్పటికే చర్చకు దారితీసింది. ఈ నేపథ్యంలో తాజాగా రెండు ఆర్థిక సంవత్సరాల లెక్కలు విడుదల కావడం ప్రాధాన్యం సంతరించుకుంది.

### ఆర్టీఐ పరిధిపై కొనసాగుతున్న వివాదం

పీఎం కేర్స్‌ను ప్రధానమంత్రి తన పదవీ హోదాలో చైర్మన్‌గా నిర్వహిస్తారు. కేంద్ర మంత్రులు ట్రస్టీలుగా ఉంటారు. అయినప్పటికీ ఇది సమాచార హక్కు చట్టం పరిధిలోని 'పబ్లిక్ అథారిటీ' కాదన్న వైఖరి వివాదానికి కారణమవుతోంది. పీఎస్‌యూల సీఎస్ఆర్ నిధులు, ప్రభుత్వ ఉద్యోగుల విరాళాలు కూడా ఈ ఫండ్‌కు వచ్చిన నేపథ్యంలో ప్రజలకు పూర్తి వివరాలు అందుబాటులో ఉండాలన్న డిమాండ్ కొనసాగుతోంది. పీఎం కేర్స్ లక్ష్యం అత్యవసర పరిస్థితుల్లో ప్రజలకు అండగా నిలవడం. అయితే ఒకవైపు ₹8,452 కోట్లకు పైగా నిల్వ, మరోవైపు 202425లో ₹87.85 లక్షల వ్యయం మాత్రమే నమోదు కావడం సహజంగానే ప్రశ్నలకు తావిస్తోంది. నిధులు ఎక్కడి నుంచి వచ్చాయి, ఎక్కడ వినియోగించారు, తిరిగి వచ్చిన ₹324 కోట్ల నేపథ్యం ఏమిటన్న అంశాలపై మరింత స్పష్టత కోరుతున్నారు.

# దిమాగీ నక్సల్ వ్యాఖ్యల కలకలం

- మోదీపై కేజ్రీవాల్ తీవ్ర విమర్శలు
- భగత్‌సింగ్, అంబేద్కర్ ఏమవుతారు?
- అలా ఐతే నేనూ దిమాగీ నక్సల్‌నే!



ప్రధాని నరేంద్ర మోదీపై ఆమ్‌ఆద్మీ పార్టీ అధినేత అరవింద్ కేజ్రీవాల్ తీవ్ర విమర్శలు చేశారు. దేశ వ్యవస్థను ప్రశ్నించే వారిని 'దిమాగీ నక్సల్స్'గా ముద్ర వేస్తున్నారని ఆరోపించారు. దేశభక్తితో వ్యవస్థలోని లోపాలను ప్రశ్నిస్తే తనను కూడా 'దిమాగీ నక్సల్' అని పిలిచినా గర్విస్తానని వ్యాఖ్యానించారు.

### భగత్‌సింగ్, అంబేద్కర్‌నూ వదలరు

భారత స్వాతంత్ర్య సమరయోధుడు భగత్‌సింగ్ ఈ రోజుల్లో జీవించి ఉంటే వ్యవస్థను ప్రశ్నించినందుకు ఆయనను కూడా ప్రధాని 'దిమాగీ నక్సల్' అని పిలిచేవారని కేజ్రీవాల్ అన్నారు. దేశంలో మార్పు కోరిన వారిని అలా ముద్ర వేయడం సరికాదని విమర్శించారు. సామాజిక సమానత్వం కోసం పోరాడిన డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌ను కూడా ఇదే విధంగా విమర్శించే పరిస్థితి ఉండేదని కేజ్రీవాల్ అన్నారు. ప్రజలకు సమాన హక్కులు, మెరుగైన పాలన కోసం ప్రశ్నించే వ్యక్తులను నక్సల్స్‌తో పోల్చడం సరికాదని వ్యాఖ్యానించారు.

### 'దేశభక్తుడినైతే దిమాగీ నక్సల్‌నే'

దేశంలో అవినీతికి వ్యతిరేకంగా పోరాడాలని, మంచి ప్రభుత్వ పాఠశాలలు, ఆసుపత్రులు, విద్యుత్, నీరు, డ్రైనేజీ, సుపరిపాలన కావాలని కోరుకునే వారిని 'దిమాగీ నక్సల్స్'గా పిలుస్తున్నారని కేజ్రీవాల్ ఆరోపించారు. తాను దేశభక్తుడినని, అవినీతి రహిత భారత్‌ను కోరుకుంటున్నానని, అందుకే తనను 'దిమాగీ నక్సల్' అని పిలిచినా గర్వంగా స్వీకరిస్తానని అన్నారు.

### స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంపై దుమారం

ఎర్రకోటపై స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో ప్రధాని మోదీ 'దిమాగీ నక్సల్స్' గురించి ప్రస్తావించారు. అలాంటి శక్తులను గుర్తించి, ఒంటరి చేయాల్సిన అవసరం ఉందని చెప్పారు. ఈ వ్యాఖ్యల తర్వాతే ప్రతిపక్ష నేతలు తీవ్రంగా స్పందిస్తున్నారు. దేశంలో పాలనను ప్రశ్నించడం, వ్యవస్థలో మార్పు కోరడం, ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని డిమాండ్ చేయడం నేరం కాదని కేజ్రీవాల్ అన్నారు. అభివృద్ధి చెందిన భారత్‌ను కలలు కనే వారు, అధికారాన్ని ప్రశ్నించేవారు అందరూ 'దిమాగీ నక్సల్స్' అవుతారా అని ప్రశ్నించారు.

# ఆర్ఎస్ఎస్‌పై తీవ్ర ఆరోపణలు

- రిజిస్ట్రేషన్ అంశంపై రాజకీయ దుమారం
- కర్ణాటక కాంగ్రెస్ చీఫ్ వివాదాస్పద వ్యాఖ్యలు



కర్ణాటకలో ఆర్ఎస్ఎస్‌పై కాంగ్రెస్ నేత బీకే హరిప్రసాద్ చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా తీవ్ర చర్చకు దారితీశాయి. జైష్‌ఎమొహమ్మద్, తాలిబన్, ఆర్ఎస్ఎస్‌ల మధ్య తేడా లేదని, ఈ మూడు సంస్థలు భారత్‌లో రిజిస్టర్ కాలేదని ఆయన వ్యాఖ్యానించారు. దేశభక్తి, చట్టపరమైన గుర్తింపు అంశాలను ప్రస్తావిస్తూ ఆయన చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదంగా మారాయి. వందేమాతరం వివాదంలో కేరళ వీసీ మోహనన్ కున్నుమ్మల్ చేసిన వ్యాఖ్యలను కూడా హరిప్రసాద్ సమర్థించారు. ఆర్ఎస్ఎస్ వందేమాతరం, జాతీయ గీతం ఆలపించదని, త్రివర్ణ పతాకాన్ని ఎగురవేయదని ఆయన ఆరోపించారు. దీంతో కర్ణాటక రాజకీయాల్లో ఆర్ఎస్ఎస్ చుట్టూ కొత్త రాజకీయ వేడి మొదలైంది.

### రిజిస్ట్రేషన్‌పై ప్రశ్నల వర్షం

హరిప్రసాద్ వ్యాఖ్యలు కర్ణాటక హోంమంత్రి ప్రియాంక్ ఖర్గే లేవనెత్తిన ప్రశ్నలకు మరింత ప్రాధాన్యం తెచ్చాయి. ఆర్ఎస్ఎస్ ఏ చట్టం కింద పనిచేస్తోంది? దేశవ్యాప్తంగా ఉన్న ఆస్తులు ఎవరి పేరుతో ఉన్నాయి? బ్యాంకు ఖాతాలు ఎవరి ఆధీనంలో ఉన్నాయి? విరాళాలు ఎలా స్వీకరిస్తున్నారు? ఆడిట్ లెక్కలు, పన్ను వివరాలు ఎక్కడ ఉన్నాయి? అంటూ ఖర్గే ప్రశ్నించారు. వందేమాతరం కార్యక్రమానికి అంతరాయం కలిగించారన్న ఆరోపణలపై కాంగ్రెస్ నేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీలపై ఎఫ్ఐఆర్ నమోదు కావడం కూడా రాజకీయ వివాదాన్ని మరింత పెంచింది. దీంతో ఆర్ఎస్ఎస్ చట్టపరమైన వ్యవహారాలపై కాంగ్రెస్ నేతలు వరుస ప్రశ్నలు సంధిస్తున్నారు.

### బీజేపీ వాదనతో ముదిరిన పోరు

ఈ వివాదానికి బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీఎల్ సంతోష్ చేసిన వ్యాఖ్యలు మరో మలుపు ఇచ్చాయి. ఆర్ఎస్ఎస్‌కు ప్రత్యేక చట్టపరమైన రిజిస్ట్రేషన్ అవసరం లేదని, 1925 నుంచి ప్రజల విశ్వాసంతో సంస్థ కొనసాగుతోందని ఆయన అన్నారు. దేశ విభజనతో పాటు పలు సంక్షోభ సమయాల్లో ఆర్ఎస్ఎస్ దేశం కోసం పనిచేసిందని, ప్రభుత్వ గుర్తింపు అవసరం లేదని వాదించారు. దీనిపై ప్రియాంక్ ఖర్గే స్పందిస్తూ చరిత్రను చట్టపరమైన పారదర్శకతకు ప్రత్యామ్నాయంగా చూడలేమని స్పష్టం చేశారు. సంస్థ ప్రభావం పెరిగే కొద్దీ ప్రజలకు జవాబుదారీతనం కూడా పెరగాలని అన్నారు. ఆస్తులు, విరాళాలు, బ్యాంకు ఖాతాలు, ఆర్థిక లావాదేవీలపై స్పష్టత కావాలని డిమాండ్ చేశారు. దీంతో ఆర్ఎస్ఎస్ రిజిస్ట్రేషన్ అంశం కాంగ్రెస్, బీజేపీ మధ్య మరో రాజకీయ పోరాటానికి కేంద్రంగా మారింది.




# ప్రొద్దుటూరులో 'వైట్ కాలర్' భూ దందా?

- భూ వ్యవహారాలపై సంచలన ఆరోపణలు

ప్రొద్దుటూరులో కోట్లాది రూపాయల విలువైన భూములను లక్ష్యంగా చేసుకుని 'వైట్ కాలర్' భూ దందాలు జరుగుతున్నాయని వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ నల్లబోతుల నాగరాజు ఆరోపించారు. అధికారుల సంతకాలు, ప్రభుత్వ సీళ్లను ఫోర్జరీ చేసి భూముల వ్యవహారాలను చక్కబెడుతున్నారన్నది ఆయన ప్రధాన ఆరోపణ. శ్రీనివాసనగర్‌లోని విలువైన భూమిపై మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి అనుచరులు కన్నేశారని ఆయన పేర్కొన్నారు. ఈ వ్యవహారంలో హాజరయ్య కీలక పాత్ర పోషించారని, సంబంధిత భూమిని రాచమల్లు సోదరుడు కిరణ్‌కు అప్పగించినట్లు ఆరోపణలు ఉన్నాయని తెలిపారు. "అధికారం లేకపోయినా పని పూర్తి చేశా.. రూ.2.5 కోట్లు ఇచ్చారు" అని హాజరయ్య చెప్పినట్లు నాగరాజు పేర్కొన్నారు. ఈ నెల 13న హాజరయ్య అరెస్టయిన విషయాన్ని ప్రస్తావిస్తూ, ఆయన వద్ద ఉన్న నగదును ఎందుకు స్వాధీనం చేసుకోలేదని ప్రశ్నించారు. పోలీస్ స్టేషన్‌లో ఉన్న సమయంలో అధికారులకు ఫోన్లు చేసి ఒత్తిడి తెచ్చారన్న అనుమానాలను వ్యక్తం చేశారు. మాజీ కౌన్సిలర్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి హాజరయ్యను కలవడంపైనా ప్రశ్నలు లేవనెత్తారు. రిమాండ్‌లో ఉన్న హాజరయ్యను కస్టడీలోకి తీసుకుని భూ వ్యవహారాలపై లోతైన విచారణ జరపాలని నాగరాజు డిమాండ్ చేశారు. త్వరలో హోంమంత్రిని కలిసి ఫిర్యాదు చేస్తామని తెలిపారు.

# యూఏఈలో మిసైల్ ముప్పు కలకలం

- సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని హెచ్చరిక




యూఏఈలో మరోసారి క్షిపణి ముప్పు హెచ్చరిక కలకలం రేపింది. దేశంపై క్షిపణి దాడి జరిగే అవకాశం ఉందని రక్షణ వ్యవస్థలు గుర్తించినట్లు యూఏఈ అధికారులు ప్రకటించారు. ప్రజలు వెంటనే సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని, అధికారిక మార్గాల ద్వారా వచ్చే హెచ్చరికలను మాత్రమే పాటించాలని సూచించారు.

### సురక్షిత భవనాల్లోకి వెళ్లాలని సూచన

నేషనల్ ఎమర్జెన్సీ క్రైసిస్ అండ్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీ ప్రజలను అప్రమత్తం చేసింది. ప్రస్తుత పరిస్థితులు, సంభావ్య క్షిపణి ముప్పును దృష్టిలో పెట్టుకుని సమీపంలోని సురక్షిత భవనంలో ఆశ్రయం పొందాలని అంతర్గత వ్యవహారాల శాఖ కూడా సూచించింది. ప్రజలు భయాందోళనలకు గురికాకుండా అధికారిక సమాచారాన్ని మాత్రమే అనుసరించాలని స్పష్టం చేసింది. యూఏఈలో కొన్ని నెలల తర్వాత ఇలాంటి క్షిపణి హెచ్చరిక రావడం ఇదే మొదటిసారి. మే నెలలో చివరిసారిగా ఇలాంటి హెచ్చరిక జారీ అయింది. జూన్‌లో సాంకేతిక లోపం కారణంగా జాతీయ ముందస్తు హెచ్చరిక వ్యవస్థ నుంచి ప్రజల ఫోన్లకు తప్పుడు మిసైల్ అలర్ట్ వెళ్లింది. తాజా హెచ్చరిక మాత్రం రక్షణ వ్యవస్థలు గుర్తించిన ముప్పుపై ఆధారపడి ఉందని అధికారులు తెలిపారు.

### ఇరాన్ దాడులతో గతంలో తీవ్ర నష్టం

ఫిబ్రవరి 28న మధ్యప్రాచ్య యుద్ధం ప్రారంభమైన సమయంలో ఇరాన్ దాడుల ప్రభావం యూఏఈపై తీవ్రంగా పడింది. దాదాపు 3,000 క్షిపణులు, డ్రోన్లు యూఏఈని లక్ష్యంగా చేసుకున్నట్లు సమాచారం. ఈ ప్రాంతంలోని ఇతర దేశాలతో పోలిస్తే యూఏఈపై దాడుల సంఖ్య ఎక్కువగా నమోదైంది. జూన్‌లో అమెరికా, ఇరాన్ మధ్య కుదిరిన అవగాహన ఒప్పందం తర్వాత యూఏఈపై దాడులు నిలిచిపోయాయి. అయితే ఆ ఒప్పందం తాజాగా ముగియడంతో మళ్లీ ఉద్రిక్తతలు పెరిగే పరిస్థితి కనిపిస్తోంది. మరోవైపు గల్ఫ్ ప్రాంతంలోని వాణిజ్యం, చమురు, గ్యాస్ సరఫరాలపై కూడా యుద్ధ ప్రభావం తీవ్రంగా పడింది.

### గల్ఫ్ దేశాల్లో మళ్లీ ఆందోళన

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియన్ జూన్ 17న అవగాహన ఒప్పందంపై సంతకాలు చేసినట్లు సమాచారం. మూడు నెలలకు పైగా కొనసాగిన యుద్ధానికి ముగింపు పలకడం, గల్ఫ్ ప్రాంతంలో వాణిజ్య రవాణాను పునరుద్ధరించడం ఈ ఒప్పందం లక్ష్యంగా నిలిచింది. అయితే ఒప్పందం గడువు ముగియడంతో మధ్యప్రాచ్యంలో మళ్లీ ఉద్రిక్తతలు పెరుగుతున్న సంకేతాలు కనిపిస్తున్నాయి. యూఏఈ తాజా హెచ్చరికతో గల్ఫ్ ప్రాంతంలో భద్రతా పరిస్థితులపై ఆందోళన పెరిగింది. ముఖ్యంగా చమురు, గ్యాస్ రవాణాకు కీలకమైన ఈ ప్రాంతంలో క్షిపణి ముప్పు కొనసాగితే అంతర్జాతీయ వాణిజ్యంపై కూడా ప్రభావం పడే అవకాశం ఉంది. ప్రస్తుతం యూఏఈ అధికారులు ప్రజలను అప్రమత్తంగా ఉండాలని సూచిస్తూ పరిస్థితిని నిశితంగా పర్యవేక్షిస్తున్నారు.



**ప్యానల్ స్పీకర్‌గా ప్రొద్దుటూరు ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి**

# కోనసీమ కొబ్బరి రైతులకు భరోసా

- దెబ్బతిన్న చెట్లకు కొత్త మొక్కలు



కోనసీమ కొబ్బరి రైతుల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టిందని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. రాష్ట్రంలో 1.18 లక్షల హెక్టార్లలో కొబ్బరి సాగు జరుగుతుండగా, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలోనే 36 వేల హెక్టార్లలో సాగు ఉందన్నారు. కాలువల్లో పూడికతీత సక్రమంగా జరగకపోవడంతో సముద్రపు ఉప్పునీరు వెనక్కి వచ్చి భూముల్లో లవణీయత పెరిగిందని వివరించారు. దీంతో ఆరోగ్యంగా కనిపించే చెట్లు సైతం అకస్మాత్తుగా చనిపోతున్నాయని చెప్పారు. దెబ్బతిన్న ప్రతి కొబ్బరి చెట్టు స్థానంలో కొత్త మొక్క నాటడంతో పాటు ఒక్కో మొక్కకు రూ.1,000 ఆర్థిక సాయం అందించేలా ప్రతిపాదనలు సిద్ధం చేశామని తెలిపారు. కొత్త మొక్కలు నాటడంతో మాత్రమే సమస్య పరిష్కారం కాదని, కాలువలు, డ్రెయిన్లలో పూడిక తొలగించి ఉప్పునీటి సమస్యకు మూలకారణాన్ని పరిష్కరించాల్సి ఉందని మంత్రి స్పష్టం చేశారు.



# గుడివాడలో లెగసీ వేస్ట్‌పై ఆగ్రహం

- దంపింగ్ యార్డులో చెత్త సమస్యపై ఫైర్
- ఏజెన్సీ నిర్లక్ష్యంపై పట్టాభి సీరియస్

కృష్ణా జిల్లా గుడివాడ మున్సిపాలిటీలో డంపింగ్ యార్డులో పేరుకుపోయిన లెగసీ వేస్ట్‌ను తొలగించడంలో ఏజెన్సీ నిర్లక్ష్యంపై స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. లెగసీ వేస్ట్‌ను సకాలంలో తొలగించకపోవడంతో పట్టణంలో ప్రతిరోజూ సేకరించే చెత్తను డంప్ చేయడం మున్సిపాలిటీకి పెద్ద సమస్యగా మారింది. విషయం తెలుసుకున్న పట్టాభిరామ్ మంగళవారం గుడివాడ మున్సిపల్ కార్యాలయాన్ని సందర్శించారు. మున్సిపల్ కమిషనర్ సింహాద్రి మనోహర్, ఇతర అధికారులతో పరిస్థితిపై సమీక్షించారు. ఏజెన్సీ జాప్యం కారణంగానే డంపింగ్ యార్డులో సమస్య తీవ్రమైందని అధికారులు వివరించారు. ప్రతిరోజూ వచ్చే చెత్తను తరలించేందుకు మున్సిపల్ సిబ్బంది ఇబ్బందులు పడుతున్న సమయంలో ఏజెన్సీ బాధ్యతారాహిత్యంగా వ్యవహరించడం సరికాదని పట్టాభిరామ్ మండిపడ్డారు. లెగసీ వేస్ట్‌ను వెంటనే తొలగించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఏజెన్సీ ప్రతినిధులను ఆదేశించారు. నిర్ణీత సమయంలో పనులు పూర్తి చేయకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పట్టణంలో పారిశుధ్య సమస్యలు తలెత్తకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు.



# ప్రపంచాన్ని ఊపేసిన పాట

### గ్యాంగ్నమ్ స్టైల్‌కు ఆరు బిలియన్ వ్యూస్

### పీఎస్‌వై సంపాదనపై ఆసక్తికర అంచనాలు

దక్షిణ కొరియా స్టార్ పీఎస్‌వై పాడిన 'గ్యాంగ్నమ్ స్టైల్' ప్రపంచ సంగీత చరిత్రలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించింది. 2012లో విడుదలైన ఈ పాటలోని హార్స్ రైడింగ్ డ్యాన్స్, ఆకట్టుకునే బీట్ ప్రపంచవ్యాప్తంగా వైరల్ అయ్యాయి. కోట్లాది మంది అభిమానులు ఈ పాటను అనుకరిస్తూ వీడియోలు రూపొందించారు. 'గ్యాంగ్నమ్ స్టైల్' యూట్యూబ్‌లో బిలియన్ వ్యూస్ దాటిన తొలి వీడియోగా చరిత్ర సృష్టించింది. ఇప్పుడు ఈ వీడియో దాదాపు 6 బిలియన్ వ్యూస్‌కు చేరుకుంది. దీంతో ఈ వీడియో ద్వారా PSYకి ఎంత ఆదాయం వచ్చిందన్న చర్చ మొదలైంది. కచ్చితమైన జీవితకాల ఆదాయాన్ని అధికారికంగా వెల్లడించలేదు. అయితే 2013లో 1.2 బిలియన్ వ్యూస్ సమయంలోనే ఈ వీడియో 8 మిలియన్ డాలర్లకు పైగా ప్రకటన ఆదాయం తెచ్చినట్లు గూగుల్ వెల్లడించింది. ప్రస్తుత వ్యూస్ ఆధారంగా ప్రకటనల ద్వారా హక్కుదారులకు కోట్ల డాలర్ల ఆదాయం వచ్చి ఉండొచ్చని అంచనాలు చెబుతున్నాయి. ఈ పాట పీఎస్‌వైని ప్రపంచ స్టార్‌గా నిలబెట్టడమే కాకుండా, భాషతో సంబంధం లేకుండా డిజిటల్ వేదికల ద్వారా పాటలు ప్రపంచ ప్రేక్షకులను చేరుకోగలవని నిరూపించింది. యూట్యూబ్, స్ట్రీమింగ్ ప్రాధాన్యాన్ని సంగీత పరిశ్రమకు చాటిచెప్పింది.





# స్థానిక ఎన్నికల్లో 34 శాతం బీసీ రిజర్వేషన్లు

- » బడుగుల జీవితాల్లో మార్పు తెచ్చే పెద్ద నిర్ణయం
- » ఎన్నికల హామీ మాత్రమే కాదు... రాజకీయ సిద్ధాంతం
- » ప్రతి బీసీ కుటుంబం గర్వంగా చెప్పుకొనే రోజు
- » టీడీపీ వచ్చాకే బీసీలు కీలక నేతలుగా ఎదిగారు
- » అసెంబ్లీలో సీఎం చంద్రబాబు వెల్లడి



వివరాలు5లో..


స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించడం బీసీల జీవితాల్లో మార్పు తీసుకొచ్చే అతిపెద్ద నిర్ణయమని ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు. అమరావతిలో శాసనసభలో జరిగిన చర్చలో ఆయన మాట్లాడుతూ ఇది కేవలం ఎన్నికల హామీ కాదని, తమ రాజకీయ సిద్ధాంతంలో భాగమని స్పష్టం చేశారు. హామీ ఇవ్వడంతో ఆగకుండా అమలు చేసి చూపిస్తున్నామని తెలిపారు. గ్రామీణ స్థానిక సంస్థల్లో 34 శాతం, పట్టణ స్థానిక సంస్థల్లో 33.33 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తామని వెల్లడించారు. బీసీలకు రాజకీయ సాధికారత కల్పించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. రాజ్యాంగ పరిమితులను పాటిస్తూ సామాజిక న్యాయం అందించడమే తమ విధానమని స్పష్టం చేశారు. ప్రతి బీసీ కుటుంబం గర్వంగా చెప్పుకునే రోజు ఇదని పేర్కొన్నారు.

# బీసీ సాధికారతకు టీడీపీ జై

### స్థానిక సంస్థలకు బీసీ బలం: లోకేశ్

తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచే బీసీలకు అండగా నిలుస్తోందని మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు. స్థానిక సంస్థల్లో బీసీలకు రిజర్వేషన్లపై ఏపీ కేబినెట్ తీసుకున్న నిర్ణయాన్ని ఆయన స్వాగతించారు. గ్రామీణ స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతం, పట్టణ స్థానిక సంస్థల్లో 33⅓ శాతం రిజర్వేషన్లు కల్పించాలన్న నిర్ణయం బీసీల రాజకీయ సాధికారతకు కీలక అడుగని లోకేశ్ అభిప్రాయపడ్డారు. ప్రజా ప్రభుత్వం బీసీలకు జైకొట్టిందని, జయహో బీసీ అని నినదిస్తోందని ఆయన పేర్కొన్నారు. ఏపీ పంచాయతీరాజ్ చట్టం 1994కు అనుగుణంగా రిజర్వేషన్ల అమలుకు నిర్ణయం తీసుకోవడం ద్వారా స్థానిక పాలనలో బీసీల భాగస్వామ్యం మరింత పెరగనుందని తెలిపారు. మేయర్లు, మున్సిపల్ చైర్మన్లను ప్రత్యక్ష ఎన్నికల ద్వారా ఎన్నుకునే విధానం తీసుకురావడం పాలనను ప్రజలకు మరింత చేరువ చేస్తుందని చెప్పారు. ప్రస్తుతం ఉన్న 13 జెడ్పీలను 28 జిల్లా పరిషత్‌లుగా ఏర్పాటు చేయాలన్న నిర్ణయం కూడా వికేంద్రీకరణకు దోహదపడుతుందని లోకేశ్ పేర్కొన్నారు. స్థానిక సంస్థల బలోపేతం, బీసీలకు రాజకీయ ప్రాతినిధ్యం, పాలనా వికేంద్రీకరణ దిశగా ఈ నిర్ణయాలు మరో ముందడుగని ఆయన వెల్లడించారు.





# అవమానం!

### రామమందిరం విరాళాలపై కలకలం

### దుర్వినియోగం భక్తుల విశ్వాసానికి దెబ్బ

### నిర్మాణ కమిటీ చైర్మన్ మిశ్రా ఆవేదన

### నిర్వహణలో మార్పులకు కీలక నిర్ణయాలు

అయోధ్య రామమందిరానికి భక్తులు సమర్పించిన విరాళాల దుర్వినియోగం ఆరోపణలు తీవ్ర కలకలం రేపుతున్నాయి. ఈ వ్యవహారం అవమానకరమని రామమందిర నిర్మాణ కమిటీ చైర్మన్ నృపేంద్ర మిశ్రా ఆవేదన వ్యక్తం చేశారు. జరిగిన పరిణామాలపై క్షమాపణలు చెప్పాల్సి రావడం బాధాకరంగా ఉందన్నారు. (వివరాలు 3లో..)



# ఆప్ నేత సత్యేందర్ జైన్ అరెస్ట్

### జల్ బోర్డు టెండర్ కేసులో ట్విస్ట్

ఆమ్ ఆద్మీ పార్టీ నేత, ఢిల్లీ మాజీ జలవనరుల మంత్రి సత్యేందర్ జైన్‌ను ఢిల్లీ అవినీతి నిరోధక శాఖ అరెస్ట్ చేసింది. ఢిల్లీ జల్ బోర్డు మురుగునీటి శుద్ధి ప్లాంట్ల ఆధునీకరణ టెండర్లలో అవకతవకలు, నిబంధనల మార్పు, కుట్రకు పాల్పడ్డారన్న ఆరోపణలపై ఈ చర్య తీసుకున్నారు. దర్యాప్తులో టెండర్ నిబంధనలు ఒక నిర్దిష్ట సాంకేతిక సంస్థకు అనుకూలంగా రూపొందించినట్లు అధికారులు పేర్కొన్నారు. (5లో..)



# ఎన్టీఆర్‌తో బీసీలకు రాజకీయ బలం

**• బడుగులకు అండ టీడీపీయే • అసెంబ్లీలో మంత్రి అచ్చెన్నాయుడు**

బీసీలకు రాజకీయంగా పెద్దపీట వేసింది తెలుగుదేశం పార్టీయేనని మంత్రి అచ్చెన్నాయుడు అన్నారు. అసెంబ్లీ సమావేశాల్లో బీసీ సాధికారత, రిజర్వేషన్లపై జరిగిన చర్చలో ఆయన మాట్లాడారు. ఎన్టీఆర్ టీడీపీ స్థాపించిన తర్వాత బలహీనవర్గాలకు రాజకీయ అవకాశాలు పెరిగాయని చెప్పారు.



# 34 శాతం రిజర్వేషన్లు

### బీసీలకు చరిత్రాత్మక హక్కు: సవిత

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం చరిత్రలో బీసీలు మరిచిపోలేని రోజని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత అన్నారు. అమరావతిలో అసెంబ్లీ చర్చ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో 34 శాతం, పట్టణ ప్రాంతాల్లో 33.33 శాతం రిజర్వేషన్లు అమలు చేయబోతున్నట్లు తెలిపారు.



# గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీలు

### వర్ల రామయ్య, రమాదేవికి ఛాన్స్

### రెండు స్థానాలకు అభ్యర్థుల ఖరారు

ఆంధ్రప్రదేశ్‌లో గవర్నర్ కోటాలో ఖాళీగా ఉన్న రెండు ఎమ్మెల్సీ స్థానాలకు కూటమి ప్రభుత్వం అభ్యర్థులను ఖరారు చేసింది. టీడీపీ సీనియర్ నేత, పొలిట్ బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య, బీసీ మహిళా నేత దళవాయి రమాదేవిలను ఎమ్మెల్సీ అభ్యర్థులుగా ఎంపిక చేసింది. ఈ మేరకు ప్రభుత్వం సిఫార్సులతో కూడిన దస్త్రాన్ని గవర్నర్ ఆమోదం కోసం పంపింది. దళిత సామాజికవర్గానికి చెందిన వర్ల రామయ్య టీడీపీలో సుదీర్ఘకాలంగా కీలకంగా పనిచేస్తున్నారు. (వివరాలు 5లో..)

# స్వరం.. గరం గరం... నానాజీ.. నో రాజీ

### కాపు కాయం.. పవన్ ను సీఎం చేస్తాం

జనసేనలో స్వరం క్రమంగా గరం గరంగా మారుతోంది. కూటమి ప్రభుత్వంలో భాగస్వామిగా ఉన్న ఆ పార్టీ ప్రజాప్రతినిధులు, నేతలు వరుసగా చేస్తున్న వ్యాఖ్యలు రాజకీయంగా కొత్త చర్చకు తెరలేపుతున్నాయి. స్థానిక సంస్థల ఎన్నికల్లో తమ బలాన్ని బట్టి సీట్లు అడుగుతామని తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ స్పష్టం చేసిన మరుసటి రోజే కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ చేసిన వ్యాఖ్యలు మరింత ప్రాధాన్యం సంతరించుకున్నాయి. (వివరాలు 5లో..)





# కశ్మీర్‌కు 10 వేల మంది ఉగ్రవాదులు?

### హాఫీజ్ సయీద్‌పై పాక్ మతగురువు ఆరోపణలు

**పాకిస్థాన్‌కు చెందిన మతగురువు అల్లామా నసీర్ మద్నీ చేసిన సంచలన వ్యాఖ్యలు మరోసారి కలకలం రేపాయి. ఆగస్టు 14న బహావల్‌నగర్‌లో నిషేధిత ఉగ్రవాద సంస్థకు సంబంధించిన సమావేశంలో ప్రసంగించిన ఆయన.. లష్కరే తోయిబా వ్యవస్థాపకుడు హాఫీజ్ సయీద్ కశ్మీర్‌కు 10 వేల మంది ఉగ్రవాదులను పంపించాడని ఆరోపించారు. ఇటీవల తీవ్ర గుండె సమస్యతో బాధపడిన మద్నీ మళ్లీ బహిరంగ కార్యక్రమంలో ఈ వ్యాఖ్యలు చేయడం చర్చనీయాంశమైంది. అయితే ఆయన చేసిన ఈ ఆరోపణలపై ఎలాంటి క్లారిటీ లేదు. అయినప్పటికీ, ఈ వ్యాఖ్యలు కశ్మీర్‌లో ఉగ్రవాద కార్యకలాపాల్లో లష్కరే తోయిబా పాత్ర, ఆ సంస్థ నిర్మాణం, సయీద్ పాత్రపై మరోసారి ప్రశ్నలు లేవనెత్తాయి. ఐక్యరాజ్యసమితి 2005లో అల్‌ఖైదా, తాలిబన్‌లతో సంబంధాల నేపథ్యంలో లష్కరే తోయిబాను ఆంక్షల జాబితాలో చేర్చింది. అమెరికా 2008లో హాఫీజ్ సయీద్‌ను అంతర్జాతీయ ఉగ్రవాదుల జాబితాలో చేర్చింది.**

**• భారత్‌లో కీలక ఉగ్ర కేసుల్లో సయీద్ పేరు**

భారత్‌లో జరిగిన పలు కీలక ఉగ్రదాడుల దర్యాప్తుల్లో హాఫీజ్ సయీద్ పేరు అనేకసార్లు వెలుగులోకి వచ్చింది. ముఖ్యంగా 2008 నవంబర్ 26న ముంబైపై జరిగిన 26/11 దాడుల్లో లష్కరే తోయిబా ప్రమేయంపై భారత దర్యాప్తు సంస్థలు ఆధారాలు వెల్లడించాయి. సముద్ర మార్గంలో ముంబై చేరుకున్న 10 మంది ఉగ్రవాదులు నాలుగు రోజులపాటు సాగించిన దాడుల్లో 166 మంది ప్రాణాలు కోల్పోగా, సుమారు 300 మంది గాయపడ్డారు. తాజాగా జమ్మూకశ్మీర్‌లోని పహల్గామ్ ఉగ్రదాడి కేసులోనూ సయీద్ పేరు దర్యాప్తులో ప్రస్తావనకు వచ్చింది. 2025 ఏప్రిల్‌లో జరిగిన ఈ దాడిలో 26 మంది, ఎక్కువగా పర్యాటకులు, మృతి చెందారు. జూలైలో జమ్మూ కోర్టు సయీద్‌పై పహల్గామ్ కేసుకు సంబంధించి నాన్‌బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది. మరోవైపు, ముంబై పోలీసులు పరారీలో ఉన్న ఆరుగురు పాకిస్థానీ నిందితులపై వారి గైర్హాజరీలో విచారణ చేపట్టేందుకు ప్రక్రియ ప్రారంభించారు. ఈ నేపథ్యంలో నసీర్ మద్నీ వ్యాఖ్యలు పాకిస్థాన్ నుంచి ఉగ్రవాద కార్యకలాపాలకు సంబంధించిన ఆరోపణలను మళ్లీ అంతర్జాతీయ చర్చలోకి తెచ్చాయి.



# ఆర్ఎస్ఎస్‌పై తీవ్ర ఆరోపణలు

### రిజిస్ట్రేషన్ అంశంపై రాజకీయ దుమారం

### కర్ణాటక కాంగ్రెస్ చీఫ్ వివాదాస్పద వ్యాఖ్యలు

కర్ణాటకలో ఆర్ఎస్ఎస్‌పై కాంగ్రెస్ నేత బీకే హరిప్రసాద్ చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా తీవ్ర చర్చకు దారితీశాయి. జైష్‌ఎమొహమ్మద్, తాలిబన్, ఆర్ఎస్ఎస్‌ల మధ్య తేడా లేదని, ఈ మూడు సంస్థలు భారత్‌లో రిజిస్టర్ కాలేదని ఆయన వ్యాఖ్యానించారు. దేశభక్తి, చట్టపరమైన గుర్తింపు అంశాలను ప్రస్తావిస్తూ ఆయన చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదంగా మారాయి. వందేమాతరం వివాదంలో కేరళ వీసీ మోహనన్ కున్నుమ్మల్ చేసిన వ్యాఖ్యలను కూడా హరిప్రసాద్ సమర్థించారు. ఆర్ఎస్ఎస్ వందేమాతరం, జాతీయ గీతం ఆలపించదని, త్రివర్ణ పతాకాన్ని ఎగురవేయదని ఆయన ఆరోపించారు. దీంతో కర్ణాటక రాజకీయాల్లో ఆర్ఎస్ఎస్ చుట్టూ కొత్త రాజకీయ వేడి మొదలైంది. (వివరాలు 5లో..)



# జగన్‌ను కలిసిన తూమాటి మాధవరావు

### డిప్యూటీ చైర్మన్ పదవికి నామినేషన్ దాఖలు

ఆంధ్రప్రదేశ్ శాసనమండలి డిప్యూటీ చైర్మన్ పదవికి వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసిన ఎమ్మెల్సీ తూమాటి మాధవరావు, పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో జగన్‌ను కలిసి ఆశీస్సులు తీసుకున్నారు. డిప్యూటీ చైర్మన్ అభ్యర్థిగా మాధవరావు పేరును జగన్ ఇప్పటికే ప్రకటించారు. నామినేషన్ అనంతరం ఎన్నికకు సంబంధించిన అంశాలపై ఇరువురు చర్చించారు. మాధవరావు ఎన్నిక సాఫీగా జరిగేలా పార్టీ ఎమ్మెల్సీలంతా సమన్వయంతో పనిచేసి పూర్తి మద్దతు ఇవ్వాలని జగన్ సూచించారు. పార్టీ ఎమ్మెల్సీల సహకారంతో ఎన్నికను విజయవంతంగా పూర్తి చేయాలని ఆకాంక్షించారు.

# డీఎస్సీ పేరెత్తితే ప్రభుత్వం పారిపోతోంది

### అక్రమాలపై సమాధానం చెప్పాలన్న బొత్స

డీఎస్సీ నియామకాల్లో అక్రమాలపై చర్చకు వైఎస్సార్‌సీపీ పట్టుబడితే ప్రభుత్వం రెండో రోజూ కూడా చర్చ నుంచి తప్పించుకుంటోందని శాసనమండలి విపక్ష నేత బొత్స సత్యనారాయణ ఆరోపించారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడుతూ పత్రికల్లో 'మేం దేనికైనా సిద్ధం' అంటూ ప్రకటనలు చేయడం తప్ప, సభలో వాస్తవాలను ఎదుర్కొనే ధైర్యం ప్రభుత్వానికి లేదని విమర్శించారు. స్పోర్ట్స్ కోటా కింద డీఎస్సీ పరీక్ష రాయకుండానే ఉద్యోగాలు ఇచ్చిన విధానం ఏ చట్టం ప్రకారం వచ్చిందో ప్రభుత్వం చెప్పాలని డిమాండ్ చేశారు. (వివరాలు 5లో..)





# వందేమాతరం వివాదం

### ఢిల్లీ పోలీసుల విచారణ

### సోనియా, రాహుల్‌పై ఫిర్యాదుతో కలకలం

స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా కాంగ్రెస్ ప్రధాన కార్యాలయంలో జరిగిన వందేమాతరం కార్యక్రమం ఇప్పుడు పోలీసుల విచారణకు దారితీసింది. ఆగస్టు 15న జరిగిన కార్యక్రమంలో జాతీయ గీతం విషయంలో అవమానకరంగా వ్యవహరించారన్న ఆరోపణలపై ఢిల్లీ పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ఈ ఘటనపై ఆగస్టు 16న ఓ న్యాయవాది ఐపీ ఎస్టేట్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. (వివరాలు 5లో..)




5లో..

# అమెరికా భూభాగంగా హర్మూజ్

### ట్రంప్ పోస్టుతో కొత్త కలకలం



# వందేమాతరం వివాదం

- ఢిల్లీ పోలీసుల విచారణ
- సోనియా, రాహుల్‌పై ఫిర్యాదుతో కలకలం

స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా కాంగ్రెస్ ప్రధాన కార్యాలయంలో జరిగిన వందేమాతరం కార్యక్రమం ఇప్పుడు పోలీసుల విచారణకు దారితీసింది. ఆగస్టు 15న జరిగిన కార్యక్రమంలో జాతీయ గీతం విషయంలో అవమానకరంగా వ్యవహరించారన్న ఆరోపణలపై ఢిల్లీ పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ఈ ఘటనపై ఆగస్టు 16న ఓ న్యాయవాది ఐపీ ఎస్టేట్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

**సోనియా, రాహుల్‌పై ఎఫ్ఐఆర్ డిమాండ్**

ఫిర్యాదుదారు కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీలపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని కోరారు. వందేమాతరం ఆలాపన సమయంలో జరిగినట్లు పేర్కొన్న ఘటనపై నిష్పక్షపాతంగా విచారణ జరిపి, ఆరోపణలు నిజమని తేలితే తగిన చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు. ఫిర్యాదులో చేసిన ఆరోపణల ప్రకారం.. కాంగ్రెస్ ప్రధాన కార్యాలయంలో వందేమాతరం ఆలాపన జరుగుతున్న సమయంలో ప్రారంభ భాగం పూర్తయిన తర్వాత సోనియా గాంధీ కొన్ని సంజ్ఞలు చేశారని పేర్కొన్నారు. ఆ సంజ్ఞలు పాటను కొనసాగించడంపై అభ్యంతరం వ్యక్తం చేసినట్లుగా కనిపించాయని ఫిర్యాదుదారు ఆరోపించారు. అయితే ఇవి ఫిర్యాదులోని ఆరోపణలు మాత్రమేనని, వాటిపై పోలీసుల విచారణ కొనసాగుతోంది.

**రాహుల్ వ్యాఖ్యలపై కూడా ఫిర్యాదు**

ఓ వీడియోను కూడా ఫిర్యాదుదారు పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు. అందులో రాహుల్ గాంధీ "మనం వందేమాతరం పాడటం లేదు" అన్నట్లుగా వినిపిస్తోందని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ వీడియో ఆధారంగా కూడా వాస్తవాలను పరిశీలించాలని కోరారు. ఈ వ్యవహారంపై బీజేపీ కాంగ్రెస్ నాయకులపై తీవ్ర విమర్శలు చేసింది. సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే జాతీయ గీతం పట్ల తీవ్ర నిరాదరణ చూపించారని ఆరోపించింది. కేంద్ర హోంమంత్రి అమిత్ షా కూడా కాంగ్రెస్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. బీజేపీ ఆరోపణలను కాంగ్రెస్ తీవ్రంగా ఖండించింది. వందేమాతరం అంశాన్ని రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగిస్తున్నారని విమర్శించింది. ఈ వ్యవహారం వాస్తవ ఘటన కంటే రాజకీయ వివాదంగా మార్చబడుతోందని కాంగ్రెస్ నేతలు ఆరోపించారు.

# డీఎస్సీ పేరెత్తితే ప్రభుత్వం పారిపోతోంది

## అక్రమాలపై సమాధానం చెప్పాలన్న బొత్స



డీఎస్సీ నియామకాల్లో అక్రమాలపై చర్చకు వైఎస్సార్‌సీపీ పట్టుబడితే ప్రభుత్వం రెండో రోజూ కూడా చర్చ నుంచి తప్పించుకుంటోందని శాసనమండలి విపక్ష నేత బొత్స సత్యనారాయణ ఆరోపించారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడుతూ పత్రికల్లో 'మేం దేనికైనా సిద్ధం' అంటూ ప్రకటనలు చేయడం తప్ప, సభలో వాస్తవాలను ఎదుర్కొనే ధైర్యం ప్రభుత్వానికి లేదని విమర్శించారు. స్పోర్ట్స్ కోటా కింద డీఎస్సీ పరీక్ష రాయకుండానే ఉద్యోగాలు ఇచ్చిన విధానం ఏ చట్టం ప్రకారం వచ్చిందో ప్రభుత్వం చెప్పాలని డిమాండ్ చేశారు. మూడు శాతం స్పోర్ట్స్ కోటాపై ఇచ్చిన జీవోను కేబినెట్, అసెంబ్లీ ముందు పెట్టారా అని ప్రశ్నించారు. ఒక జీవో ఇవ్వడం, తర్వాత అదే ప్రభుత్వంలో దాన్ని రద్దు చేయడం వెనుక కారణాలను వెల్లడించాలని కోరారు. ఈ పరిణామంతో స్పోర్ట్స్ కోటాలో ఎంపికైన 438 మంది అభ్యర్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని బొత్స అన్నారు.

**సీబీఐ విచారణకు డిమాండ్**

డీఎస్సీలో పేపర్ లీక్ జరగలేదంటే ఇప్పటివరకు మెరిట్ లిస్ట్ ఎందుకు ప్రకటించలేదని బొత్స ప్రశ్నించారు. ఉద్యోగాల కోసం సెల్‌ఫోన్లలో బేరసారాలకు సంబంధించిన ఆడియోలు, వీడియోలు బయటకు వచ్చినా బాధ్యులపై చర్యలు ఎందుకు తీసుకోలేదని నిలదీశారు. డీఎస్సీ వ్యవహారంపై తక్షణమే సీబీఐ విచారణ జరిపించాలని, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ నైతిక బాధ్యత వహించి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలోని గ్రూప్ 1 పరీక్షలపై ఆరోపణలు ఉంటే వాటిపైనా సీబీఐ విచారణకు సిద్ధమని సవాల్ చేశారు. రైతు సమస్యలు, కరువు పరిస్థితులపై చర్చకు ప్రభుత్వం ఆసక్తి చూపడం లేదని విమర్శించారు. డీఎస్సీ అక్రమాలపై శాసనమండలిలో పూర్తిస్థాయి చర్చ జరిగే వరకు వైఎస్సార్‌సీపీ పోరాటం కొనసాగుతుందని బొత్స స్పష్టం చేశారు.

# గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీలు

- వర్ల రామయ్య, రమాదేవికి ఛాన్స్
- రెండు స్థానాలకు అభ్యర్థుల ఖరారు



ఆంధ్రప్రదేశ్‌లో గవర్నర్ కోటాలో ఖాళీగా ఉన్న రెండు ఎమ్మెల్సీ స్థానాలకు కూటమి ప్రభుత్వం అభ్యర్థులను ఖరారు చేసింది. టీడీపీ సీనియర్ నేత, పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య, బీసీ మహిళా నేత దళవాయి రమాదేవిలను ఎమ్మెల్సీ అభ్యర్థులుగా ఎంపిక చేసింది. ఈ మేరకు ప్రభుత్వం సిఫార్సులతో కూడిన దస్త్రాన్ని గవర్నర్ ఆమోదం కోసం పంపింది. దళిత సామాజికవర్గానికి చెందిన వర్ల రామయ్య టీడీపీలో సుదీర్ఘ కాలంగా కీలకంగా పనిచేస్తున్నారు. గతంలో ఏపీఎస్ఆర్టీసీ చైర్మన్‌గా బాధ్యతలు నిర్వహించారు. పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా వ్యవహరిస్తున్న ఆయనకు ఇప్పుడు ఎమ్మెల్సీ అవకాశం దక్కింది. మరోవైపు అనంతపురానికి చెందిన వడ్డెర సామాజికవర్గ మహిళా నేత దళవాయి రమాదేవికి అవకాశం కల్పించడం ద్వారా బీసీ సాధికారతకు ప్రాధాన్యం ఇచ్చినట్లు టీడీపీ పేర్కొంటోంది. దాదాపు రెండు దశాబ్దాలుగా పార్టీ కోసం పనిచేస్తున్న రమాదేవి సాధారణ కార్యకర్త స్థాయి నుంచి పలు బాధ్యతలు నిర్వహించారు. 2024 ఎన్నికల్లో పార్టీ విజయానికి కృషి చేశారు. గవర్నర్ ఆమోదం తర్వాత ఇద్దరి నియామకాలు అధికారికంగా ఖరారు కానున్నాయి.

# నేరాలపై నిఘా

- వేంపల్లిలో కంట్రోల్ రూమ్
- 44 కెమెరాలతో పటిష్ట పోలీస్ నిఘా



కడప జిల్లా వేంపల్లిలో నేరాల నియంత్రణ, ప్రజల భద్రత కోసం పోలీసులు ఆధునిక నిఘా వ్యవస్థను అందుబాటులోకి తీసుకొచ్చారు. వేంపల్లి పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ రూమ్‌ను జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ప్రారంభించారు. పట్టణంలోని ప్రధాన జంక్షన్లు, కూడళ్లు, రద్దీ ప్రాంతాలు, నేరాలకు అవకాశం ఉన్న ప్రాంతాలను గుర్తించి 18 కీలక ప్రాంతాల్లో 44 సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. వీటిలో 6 ఏఎన్‌పీఆర్ కెమెరాలు, 38 మెగాపిక్సెల్ కెమెరాలు ఉన్నాయి. పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ రూమ్‌లో భారీ స్క్రీన్ ద్వారా ఆయా ప్రాంతాలను పోలీసులు నిరంతరం పర్యవేక్షించనున్నారు. దొంగతనాలు, అసాంఘిక కార్యకలాపాలు, ఇతర నేరాలను అడ్డుకోవడంతో పాటు నేరస్తులను వేగంగా గుర్తించేందుకు ఈ వ్యవస్థ ఉపయోగపడుతుందని ఎస్పీ తెలిపారు. దాతల సహకారంతో కెమెరాల ఏర్పాటు జరిగిందని వెల్లడించారు. ప్రజల భద్రత కోసం సాంకేతిక పరిజ్ఞానాన్ని విస్తృతంగా వినియోగిస్తున్నామని చెప్పారు. ఎస్పీతో పాటు డీఎస్పీ మురళీ నాయక్, సీఐలు, ఎస్సైలు, పోలీసు సిబ్బంది కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆధునిక నిఘా వ్యవస్థ అందుబాటులోకి రావడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## స్థానిక పోరులో 34 శాతం

# బీసీ రిజర్వేషన్లు

## బడుగుల జీవితాల్లో మార్పు తెచ్చే పెద్ద నిర్ణయం

- ఎన్నికల హామీ మాత్రమే కాదు... రాజకీయ సిద్ధాంతం
- ప్రతి బీసీ కుటుంబం గర్వంగా చెప్పుకొనే రోజు
- టీడీపీ వచ్చాకే బీసీలు కీలక నేతలుగా ఎదిగారు
- అసెంబ్లీలో సీఎం చంద్రబాబు వెల్లడి



స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించడం బీసీల జీవితాల్లో మార్పు తీసుకొచ్చే అతిపెద్ద నిర్ణయమని ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు. అమరావతిలో శాసనసభలో జరిగిన చర్చలో ఆయన మాట్లాడుతూ ఇది కేవలం ఎన్నికల హామీ కాదని, తమ రాజకీయ సిద్ధాంతంలో భాగమని స్పష్టం చేశారు. హామీ ఇవ్వడంతో ఆగకుండా అమలు చేసి చూపిస్తున్నామని తెలిపారు. గ్రామీణ స్థానిక సంస్థల్లో 34 శాతం, పట్టణ స్థానిక సంస్థల్లో 33.33 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తామని వెల్లడించారు. బీసీలకు రాజకీయ సాధికారత కల్పించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. రాజ్యాంగ పరిమితులను పాటిస్తూ సామాజిక న్యాయం అందించడమే తమ విధానమని స్పష్టం చేశారు. ప్రతి బీసీ కుటుంబం గర్వంగా చెప్పుకునే రోజు ఇదని పేర్కొన్నారు.

**టీడీపీతో బీసీలకు రాజకీయ ఎదుగుదల**


టీడీపీ ఆవిర్భావానికి ముందు రాజకీయ అధికారం కొన్ని వర్గాలకే పరిమితమైందని చంద్రబాబు వ్యాఖ్యానించారు. ఎన్టీఆర్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత అన్ని వర్గాలకు రాజ్యాధికారంలో భాగస్వామ్యం కల్పించాలనే ఆలోచనతో ముందుకు వెళ్లారని చెప్పారు. ఎర్రన్నాయుడు, యనమల రామకృష్ణుడు, కేఈ కృష్ణమూర్తి, అయ్యన్నపాత్రుడు, కళా వెంకట్రావు, తెలంగాణలో దేవేందర్‌గౌడ్ వంటి బీసీ నేతలు ఉన్నత స్థాయికి ఎదగడంలో టీడీపీ కీలక పాత్ర పోషించిందన్నారు. 1995లో బీసీలకు 20 శాతం ఉన్న రిజర్వేషన్లను 34 శాతానికి పెంచామని గుర్తుచేశారు. కులవృత్తులు, చేతివృత్తులకు ఆదరణ అందించామని చెప్పారు. బీసీల కోసం రూ.32 వేల కోట్లు ఖర్చు చేశామని, ఆదరణ పథకం ద్వారా 341 రకాల పరికరాలను 90 శాతం రాయితీతో అందించామని తెలిపారు.

**గత పాలనపై చంద్రబాబు విమర్శలు**

2019 తర్వాత బీసీలకు రాజకీయంగా అన్యాయం జరిగిందని చంద్రబాబు ఆరోపించారు. 34 శాతం ఉన్న రిజర్వేషన్లు 24.5 శాతానికి తగ్గిపోయాయని, అప్పటి ప్రభుత్వం తీసుకొచ్చిన జీవోపై హైకోర్టులో సవాలు జరిగినా సుప్రీంకోర్టును ఆశ్రయించలేదని విమర్శించారు. దీనివల్ల సుమారు 16,800 మంది బీసీ నేతలు రాజకీయ అవకాశాలు కోల్పోయారని ఆయన పేర్కొన్నారు. బీసీ రిజర్వేషన్ల విషయంలో గత ప్రభుత్వ వైఖరిని ప్రజలు గుర్తుంచుకోవాలని అన్నారు. 2024 ఎన్నికల్లో కూటమికి వచ్చిన భారీ విజయానికి బీసీల మద్దతు కీలక కారణమని చంద్రబాబు చెప్పారు. ఎన్నికలకు ముందే తాను, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, బీజేపీ నేతలు బీసీలకు న్యాయం చేయాలని నిర్ణయించుకున్నామని వెల్లడించారు.

**విద్య, ఉపాధితో బీసీల సాధికారత**

బీసీలకు రాజకీయ ప్రాతినిధ్యంతో పాటు విద్య, నైపుణ్యం, ఉపాధి, వ్యాపార అవకాశాలు కల్పించడంపై ప్రభుత్వం దృష్టి పెడుతుందని చంద్రబాబు తెలిపారు. వడ్డెరలకు మైనింగ్ లీజుల్లో 10 శాతం అవకాశాలు, నేతన్న సేవ కింద ప్రతి కుటుంబానికి రూ.25 వేల సాయం, మత్స్యకారులకు అండగా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. దేవాలయాల్లో పనిచేసే నాయీ బ్రాహ్మణుల జీతాలను రూ.25 వేలకు పెంచామని, బీసీలు సోలార్ ప్యానళ్ల ఏర్పాటుకు రూ.95 వేల వరకు రాయితీ అందిస్తున్నామని వివరించారు. బీసీ రిజర్వేషన్లు ఎవరికీ వ్యతిరేకం కావని, అన్ని వర్గాలకు సమాన అవకాశాలు కల్పించడమే లక్ష్యమని స్పష్టం చేశారు. బీసీ రిజర్వేషన్లపై కోర్టులను ఆశ్రయించే విషయంలోనూ రాజకీయ పార్టీలు జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు.



# ఎన్టీఆర్‌తో బీసీలకు రాజకీయ బలం

- బడుగులకు అండ టీడీపీయే
- అసెంబ్లీలో మంత్రి అచ్చెన్నాయుడు


బీసీలకు రాజకీయంగా పెద్దపీట వేసింది తెలుగుదేశం పార్టీయేనని మంత్రి అచ్చెన్నాయుడు అన్నారు. అసెంబ్లీ సమావేశాల్లో బీసీ సాధికారత, రిజర్వేషన్లపై జరిగిన చర్చలో ఆయన మాట్లాడారు. ఎన్టీఆర్ టీడీపీ స్థాపించిన తర్వాత బలహీనవర్గాలకు రాజకీయ అవకాశాలు పెరిగాయని చెప్పారు. బీసీలను అసెంబ్లీకి పంపించడంతో పాటు స్థానిక సంస్థల్లో 20 శాతం రిజర్వేషన్లు కల్పించిన ఘనత ఎన్టీఆర్‌దేనని గుర్తుచేశారు. 1995లో చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో బీసీలకు రిజర్వేషన్లను 34 శాతానికి పెంచారని తెలిపారు. టీడీపీ ఆవిర్భావం నుంచి బీసీలు ఆ పార్టీకి బలమైన మద్దతుదారులుగా ఉన్నారని అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. బీసీలకు రాజకీయ ప్రాతినిధ్యం పెంచడం టీడీపీ విధానంలో భాగమని స్పష్టం చేశారు.

**వైసీపీ పాలనపై తీవ్ర విమర్శలు**

జగన్ ప్రభుత్వం బీసీలపై దాడులు, దమనకాండకు పాల్పడిందని అచ్చెన్నాయుడు ఆరోపించారు. బీసీ రిజర్వేషన్లు పెంచుతున్నామని చెప్పిన గత ప్రభుత్వం చట్ట సవరణ చేయకుండా కొత్త జీవో తీసుకురావడం వల్ల సమస్య ఏర్పడిందన్నారు. ఆ జీవోను సవాలు చేస్తూ కేసులు వేయించారని, కోర్టులో ఎదురుదెబ్బ తగిలిన తర్వాత సుప్రీంకోర్టును ఆశ్రయించకపోవడంతో బీసీలకు అన్యాయం జరిగిందని విమర్శించారు. ప్రస్తుత ప్రభుత్వం ప్రత్యేక కేబినెట్ సమావేశం నిర్వహించి స్థానిక సంస్థల్లో బీసీలకు రిజర్వేషన్లపై నిర్ణయం తీసుకుందని తెలిపారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బలహీనవర్గాలు టీడీపీకి అండగా నిలవాలని అచ్చెన్నాయుడు పిలుపునిచ్చారు.

# 34 శాతం రిజర్వేషన్లు

- బీసీలకు చరిత్రాత్మక హక్కు: సవిత



స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం చరిత్రలో బీసీలు మరిచిపోలేని రోజని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత అన్నారు. అమరావతిలో అసెంబ్లీ చర్చ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో 34 శాతం, పట్టణ ప్రాంతాల్లో 33.33 శాతం రిజర్వేషన్లు అమలు చేయబోతున్నట్లు తెలిపారు. బీసీలకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పించడం, స్థానిక పాలనలో భాగస్వామ్యం పెంచడం తమ ప్రభుత్వ బాధ్యతగా పేర్కొన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీని అమలు చేస్తున్న సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్‌కు ధన్యవాదాలు తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వం బీసీ రిజర్వేషన్లను తగ్గించడం వల్ల 16 వేలకు పైగా రాజకీయ పదవులను బీసీలు కోల్పోయారని సవిత ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్టీఆర్ స్ఫూర్తితో చంద్రబాబు 1994లోనే 34 శాతం రిజర్వేషన్లు అమలు చేశారని గుర్తుచేశారు. కూటమి ప్రభుత్వం తొలి బడ్జెట్‌లో రూ.39 వేల కోట్లు, రెండో బడ్జెట్‌లో రూ.47 వేల కోట్లు, మూడో బడ్జెట్‌లో రూ.51 వేల కోట్లు బీసీలకు కేటాయించిందన్నారు. నామినేటెడ్ పోస్టుల్లోనూ 34 శాతం రిజర్వేషన్లకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు.

## స్వరం.. గరం గరం...

# నానాజీ.. నో రాజీ

**కాపు కాయం.. పవన్‌ను సీఎం చేస్తాం**



జనసేనలో స్వరం క్రమంగా గరం గరంగా మారుతోంది. కూటమి ప్రభుత్వంలో భాగస్వామిగా ఉన్న ఆ పార్టీ ప్రజాప్రతినిధులు, నేతలు వరుసగా చేస్తున్న వ్యాఖ్యలు రాజకీయంగా కొత్త చర్చకు తెరలేపుతున్నాయి. స్థానిక సంస్థల ఎన్నికల్లో తమ బలాన్ని బట్టి సీట్లు అడుగుతామని తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ స్పష్టం చేసిన మరుసటి రోజే కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ చేసిన వ్యాఖ్యలు మరింత ప్రాధాన్యం సంతరించుకున్నాయి. తెలుగుదేశం పార్టీకి కాపు కాయడానికి జనసేన పుట్టలేదని, పవన్‌కల్యాణ్‌ను ముఖ్యమంత్రిగా చూడాలనే లక్ష్యంతోనే పార్టీ ఆవిర్భవించిందని నానాజీ చెప్పడం సాధారణ రాజకీయ అంశం గా కొట్టిపారేయలేని పరిణామం. ఎందుకంటే ఇది కేవలం ఒక ఎమ్మెల్యే అభిప్రాయమా, లేక జనసేనలో పెరుగుతున్న అంతర్గత భావజాలానికి ప్రతిధ్వనియా అన్నదే అసలు ప్రశ్న.

**ఒకరి తర్వాత ఒకరు రంగంలోకి**

కూటమి రాజకీయాల్లో మిత్రపక్షాలు తమ బలాన్ని గుర్తు చేయడం సహజమే. అయితే ఎన్నికల తర్వాత కూడా అధికార భాగస్వామ్యంలో తమ వాటా, రాజకీయ ప్రాధాన్యం, భవిష్యత్ నాయకత్వంపై బహిరంగంగా మాట్లాడటం కూటమి సమీకరణాలకు మరో కోణాన్ని చూపిస్తుంది. ముఖ్యంగా జనసేన నాయకులు ఒకరి తర్వాత మరొకరు స్వరం పెంచుతున్న తీరు గమనిస్తే, క్షేత్రస్థాయిలో ఉన్న అసంతృప్తిని పైస్థాయికి తీసుకెళ్లే ప్రయత్నం జరుగుతోందన్న అభిప్రాయానికి బలం చేకూరుతోంది. జనసేన ఆవిర్భావ లక్ష్యం, పవన్‌కల్యాణ్ నాయకత్వం, స్థానిక సంస్థల సీట్ల పంపకం వంటి అంశాలను ఒకదానితో ఒకటి ముడిపెట్టి మాట్లాడటం ద్వారా పార్టీ తన రాజకీయ ఉనికిని కేవలం కూటమి భాగస్వామి స్థాయిలో కాకుండా స్వతంత్ర శక్తిగా గుర్తించాలని కోరుకుంటోందా అన్న సందేహం కలుగుతోంది. అదే సమయంలో, ఇలాంటి వ్యాఖ్యలు టీడీపీ నాయకత్వానికి అసౌకర్యాన్ని కలిగించే అవకాశం కూడా ఉంది.

**జనసేనాని మౌనం**

ఇక్కడ అసలు పరీక్ష పవన్‌కల్యాణ్ మౌనమే. పార్టీకి చెందిన కీలక నేతలు కూటమి రాజకీయాలపై బహిరంగ వ్యాఖ్యలు చేస్తున్నా జనసేనాని వాటిని ఖండించకపోవడం రాజకీయ పరిశీలకుల దృష్టిని ఆకర్షిస్తోంది. ప్రతి మాటను పార్టీ అధినేత అభిప్రాయంగా పరిగణించాల్సిన అవసరం లేదు. కానీ ఒకే తరహా భావజాలంతో పలువురు నేతలు వరుసగా మాట్లాడుతున్నప్పుడు, ఆ వ్యాఖ్యల వెనుక పార్టీ అంతర్గత చర్చ ఉందా అన్న ప్రశ్న సహజంగానే తలెత్తుతుంది. చంద్రబాబు-పవన్ మధ్య సమన్వయం కూటమి విజయానికి కీలకమైన అంశం. అందువల్ల జనసేనలో వినిపిస్తున్న అసంతృప్తి కూటమి బంధాన్ని బలహీనపరిచే స్థాయికి వెళ్లకుండా చూడాల్సిన బాధ్యత ఇరుపక్షాలపైనా ఉంది. మిత్రపక్షాల మధ్య విభేదాలు బహిరంగ వేదికలపైకి వస్తే, వాటి ప్రభావం కేవలం నేతల మధ్య సంబంధాలకే పరిమితం కాకుండా కేడర్ స్థాయిలోనూ ప్రతిబింబించే ప్రమాదం ఉంటుంది.

**తొలుత వ్యాఖ్యలు తర్వాత ఖండనలు**

అయితే ఈ పరిణామాలను కూటమి చీలికకు సంకేతాలుగా వెంటనే తేల్చేయడం కూడా తొందరపాటే. రాజకీయాల్లో బేరసారాల స్వరం పెరగడం, భాగస్వామ్య పక్షం తన బలాన్ని గుర్తుచేయడం, భవిష్యత్ లక్ష్యాలను ముందుకు తేవడం——ఇవన్నీ వ్యూహంలో భాగమే కావచ్చు. జనసేనకు కావాల్సింది గౌరవప్రదమైన రాజకీయ భాగస్వామ్యం; టీడీపీకి కావాల్సింది స్థిరమైన కూటమి. ఈ రెండింటి మధ్య సమతుల్యతే కీలకం.

ఐతే, తన వ్యాఖ్యలను వైసీపీ వక్రీకరించి ప్రచారం చేస్తోందని నానాజీ ఆరోపించారు. మాటలను ఎడిట్ చేసి దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. జగన్ పాలనకు వ్యతిరేకంగానే టీడీపీ, జనసేన, బీజేపీ కలిసి కూటమిగా ఏర్పడ్డాయని చెప్పారు. కూటమి ప్రభుత్వం దీర్ఘకాలం కొనసాగాలన్నదే తమ లక్ష్యమని స్పష్టం చేశారు.

# అమెరికా భూభాగంగా హర్మూజ్

- ట్రంప్ పోస్టుతో కొత్త కలకలం




అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హర్మూజ్ జలసంధిపై సంచలన వ్యాఖ్యలు చేశారు. హర్మూజ్ జలసంధిని "కొత్త అమెరికా భూభాగం"గా చూపించే ఏఐ రూపొందించిన మ్యాప్‌ను ట్రంప్ సోషల్ మీడియా వేదికలో పోస్టు చేశారు. ప్రస్తుతం ఇరాన్ నియంత్రణలో ఉన్న కీలక జల మార్గంపై అమెరికా ఆధిపత్యం ప్రకటించాలన్న ఆలోచనను ఆయన గతంలో కూడా ప్రస్తావించారు. హర్మూజ్‌లో నౌకా నిర్బంధం కొనసాగుతోందని, అక్కడి సముద్ర గనులు తొలగించామని ట్రంప్ తెలిపారు. ప్రపంచ చమురు రవాణాలో అత్యంత కీలకమైన ఈ జలసంధి ద్వారా భారీగా చమురు రవాణా జరుగుతుంది. దీంతో హర్మూజ్‌పై అమెరికా వైఖరి అంతర్జాతీయంగా ఆందోళనకు కారణమవుతోంది. హర్మూజ్‌ను తమ భూభాగంగా ప్రకటించాలన్న ఆలోచనను ట్రంప్ ముందుకు తీసుకురావడం ప్రాంతీయ ఉద్రిక్తతలను మరింత పెంచే అంశంగా మారింది.

**ఇరాన్ నుంచి తీవ్ర ప్రతిస్పందన**

ట్రంప్ వ్యాఖ్యలకు ఇరాన్ తీవ్రంగా స్పందించింది. హర్మూజ్ జలసంధి ఇరాన్‌దేనని, అమెరికా నిర్బంధాన్ని ఎత్తివేసే వరకు జలసంధిని తెరవబోమని ఇరాన్ స్పష్టం చేసింది. ఇరాన్ ప్రధాన చర్చాకర్త మహమ్మద్ బాఘెర్ ఘలీబాఫ్ అమెరికా నౌకా నిర్బంధం తొలగించడం, చమురు ఆంక్షలు ఎత్తివేయడం, విదేశాల్లో నిలిచిపోయిన ఇరాన్ ఆస్తులను విడుదల చేయడం వంటి డిమాండ్లను ముందుకు తెచ్చారు. మరోవైపు ఇరాన్‌తో ఎలాంటి చర్చలు జరగడం లేదని ట్రంప్ ప్రకటించారు. అయితే ట్రంప్ ప్రతినిధి జారెడ్ కుష్నర్ ఇరాన్‌తో సానుకూల చర్చలు జరుగుతున్నాయని చెప్పిన నేపథ్యంలో ఈ రెండు ప్రకటనలు పరస్పర విరుద్ధంగా కనిపిస్తున్నాయి. హర్మూజ్‌పై ఆధిపత్య పోరు కొనసాగితే చమురు సరఫరా, అంతర్జాతీయ వాణిజ్యంపై ప్రభావం పడే అవకాశం ఉందన్న ఆందోళనలు పెరుగుతున్నాయి.

# ఆప్ నేత సత్యేందర్ జైన్ అరెస్ట్

- జల్ బోర్డు టెండర్ కేసులో ట్విస్ట్



ఆమ్ ఆద్మీ పార్టీ నేత, ఢిల్లీ మాజీ జలవనరుల మంత్రి సత్యేందర్ జైన్‌ను ఢిల్లీ అవినీతి నిరోధక శాఖ అరెస్ట్ చేసింది. ఢిల్లీ జల్ బోర్డు మురుగునీటి శుద్ధి ప్లాంట్ల ఆధునీకరణ టెండర్లలో అవకతవకలు, నిబంధనల మార్పు, కుట్రకు పాల్పడ్డారన్న ఆరోపణలపై ఈ చర్య తీసుకున్నారు. దర్యాప్తులో టెండర్ నిబంధనలు ఒక నిర్దిష్ట సాంకేతిక సంస్థకు అనుకూలంగా రూపొందించినట్లు అధికారులు పేర్కొన్నారు. టెండర్ ప్రక్రియలో మధ్యవర్తుల ద్వారా నిధుల మళ్లింపు జరిగిందన్న ఆరోపణలు కూడా ఉన్నాయి. మాజీ జల్ బోర్డు సీఈవో ఉద్ధిత్ ప్రకాశ్ రాయ్ సహా మొత్తం ఆరుగురిని అరెస్ట్ చేసినట్లు అధికారులు వెల్లడించారు. ఆయనకు సంబంధించిన ఖాతాలకు సుమారు రూ.1.52 కోట్ల లంచం చేరినట్లు దర్యాప్తు సంస్థ ఆరోపించింది. జైన్‌పై గతంలోనూ మనీలాండరింగ్ కేసు నమోదై, సుమారు 18 నెలలు జైల్లో ఉన్నారు.

**రాజకీయ కక్ష అంటూ ఆప్ ఆరోపణ**

జైన్ అరెస్ట్‌పై ఆమ్ ఆద్మీ పార్టీ తీవ్రంగా స్పందించింది. అరెస్టు రాజకీయ కక్షతో జరిగిందని, ఆరోపణలు ఎదురైన టెండర్ సమయంలో జైన్ జైల్లో ఉన్నారని ఆప్ నేతలు ప్రశ్నించారు. పంజాబ్‌లో ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ఆప్‌పై ఒత్తిడి పెంచేందుకే ఈ చర్య తీసుకున్నారని పార్టీ ఆరోపించింది. అరవింద్ కేజ్రీవాల్ కూడా జైన్ అరెస్టను బీజేపీ రాజకీయ చర్యగా అభివర్ణించారు. మరోవైపు ఢిల్లీ బీజేపీ నేతలు మాత్రం జల్ బోర్డు టెండర్ వ్యవహారంలో అవినీతి వెలుగులోకి వచ్చిందని ఆరోపించారు. టెండర్ నిబంధనలను ఒక సంస్థకు అనుకూలంగా మార్చడం, భారీగా డబ్బులు మళ్లించడం వంటి అంశాలపై దర్యాప్తు కొనసాగుతోంది. దీంతో సత్యేందర్ జైన్ అరెస్ట్ ఢిల్లీ రాజకీయాల్లో మరోసారి ఆప్-బీజేపీ మధ్య తీవ్ర రాజకీయ పోరుకు దారితీసింది.



# టార్గెట్ పవర్

## అధికార కేంద్రం చుట్టూ తెలంగాణ దారులు

## రాజకీయ ముఖచిత్రం మార్చనున్న ప్రెజర్ గ్రూపులు


**• ప్రజల అవసరాలే అసలు అజెండా**

తెలంగాణ రాజకీయాలు ఇప్పుడు కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ మధ్య సాధారణ పోటీని దాటి "ఎలాంటి తెలంగాణ కావాలి? ఎవరి నాయకత్వం కావాలి?" అనే ప్రశ్నల దశకు చేరుతున్నాయి. కాంగ్రెస్ మరోసారి అధికారం కోరుతుండగా, రేవంత్ రెడ్డి 2034 వరకు కాంగ్రెస్ పాలన కొనసాగుతుందని ధీమా వ్యక్తం చేస్తున్నారు. బీఆర్ఎస్ మాత్రం కేసీఆర్ నాయకత్వంలో తిరిగి అధికారంలోకి వస్తామని నమ్ముతోంది. బీజేపీ ఈ రెండు పార్టీలకు ప్రత్యామ్నాయంగా ఎదగాలని చూస్తోంది. కవిత రాజకీయ భవిష్యత్‌పై చర్చతో పాటు, తెలంగాణ ఉద్యమ నేపథ్యమున్న కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి లాంటి స్వరాలు, కాంగ్రెస్‌లోని అసంతృప్తి వర్గాలు ప్రెజర్ గ్రూపులుగా మారితే కొత్త సమీకరణాలు ఏర్పడే అవకాశం ఉంది. ఇక ప్రజలు కేవలం పార్టీ పేరును చూసి ఓటు వేసే పరిస్థితిలో లేరు. ఉద్యోగాలు, మంచి పాలన, భూముల భద్రత, అవినీతి నియంత్రణ, యువతకు అవకాశాలు, తెలంగాణ వనరులపై స్థానికులకు న్యాయం కోరుతున్నారు. హైదరాబాద్ అభివృద్ధితో పాటు గ్రామీణ తెలంగాణకు సమాన ప్రాధాన్యం ఇవ్వాలన్న డిమాండ్ కూడా పెరుగుతోంది. కాంగ్రెస్‌కు అధికార బలం, బీఆర్ఎస్‌కు కేసీఆర్ అనుభవం, బీజేపీకి జాతీయ శక్తి ఉంటే.. కొత్త స్వరాలకు తెలంగాణ ఉద్యమ వారసత్వం ఉంది. అందుకే రాబోయే పోరు కేవలం పార్టీ వర్సెస్ పార్టీ కాదు. నాయకత్వం, పాలన, స్థానికత, ఉద్యమ వారసత్వం, యువత ఆశల మధ్య పోరుగా మారే అవకాశం ఉంది.

**◆ పాలకులు మారినా పరిస్థితుల్లో నో చేంజ్..**

**◆ ప్రభుత్వంపై ప్రజల్లో పెరుగుతున్న రివేంజ్**

తెలంగాణ రాజకీయాల్లో ఇప్పుడు కనిపిస్తున్న దృశ్యం సాధారణ పోటీలా లేదు. ఒకవైపు కాంగ్రెస్ మరోసారి అధికారంలోకి వస్తామని ధీమా వ్యక్తం చేస్తోంది. మరోవైపు బీఆర్ఎస్ తిరిగి పుంజుకుంటామని చెబుతోంది. బీజేపీ ఒక్కసారి అవకాశం ఇవ్వాలని ప్రజలను కోరుతోంది. ఈ మూడు ప్రధాన పార్టీల మధ్య పోటీ కొనసాగుతుండగానే, కాంగ్రెస్ లోపలే కొత్త రాజకీయ స్వరాలు వినిపిస్తున్నాయి. 2034 వరకు కాంగ్రెస్ అధికారంలో ఉంటుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బహిరంగంగా చెబుతున్నారు. అప్పటి వరకు తానే ముఖ్యమంత్రిగా కొనసాగుతానని, ఆ తర్వాత కొత్త తరానికి అవకాశం ఇస్తానంటున్నారు. ఇది కేవలం ఒక రాజకీయ ప్రకటనగా చూడాల్సిన విషయం కాదు. ఇందులో కాంగ్రెస్ పార్టీ భవిష్యత్ రాజకీయ వ్యూహంపై ఒక స్పష్టమైన సంకేతం కనిపిస్తోంది. రేవంత్ రెడ్డి తన పాలనను ఐదేళ్ల కాలానికి పరిమితం చేయకుండా, మరో ఎన్నికను దాటి తెలంగాణ రాజకీయాల్లో కాంగ్రెస్‌ను దీర్ఘకాలిక శక్తిగా నిలబెట్టాలని చూస్తున్నారన్న భావన బలపడుతోంది. 2034 నాటికి తెలంగాణను ఒక ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలన్న లక్ష్యాన్ని కూడా ఆయన ప్రభుత్వం ముందుకు తెచ్చింది. పెట్టుబడులు, ఉద్యోగాలు, మౌలిక వసతులు, హైదరాబాద్ విస్తరణ, ఫ్యూచర్ సిటీ వంటి అంశాలను ఈ రాజకీయ లక్ష్యంతో అనుసంధానిస్తోంది. అయితే రాజకీయాల్లో లక్ష్యం ప్రకటించడం ఒక విషయం.. దాన్ని ప్రజల విశ్వాసంగా మార్చడం మరో విషయం. కాంగ్రెస్‌కు ఇప్పుడు అసలు పరీక్ష అదే. అధికారంలో ఉన్న పార్టీగా ప్రభుత్వ పనితీరు, ఇచ్చిన హామీల అమలు, ఉద్యోగాల భర్తీ, రైతు సమస్యలు, భూ వ్యవహారాలు, అవినీతి ఆరోపణలు, కాంగ్రెస్‌లోని అంతర్గత అసంతృప్తి అన్నీ కలిసి ప్రజల తీర్పును ప్రభావితం చేయబోతున్నాయి. ఇటీవల కాంగ్రెస్‌కు చెందిన కొంతమంది నేతల వ్యాఖ్యలు కూడా పార్టీలో అంతర్గత అసంతృప్తికి రాజకీయ ప్రాధాన్యం పెరుగుతోందన్న సంకేతాలు ఇస్తున్నాయి. అందుకే రేవంత్ రెడ్డి 2034 వరకు అధికారంలో కొనసాగాలంటే.. 2028 ఎన్నికల గడపను దాటాల్సిందే.



**• బీఆర్ఎస్ నమ్మకం.. కేసీఆర్ వ్యూహం**

బీఆర్ఎస్ మాత్రం కాంగ్రెస్‌కు ప్రత్యామ్నాయం తామేనన్న నమ్మకంతో ముందుకు వెళ్తోంది. ఎప్పుడు ఎన్నికలు జరిగినా కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి అవుతారని ఆ పార్టీ శ్రేణులు చెబుతున్నాయి. పదేళ్ల పాలన తర్వాత 2023లో అధికారం కోల్పోయిన బీఆర్ఎస్‌కు 2026లో కూడా ఒక పెద్ద ప్రశ్న అలాగే ఉంది. గత పాలనపై ప్రజల్లో ఉన్న అసంతృప్తిని కాంగ్రెస్‌పైకి మళ్లించగలదా? కాంగ్రెస్ ప్రభుత్వంలో కనిపిస్తున్న లోపాలను తనకు అనుకూలంగా మార్చుకోగలదా? ఇవే బీఆర్ఎస్ భవిష్యత్ రాజకీయానికి కీలకం. బీఆర్ఎస్ నేతలు ప్రస్తుతం రైతు రుణమాఫీ, రైతు భరోసా, ఉద్యోగాలు, భూముల వ్యవహారం, ప్రభుత్వ నిర్ణయాలపై తీవ్ర విమర్శలు చేస్తున్నారు. తాజాగా 22ఏ భూముల జాబితాపై కూడా బీఆర్ఎస్ ప్రభుత్వం మీద దాడి చేసింది. మరోవైపు మాజీ మంత్రి హరీశ్ రావు రైతు బంధు, రుణమాఫీ అంశాలపై నేటికీ, ప్రభుత్వాన్ని సవాల్ చేస్తున్నారు. అంటే బీఆర్ఎస్ తన పాత బలమైన అంశాలైన రైతు, సంక్షేమం, తెలంగాణ ఆత్మగౌరవం, పాలన అనుభవం చుట్టూ మళ్లీ రాజకీయ కథనాన్ని నిర్మించడానికి ప్రయత్నిస్తోంది. కానీ ఇక్కడ బీఆర్ఎస్‌కు కూడా ఒక చిక్కు ఉంది. పదేళ్లు అధికారంలో ఉన్న పార్టీగా ప్రజలలో ఏర్పడిన వ్యతిరేకత పూర్తిగా తొలగిపోయిందా అన్నది స్పష్టంగా లేదు. తెలంగాణ ఏర్పాటైన తర్వాత తొలి దశలో కేసీఆర్ నాయకత్వం ప్రజల్లో బలమైన ఆకర్షణను సంపాదించింది. కాలక్రమంలో అదే పాలనపై అధికార కేంద్రీకరణ, కుటుంబ రాజకీయాలు, నాయకులకు ప్రాధాన్యం తగ్గడం, ప్రజలతో దూరం పెరగడం వంటి విమర్శలు వచ్చాయి. 2023లో కాంగ్రెస్ విజయం వెనుక ఈ అంశాలకు కూడా రాజకీయ ప్రాధాన్యం ఉంది. ఇప్పుడు బీఆర్ఎస్ తిరిగి రావాలంటే కేవలం కాంగ్రెస్ వైఫల్యాలను చూపించడం సరిపోదు. తాము మారామని, పాత తప్పులను సరిదిద్దుకున్నామని, కొత్త తరానికి స్థానం ఇస్తామని ప్రజలకు నమ్మకం కలిగించాలి. కేసీఆర్ రాజకీయ అనుభవం బీఆర్ఎస్‌కు పెద్ద బలం. కానీ అదే సమయంలో కొత్త నాయకత్వం, కొత్త ముఖాలు, కొత్త రాజకీయ భాష అవసరం కూడా అంతే బలంగా ఉంది. బీఆర్ఎస్ కాంగ్రెస్‌ను ఎదుర్కొంటున్నప్పటికీ, తనలోని పాత సమస్యలను పరిష్కరించుకోవాల్సిన అవసరం ఉంది.

**• బీజేపీకి ఛాన్స్.. కానీ వ్యూహం ఏంటి?**

తెలంగాణ రాజకీయాల్లో మూడో శక్తిగా ఎదగాలని బీజేపీ చాలా కాలంగా ప్రయత్నిస్తోంది. ఒక్కసారి అవకాశం ఇవ్వండి.. తెలంగాణలో కాంగ్రెస్, బీఆర్ఎస్‌కు భిన్నమైన పాలన చూపిస్తామని బీజేపీ చెబుతోంది. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ తన ఓటు శాతాన్ని పెంచుకున్నా, అధికార పోటీలో కాంగ్రెస్ లేదా బీఆర్ఎస్ స్థాయికి చేరుకోలేకపోయింది. లోక్‌సభ ఎన్నికల్లో మాత్రం బీజేపీ బలమైన ప్రదర్శన చూపించడంతో తెలంగాణలో అది నిజమైన ప్రత్యామ్నాయంగా మారుతుందన్న అంచనాలు పెరిగాయి. కానీ అసెంబ్లీ రాజకీయాలకు వస్తే పరిస్థితి అంత సులభంగా లేదు. గ్రామస్థాయిలో పార్టీ సంస్థాగత బలం, స్థానిక నాయకత్వం, సామాజిక వర్గాల మధ్య విస్తరణ, నియోజకవర్గ స్థాయిలో బలమైన అభ్యర్థులు వంటి అంశాలు బీజేపీకి కీలకం. తాజాగా బీజేపీ జాతీయ కార్యవర్గంలో తెలంగాణకు ప్రాతినిధ్యం లేకపోవడం కూడా రాజకీయ చర్చకు దారితీసింది. అదే సమయంలో బీసీ రాజకీయాలను బలంగా ముందుకు తీసుకెళ్లే ప్రయత్నం పార్టీ చేస్తోంది. కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండూ బీసీలకు న్యాయం చేయలేదని బీజేపీ ఆరోపిస్తూ ఆ వర్గాన్ని ఆకర్షించే వ్యూహాన్ని కొనసాగిస్తోంది. అయితే ఇక్కడే బీజేపీకి అసలు సవాలు ఉంది. కాంగ్రెస్ బలహీనపడితే బీజేపీకి ఓట్లు వస్తాయా? లేక ఆ ఓట్లు బీఆర్ఎస్ వైపు వెళ్తాయా? ఇదే రాబోయే రాజకీయ సమీకరణాల్లో కీలక ప్రశ్న. కాంగ్రెస్‌పై వ్యతిరేకత పెరిగిన ప్రతిసారీ అది బీజేపీకి అనుకూలంగా మారడం లేదు. కొన్నిసార్లు బీఆర్ఎస్ కూడా ఆ వ్యతిరేకతను తనకు అనుకూలంగా మలుచుకుంటోంది. దీంతో తెలంగాణలో బీజేపీ తన రాజకీయ స్థానం ఎక్కడ నిర్మించుకోవాలన్నది స్పష్టంగా నిర్ణయించుకోవాల్సిన దశ వచ్చింది. హిందుత్వ రాజకీయాలతో పాటు తెలంగాణ ప్రాంతీయ భావన, బీసీ ప్రాతినిధ్యం, యువత, ఉద్యోగాలు, అవినీతి వ్యతిరేకత వంటి స్థానిక అంశాలను బలంగా కలిపితేనే బీజేపీకి విస్తృత స్థాయి అవకాశం ఉంటుంది. బీజేపీకి ఛాన్స్ ఉంది.. కానీ ఆ ఛాన్స్‌ను సీట్లుగా మార్చే వ్యూహం ఇంకా పెద్ద ప్రశ్నగానే ఉంది.

**• కవిత కోణం.. కొత్త రాజకీయ శక్తి?**

ఇక తెలంగాణ రాజకీయాల్లో మరో ఆసక్తికరమైన కోణం కవిత చుట్టూ కనిపిస్తోంది. కేసీఆర్ సీఎంగా అయ్యారు.. జగన్ సీఎం అయ్యారు.. మరి నేను ఎందుకు ముఖ్యమంత్రి కాకూడదనే ఆలోచనకు కవిత రావడం సహజమేనన్న చర్చ రాజకీయ వర్గాల్లో వినిపిస్తోంది. అయితే ఇది కేవలం ఒక వ్యక్తి ముఖ్యమంత్రి కావాలన్న ఆకాంక్షగా మాత్రమే చూడటం సరిపోదు. తెలంగాణ ఉద్యమంతో సంబంధం ఉన్న రాజకీయ కుటుంబాల వారసత్వం, వ్యక్తిగత రాజకీయ గుర్తింపు, స్వతంత్ర రాజకీయ వేదిక, కొత్త తరాన్ని ఆకర్షించే ప్రయత్నం వంటి అంశాలు దీనికి వెనుక ఉండవచ్చు. కవిత రాజకీయంగా ఏ దిశలో వెళ్తారన్నది స్పష్టమైన రూపం దాల్చకముందే దాని ప్రభావాన్ని అంచనా వేయడం తొందరపాటు అవుతుంది. కానీ ఒక విషయం మాత్రం స్పష్టంగా చెప్పొచ్చు. తెలంగాణ రాజకీయాల్లో ఇకపై నాయకత్వం ఒకే కుటుంబం లేదా ఒకే పార్టీలో శాశ్వతంగా ఉండే పరిస్థితి ఉండకపోవచ్చు. కేసీఆర్ తర్వాత బీఆర్ఎస్‌లో ఎవరి నాయకత్వం బలపడుతుంది? కాంగ్రెస్‌లో రేవంత్ తర్వాత ఎవరు? బీజేపీలో తెలంగాణకు సరిపోయే నాయకత్వం ఎవరిది? ఈ ప్రశ్నలతో పాటు కొత్త రాజకీయ వేదికలు ఏర్పడితే వాటి చుట్టూ ఎవరు చేరతారన్నది కూడా కీలకం. కవిత లాంటి నాయకులు స్వతంత్ర రాజకీయ స్వరం పెంచితే, అది బీఆర్ఎస్‌పై మాత్రమే ప్రభావం చూపదు. కాంగ్రెస్‌లోని తెలంగాణ ఉద్యమ నేపథ్యమున్న నేతలు, బీజేపీలోని ప్రాంతీయ భావజాలానికి దగ్గరగా ఉన్న వర్గాలు, స్వతంత్రంగా ఉన్న ఉద్యమకారులు కూడా కొత్త సమీకరణాల వైపు చూడొచ్చు. అందుకే కవిత అంశాన్ని కేవలం కేసీఆర్ కుటుంబ అంతర్గత రాజకీయంగా కాకుండా, తెలంగాణలో కొత్త నాయకత్వం కోసం జరుగుతున్న పెద్ద అన్వేషణలో ఒక భాగంగా చూడాల్సి ఉంటుంది. ఆమె రాజకీయ ప్రయాణం ఏ రూపం తీసుకుంటుందన్నది భవిష్యత్ పరిణామాలపై ఆధారపడి ఉంటుంది. కానీ ఈ చర్చ మొదలవ్వడమే తెలంగాణ రాజకీయాల్లో నాయకత్వ ప్రశ్న ఎంత తీవ్రంగా మారుతోందో చెప్పే సంకేతం.

**• రాజన్న లాంటి స్వరాలు.. కాంగ్రెస్‌లో ప్రెజర్ గ్రూపులు**

ఇక్కడే తెలంగాణ రాజకీయాల్లో అత్యంత కీలకమైన అంశం మొదలవుతుంది. తెలంగాణ కోసం పోరాడిన నాయకులు, ఉద్యమ కాలంలో ప్రజలతో కలిసి పనిచేసిన వర్గాలు, రాష్ట్ర ఏర్పాటు తర్వాత తమ ఆశలు నెరవేరలేదని భావిస్తున్న నేతలు ఒకచోట చేరితే పరిస్థితి ఎలా మారుతుంది? ఇదే ఇప్పుడు చర్చించాల్సిన అసలు ప్రశ్న. కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి లాంటి నాయకులు తెలంగాణ రాజకీయాలు తమిళనాడు తరహాలో కొత్త దిశలోకి వెళ్లాలని కోరుకుంటే, ఆ ఆలోచన వెనుక ఉన్న అసంతృప్తిని రాజకీయంగా అర్థం చేసుకోవాలి. "ఎవరిపాలైందిరా తెలంగాణ?" అనే ప్రశ్నను వారు ముందుకు తెస్తే దాని ప్రభావం కేవలం కాంగ్రెస్‌పైనే ఉండదు. బీఆర్ఎస్ పాలనలో కూడా తెలంగాణ ఏర్పాటుకు ముందు ఉన్న ఆకాంక్షలన్నీ నెరవేరలేదన్న విమర్శను గుర్తు చేస్తుంది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా ఉద్యమకారులు ఆశించిన స్థాయిలో రాజకీయ ప్రాధాన్యం దక్కలేదన్న భావన కొంత మంది నేతల్లో ఉంది. తెలంగాణ కోసం కొట్లాడిన వాళ్లకు పదవులు మాత్రమే కాదు.. నిర్ణయాల్లో భాగస్వామ్యం కావాలి. తెలంగాణ వనరులపై తెలంగాణ ప్రజలకే మొదటి హక్కు ఉండాలి. స్థానిక యువతకు ఉద్యోగాలు రావాలి. స్థానిక వ్యాపారులకు అవకాశాలు రావాలి. ప్రభుత్వ విధానాల్లో తెలంగాణ స్వాభిమానం కనిపించాలి. ఈ డిమాండ్లు బలమైన రాజకీయ భావోద్వేగంగా మారితే కాంగ్రెస్‌లో ప్రెజర్ గ్రూపులు ఏర్పడే అవకాశం ఉంటుంది. ముఖ్యంగా ఆంధ్ర ప్రాంతానికి చెందిన కాంట్రాక్టర్లు, వ్యాపార వర్గాలు, పెట్టుబడిదారులపై రాజకీయ విమర్శలు పెరగడం కూడా ఈ భావనకు బలం ఇవ్వవచ్చు. అయితే ఇక్కడ ఒక జాగ్రత్త అవసరం. తెలంగాణ అభివృద్ధికి పెట్టుబడులు అవసరం. పెట్టుబడిదారుడు ఏ ప్రాంతానికి చెందినవాడన్నదాని కంటే, ఒప్పందాలు పారదర్శకంగా ఉన్నాయా? స్థానికులకు ఉద్యోగాలు దక్కుతున్నాయా? ప్రభుత్వ వనరుల వినియోగం న్యాయంగా జరుగుతోందా? అన్నదే అసలు ప్రశ్న. రాజన్నలాంటి నాయకులు ఈ ప్రశ్నలను ముందుకు తీసుకెళ్లి కాంగ్రెస్‌లోనే ఒత్తిడి పెంచితే, అది పార్టీని బలహీనపరిచే చర్యగా కాకుండా తెలంగాణ ప్రాంతీయ రాజకీయాలను మళ్లీ చర్చలోకి తీసుకొచ్చే ప్రెజర్ పాలిటిక్స్‌గా మారవచ్చు. ఇదే భవిష్యత్ రాజకీయాల్లో పెద్ద మలుపు కావచ్చు.

### ఇంకా చాలా ఉంది

**• కాంగ్రెస్ ధీమా.. రేవంత్ లక్ష్యం**

కాంగ్రెస్ పార్టీ మరోసారి అధికారంలోకి వస్తామని ధీమాగా ఉంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 2034 వరకు కాంగ్రెస్ పాలన కొనసాగుతుందని చెబుతున్నారు. అయితే ప్రభుత్వ హామీల అమలు, ఉద్యోగాలు, రైతు సమస్యలు, భూ వ్యవహారాలు, అవినీతి ఆరోపణలు, పార్టీలోని అసంతృప్తి వంటి అంశాలు కాంగ్రెస్‌కు కీలక సవాళ్లుగా మారుతున్నాయి. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకోవడమే రేవంత్ నాయకత్వానికి ప్రధాన పరీక్షగా మారనుంది.

**• బీఆర్ఎస్ నమ్మకం.. కేసీఆర్ ఫోకస్**

కాంగ్రెస్‌పై ప్రజల్లో వ్యతిరేకత పెరుగుతోందని బీఆర్ఎస్ భావిస్తోంది. ఎప్పుడు ఎన్నికలు జరిగినా కేసీఆర్ తిరిగి ముఖ్యమంత్రి అవుతారని ఆ పార్టీ నమ్ముతోంది. రైతులు, సంక్షేమ పథకాలు, తెలంగాణ ఆత్మగౌరవం, కాంగ్రెస్ పాలనపై విమర్శలను ప్రధాన రాజకీయ ఆయుధాలుగా బీఆర్ఎస్ ఉపయోగించనుంది. అయితే పదేళ్ల పాలనపై ఉన్న విమర్శలను అధిగమించి, కొత్త తరానికి నమ్మకం కలిగించడం బీఆర్ఎస్‌కు అసలు సవాలు.

**• బీజేపీకి ఛాన్స్.. వ్యూహమే కీలకం**

కాంగ్రెస్, బీఆర్ఎస్‌కు ప్రత్యామ్నాయంగా ఎదగాలని బీజేపీ లక్ష్యంగా పెట్టుకుంది. ఒక్కసారి అవకాశం ఇవ్వాలని ప్రజలను కోరుతోంది. అయితే కాంగ్రెస్ బలహీనపడిన ప్రతిసారీ బీజేపీకి లాభం వస్తుందన్న లెక్క తెలంగాణలో ఇప్పటివరకు పూర్తిగా పనిచేయలేదు. బీసీ ప్రాతినిధ్యం, యువత, ఉద్యోగాలు, అవినీతి వ్యతిరేకత, స్థానిక సమస్యలను బలంగా ముందుకు తీసుకెళ్తేనే బీజేపీ అసెంబ్లీ స్థాయిలో పెద్ద శక్తిగా ఎదిగే అవకాశం ఉంటుంది.

**• కవిత ఆలోచనలు.. కొత్త సమీకరణాలు**

కేసీఆర్, జగన్ ముఖ్యమంత్రులయ్యారు.. తాను ఎందుకు ముఖ్యమంత్రి కాకూడదన్న ఆలోచనతో కవిత రాజకీయంగా కొత్త దిశను ఎంచుకుంటారా అన్న చర్చ ఆసక్తిని పెంచుతోంది. ఇది కేవలం వ్యక్తిగత రాజకీయ ఆకాంక్షగా కాకుండా తెలంగాణలో కొత్త నాయకత్వం కోసం జరుగుతున్న అన్వేషణలో భాగంగా మారవచ్చు. కవిత స్వతంత్ర రాజకీయ స్వరం పెంచితే బీఆర్ఎస్‌తో పాటు కాంగ్రెస్, బీజేపీ సమీకరణాలపైనా ప్రభావం పడే అవకాశం ఉంది.

**• తెలంగాణ స్వరం.. ప్రెజర్ పాలిటిక్స్**

తెలంగాణ కోసం పోరాడిన నాయకులు, ఉద్యమ నేపథ్య నేతలు, పార్టీ కోసం పనిచేసి గుర్తింపు దక్కలేదని భావిస్తున్న సీనియర్లు ఒక వేదికగా మారితే రాజకీయ ముఖచిత్రం వేగంగా మారొచ్చు. రాజగోపాల్ రెడ్డి లాంటి నాయకులు కాంగ్రెస్‌లో ప్రెజర్ గ్రూపులుగా పనిచేస్తే దొరల తెలంగా, ప్రజల తెలంగాణ అన్న ప్రశ్న మరింత బలపడుతుంది. ఉద్యోగాలు, స్థానికులకు అవకాశాలు, తెలంగాణ వనరులపై హక్కు, పారదర్శక పాలన వంటి అంశాలే కొత్త రాజకీయ ఉద్యమానికి కేంద్రంగా మారే అవకాశం ఉంది.

రాజ్య సంస్కరణ
బుధవారం, 19.08.2026, మేడ్చల్ మల్కాజిగిరి



# కూకట్పల్లి ట్రాఫిక్‌కు పరిష్కారం ఎప్పుడు?

కూకట్పల్లిలో రోజురోజుకూ పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపించాల్సిన అవసరంపై ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు దృష్టి సారించారు. మంగళవారం సైబరాబాద్ మునిసిపల్ కమిషనర్ సృజనను కార్యాలయంలో కలిసి నియోజకవర్గంలోని ప్రధాన సమస్యలపై చర్చించారు. ముఖ్యంగా ప్రకాష్‌నగర్ రోడ్డు విస్తరణ, రహదారులపై పెరుగుతున్న వాహనాల రద్దీ, కీలక కూడళ్ల వద్ద ఏర్పడుతున్న ట్రాఫిక్ ఇబ్బందులను ప్రస్తావించారు. జనాభా పెరుగుదలతో కూకట్పల్లిలో వాహనాల సంఖ్య భారీగా పెరిగినా, అందుకు అనుగుణంగా రహదారుల విస్తరణ జరగకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో ట్రాఫిక్ కష్టాలు మరింత తీవ్రమవుతున్నాయి. ప్రకాష్‌నగర్ రోడ్డు విస్తరణ పూర్తయితే పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ ఒత్తిడి కొంతవరకు తగ్గే అవకాశం ఉందని ఎమ్మెల్యే వివరించారు. రోడ్డు విస్తరణకు అవసరమైన చర్యలను వేగవంతం చేయాలని కమిషనర్‌ను కోరారు. సమస్యలను కేవలం తాత్కాలిక చర్యలతో కాకుండా సమగ్ర రవాణా ప్రణాళికతో పరిష్కరించాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. ప్రజలకు సౌకర్యవంతమైన రాకపోకలు కల్పించేందుకు సంబంధిత శాఖల సమన్వయంతో ముందుకు వెళ్లాలని సూచించారు. కూకట్పల్లి ట్రాఫిక్ సమస్యకు త్వరలోనే కార్యాచరణ రూపుదిద్దుకుంటుందన్న ఆశాభావం వ్యక్తమవుతోంది.

## గోదావరి ఆధునికీకరణకు రూ.3 వేల కోట్లు

### రైతు ఆయకట్టుకు కొత్త భరోసా



గోదావరి ఆధునికీకరణ పనులకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రూ.3 వేల కోట్లు కేటాయించడంపై రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్, మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు హర్షం వ్యక్తం చేశారు. దాదాపు 35 ఏళ్ల తర్వాత గోదావరి పరివాహక ప్రాంతాల అభివృద్ధికి ఇంత భారీగా నిధులు కేటాయించడం అభినందనీయమన్నారు. ఉభయ గోదావరి జిల్లాల్లో ప్రతి ఆయకట్టుకు సమృద్ధిగా సాగునీరు అందించడమే లక్ష్యంగా నిధులను వినియోగించనున్నట్లు తెలిపారు. పంట కాల్వల ఆధునికీకరణ, మరమ్మతులు, మురుగు కాల్వల అభివృద్ధి, అవసరమైన చోట్ల కొత్త కాల్వల నిర్మాణానికి ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు చెప్పారు. పాడైపోయిన స్లూయిజ్‌లు, నీటి నియంత్రణ వ్యవస్థలకు మరమ్మతులు చేపట్టడం ద్వారా సాగునీటి పారుదల వ్యవస్థ మరింత బలోపేతం అవుతుందన్నారు. నీటి వృథాను అరికట్టి చివరి ఆయకట్టు వరకు సాగునీరు సక్రమంగా చేరే అవకాశం ఏర్పడుతుందని పేర్కొన్నారు. రైతుల సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, గోదావరి ఆధునికీకరణతో డెల్టా ప్రాంత వ్యవసాయానికి కొత్త ఊపిరి లభిస్తుందని వేగుళ్ల అన్నారు. గోదావరి జలాలను సమర్థవంతంగా వినియోగించి రైతులకు సాగునీటి ఇబ్బందులు లేకుండా చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు. భారీ నిధులు కేటాయించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు, ప్రభుత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



# మండపేట చిన్నారికి జాతీయ కళా రత్న

### చిత్రలేఖన ప్రతిభకు అరుదైన గుర్తింపు

మండపేటకు చెందిన చిన్నారి గౌరీ జశ్విక చిత్రలేఖనంలో అద్భుత ప్రతిభతో మరో ఘనత సాధించింది. అతి చిన్న వయసులోనే పలు అంతర్జాతీయ వరల్డ్ రికార్డుల్లో స్థానం సంపాదించిన జశ్విక ప్రతిభను గుర్తించిన హర్యానాకు చెందిన మ్యాజిక్ బుక్ ఆఫ్ రికార్డ్స్ ఫౌండేషన్ జాతీయ స్థాయి "బెస్ట్ అచీవర్స్ కళా రత్న" అవార్డుకు ఎంపిక చేసింది. ఫౌండేషన్ నుంచి అందిన ప్రతిష్టాత్మక అవార్డును మండపేటలో ప్రముఖ పారిశ్రామికవేత్త వి. సాయి కుమార్ బాబు చిన్నారి గౌరీ జశ్వికకు తన చేతుల మీదుగా అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్న వయసులోనే అంతర్జాతీయ రికార్డులు సాధించి, జాతీయ స్థాయి కళా రత్న అవార్డు పొందడం మండపేట పట్టణానికి, జిల్లా ప్రజలకు గర్వకారణమన్నారు. జశ్వికకు కళలో మార్గదర్శకత్వం అందిస్తున్న గురువు సత్యానందం, నిరంతరం ప్రోత్సహిస్తున్న తల్లిదండ్రులు సుగుణ లక్ష్మి, సునీల్ రాజాలను అభినందించారు. చిన్నారి ప్రతిభకు కుటుంబం అందిస్తున్న ప్రోత్సాహం ప్రశంసనీయమన్నారు. భవిష్యత్తులో జశ్విక మరిన్ని ఉన్నత రికార్డులు సాధించి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మండపేట ప్రాంత కీర్తిని చాటాలని ఆకాంక్షించారు.



# విజయ్ జువెలర్స్ విజయ ప్రస్థానం

### తొలి వార్షికోత్సవానికి ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి

షాద్‌నగర్ పట్టణంలోని శివాజీ చౌక్ సమీపంలో విజయ్ ఆచార్య, సుకుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విజయ్ జువెలర్స్ తొలి వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ఉమ్మడి పాలమూరు ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై కేక్ కట్ చేసి యాజమాన్యానికి శుభాకాంక్షలు తెలిపారు. నాణ్యమైన బంగారు, వెండి ఆభరణాలను వినియోగదారులకు అందిస్తూ విజయవంతంగా తొలి ఏడాది పూర్తి చేసుకున్నందుకు యాజమాన్యాన్ని ఎమ్మెల్సీ అభినందించారు. వినియోగదారుల నమ్మకమే వ్యాపార విజయానికి ప్రధాన పునాది అని పేర్కొన్నారు. నాణ్యతతో కూడిన సేవలను కొనసాగిస్తూ భవిష్యత్తులో మరిన్ని శాఖలను ఏర్పాటు చేసి విజయ్ జువెలర్స్ మరింత ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. వ్యాపారంలో నాణ్యత, నమ్మకం, వినియోగదారులతో సత్సంబంధాలు కొనసాగిస్తే సంస్థకు మంచి భవిష్యత్తు ఉంటుందని అన్నారు. తొలి వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని సంస్థ యాజమాన్యానికి శుభాకాంక్షలు వెల్లువెత్తాయి. కార్యక్రమంలో కౌన్సిలర్లు అనిత రఘునాథ్ యాదవ్, వాణి పాండురంగ రెడ్డి, అశోక్ యాదవ్, మాజీ కౌన్సిలర్లు యుగేందర్, చిన్న యాదగిరి, చెన్నయ్య, కాంటెస్టెడ్ కౌన్సిలర్ సలీం, మహాదేవ్‌పూర్ సర్పంచ్ అనూష రవీందర్ రెడ్డి, పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



# డొక్కా సీతమ్మ క్యాంటీన్‌లో అన్నదానం

### పవన్ కళ్యాణ్ స్ఫూర్తితో సేవా కార్యక్రమం

కాకినాడ జిల్లా జగ్గంపేట పట్టణంలోని పాత పోలీస్ స్టేషన్ ఆవరణలో తుమ్మలపల్లి సత్యనారాయణ భూపతి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, జనసేన పార్టీ జగ్గంపేట ఇంచార్జ్ తుమ్మలపల్లి రమేష్ ఆధ్వర్యంలో డొక్కా సీతమ్మ క్యాంటీన్ నిర్వహించారు. ప్రతి మంగళవారం తన సొంత నిధులతో సుమారు 500 మందికి ఉచితంగా భోజనం అందిస్తున్నట్లు రమేష్ తెలిపారు. జనసేన పార్టీ అధ్యక్షుడు, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రజా సేవా స్ఫూర్తితో ఈ కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నామని చెప్పారు. పేదలు, కూలీలు, వృద్ధులు, ఆపదలో ఉన్న వారికి భోజనం అందించి అండగా నిలవాలన్న ఉద్దేశంతో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వివరించారు. మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో సుమారు 500 మంది భోజనం చేశారు. ఈ సందర్భంగా తుమ్మలపల్లి రమేష్ స్వయంగా ప్రజలకు భోజనం వడ్డించారు. భోజనం చేస్తున్న వారితో ఆప్యాయంగా మాట్లాడి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. సేవా కార్యక్రమాల ద్వారా సమాజంలోని పేద, బలహీన వర్గాలకు అండగా నిలవాలన్న లక్ష్యంతో డొక్కా సీతమ్మ క్యాంటీన్‌ను నిరంతరం కొనసాగిస్తామని తెలిపారు. ప్రతి వారం అన్నదానం నిర్వహించడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు, జనసైనికులు, వీరమహిళలు, అభిమానులు పాల్గొన్నారు.



# గల్లంతైన మత్స్యకారుల కోసం ముమ్మర గాలింపు

### కుటుంబాలకు అండగా ఉంటాం: మంత్రి సుభాష్

అల్లవరం మండలం ఓడలరేవు ఫిష్ ల్యాండింగ్ సెంటర్ నుంచి సముద్రంలో చేపల వేటకు వెళ్లి గల్లంతైన ఏడుగురు మత్స్యకారుల ఆచూకీ కోసం అధికారులు ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టారని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ తెలిపారు. అమరావతి నుంచి బాధిత కుటుంబ సభ్యులు, అధికారులతో ఫోన్‌లో మాట్లాడిన మంత్రి, ఘటనను ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతతో పరిగణిస్తోందని చెప్పారు. జిల్లా అధికార యంత్రాంగం, ఇండియన్ కోస్ట్ గార్డ్, ఇండియన్ నేవీ, మెరైన్ పోలీసుల సమన్వయంతో సముద్రంలో విస్తృతంగా గాలింపు కొనసాగుతోందన్నారు. ఓడలరేవుకు చెందిన కొపనాతి రామకృష్ణవర్మతో పాటు మరో ఆరుగురు మత్స్యకారులు ఆగస్టు 3న చేపల వేటకు సముద్రంలోకి వెళ్లారని, నిర్ణీత సమయానికి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారని తెలిపారు. సముద్రంలోకి వెళ్లిన తొలి మూడు రోజుల వరకు కుటుంబ సభ్యులతో ఫోన్‌లో మాట్లాడిన మత్స్యకారులు ఆ తర్వాత అందుబాటులోకి రాలేదన్నారు. గల్లంతైన వారి ఆచూకీ కోసం గాలింపు చర్యలను మరింత వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించినట్లు మంత్రి పేర్కొన్నారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం పూర్తిగా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. మత్స్యకారుల జాడ లభించే వరకు అధికారులు నిరంతరం గాలింపు కొనసాగిస్తారని స్పష్టం చేశారు. కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని, ప్రభుత్వం అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తుందని మంత్రి సుభాష్ తెలిపారు.

# పట్టు రైతులకు ఆధునిక సాంకేతికతే అండ

### చేబ్రోలులో 'మేరా రేషమ్ -మేరా అభిమాన్ 2.0'



గొల్లప్రోలు మండలం చేబ్రోలు గ్రామంలోని ప్రభుత్వ పట్టు మార్కెట్ కేంద్రంలో నిర్వహించిన "మేరా రేషమ్-మేరా అభిమాన్ 2.0" కార్యక్రమంలో కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ పాల్గొన్నారు. పట్టు పరిశ్రమను మరింత అభివృద్ధి చేయడంతో పాటు శాస్త్రీయ పరిశోధనలను క్షేత్రస్థాయి విధానాలతో అనుసంధానం చేయడమే కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని ఎంపీ తెలిపారు. పట్టు రైతులకు ఆధునిక సాంకేతికత, శాస్త్రీయ సాగు పద్ధతులను అందుబాటులోకి తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో భాగంగా ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ పట్టు రైతులతో నేరుగా మాట్లాడారు. సాగులో వారు ఎదుర్కొంటున్న సమస్యలు, మార్కెటింగ్ ఇబ్బందులు, ఉత్పత్తి వ్యయాలు, అవసరాలను అడిగి తెలుసుకున్నారు. రైతుల నుంచి వచ్చిన సూచనలు, సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. శాస్త్రీయ విధానాలను రైతులకు చేరువ చేయడం ద్వారా పట్టు ఉత్పత్తి నాణ్యతను పెంచడంతో పాటు రైతులకు మెరుగైన ఆదాయం లభించేలా అవకాశాలు ఏర్పడతాయని ఆయన పేర్కొన్నారు. పట్టు పరిశ్రమలో ఆధునిక సాంకేతికత వినియోగం పెరిగితే ఉత్పాదకత, నాణ్యత రెండూ మెరుగుపడతాయని తెలిపారు. రైతుల అవసరాలకు అనుగుణంగా ప్రభుత్వ పథకాలు, సాంకేతిక సహకారం అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.



# కనిపించని దైవమే మన అమ్మ

### తల్లి జ్ఞాపకార్థం విద్యార్థులకు ఉపకార వేతనాలు



షాద్‌నగర్‌లో బీఆర్ఎస్ సీనియర్ నేత వంకాయల నారాయణరెడ్డి తన తల్లి వంకాయల తిరుమలమ్మ జ్ఞాపకార్థం నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఉపకార వేతనాలు అందించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే వై. అంజయ్య యాదవ్ మాట్లాడుతూ మనకు కనిపించని దైవమే కన్నతల్లి అని అన్నారు. పిల్లల భవిష్యత్తు కోసం నిత్యం శ్రమిస్తూ, కల్మషం లేని ప్రేమను పంచే తల్లిదండ్రుల సేవలను పిల్లలు ఎప్పటికీ మర్చిపోవద్దని సూచించారు. నేటి తల్లిదండ్రులు తమ పిల్లలకు ఉన్నత విద్య అందించేందుకు ఎంతో కష్టపడుతున్నారని, విద్యార్థులను ప్రోత్సహించడం ద్వారా వారి భవిష్యత్తుకు మరింత బలమైన పునాది వేయవచ్చని తెలిపారు. తన తల్లి పట్ల ఉన్న ప్రేమతో ఆమె జ్ఞాపకార్థం విద్యార్థులకు ఉపకార వేతనాలు అందించేందుకు నారాయణరెడ్డి ముందుకు రావడం అభినందనీయమన్నారు. ఎంత ఉన్నత స్థాయికి ఎదిగినా తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేయకూడదని సూచించారు. విద్యార్థులు మానవ సంబంధాల విలువను తెలుసుకుని ఉన్నత విద్యలో రాణించి దేశానికి సేవ చేయాలని ఆకాంక్షించారు. విద్యార్థులను ప్రోత్సహించడం సమాజం బాధ్యత అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా నారాయణరెడ్డి సేవలను తోటి నాయకులు, కార్యకర్తలు, విద్యార్థుల తల్లిదండ్రులు కొనియాడారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ గణేష్, బీఆర్ఎస్ నాయకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# పుష్కర నీరు ఇవ్వలేకపోతే రూ.20 వేలు ఇవ్వాలి



### రైతులకు ఆర్థిక సాయం ప్రకటించాలి

జగ్గంపేట నియోజకవర్గంలోని పుష్కర ఆయకట్టు రైతులకు ఈ ఖరీఫ్‌లో సాగునీరు అందించలేని పరిస్థితి ఏర్పడితే, నష్టపోయే ప్రతి ఎకరాకు రూ.20 వేల చొప్పున రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక సహాయం ప్రకటించాలని ఇండిపెండెంట్ ఎమ్మెల్యే అభ్యర్థి పాటంశెట్టి సూర్యచంద్ర డిమాండ్ చేశారు. సుమారు రూ.52 కోట్లతో పుష్కర ఎత్తిపోతల పథకం పునర్నిర్మాణ పనులు చేపట్టినా, పనులు నెమ్మదిగా సాగడంతో వేలాది ఎకరాలకు నీరు అందని పరిస్థితి ఏర్పడిందని ఆరోపించారు. ఫిబ్రవరి 6 నుంచి పనులు ప్రారంభించి ఆరు నెలల్లో పూర్తి చేయాల్సి ఉన్నా, అవసరమైన యంత్రాలు, సిబ్బందిని సమృద్ధిగా వినియోగించలేదన్నారు. మే 7న పరిశీలన సమయంలో కేవలం 10 శాతం పనులే పూర్తయ్యాయని, అప్పుడే అధికారులను, ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూను అప్రమత్తం చేశామని తెలిపారు. జూలై 20, ఆగస్టు 15 నాటికి నీరు అందిస్తామని ఇచ్చిన హామీలు అమలు కాలేదన్నారు. ఎమ్మెల్యే హామీలను నమ్మిన రైతులు నారుమడులు వేసుకుని, వర్షాలు లేక ఎండిపోకుండా బిందెలతో నీరు పోసి కాపాడుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రెండు పైప్‌లైన్లు, పంప్‌హౌస్, విద్యుత్ సబ్‌స్టేషన్ పనులు పూర్తికాకపోతే 32 వేల ఎకరాలకు సాగునీరు ఎలా అందిస్తారో ప్రభుత్వం స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. ఆగస్టు 20తో అసెంబ్లీ సమావేశాలు ముగియనున్న నేపథ్యంలో జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ రైతుల సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, సాగునీరు అందని ప్రతి ఎకరాకు రూ.20 వేల పరిహారం ప్రకటించేలా ముఖ్యమంత్రిని కోరాలని సూర్యచంద్ర అన్నారు.



# స్థానిక సంస్థలకు ప్రత్యక్ష ఎన్నికలే బలం

### కూటమి నిర్ణయాన్ని స్వాగతించిన యనమల

తేటగుంట క్యాంప్ కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన మాజీ ఆర్థిక మంత్రి, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు స్థానిక సంస్థల ఎన్నికలను ప్రత్యక్ష పద్ధతిలో నిర్వహించాలని రాష్ట్ర కేబినెట్ తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతించారు. ప్రత్యక్ష ఎన్నికల విధానమే తెలుగుదేశం పార్టీ పాలసీ అని, తాను మున్సిపల్ మంత్రిగా ఉన్న సమయంలోనూ ఇదే విధానం కొనసాగించామని ఆయన స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రత్యక్ష ఎన్నికల విధానానికి స్వస్తి పలికి పరోక్ష ఎన్నికల విధానాన్ని తీసుకొచ్చిందని పేర్కొన్నారు. పరోక్ష ఎన్నికల కారణంగా రాజకీయ అస్థిరతకు అవకాశం ఏర్పడుతోందని యనమల అన్నారు. అవిశ్వాస తీర్మానం పేరుతో చైర్మన్లను పదవుల నుంచి తొలగించే పరిస్థితులు రావడంతో స్థానిక సంస్థల పాలన సజావుగా సాగడం లేదని అభిప్రాయపడ్డారు. ప్రజలు నేరుగా ఎన్నుకున్న ప్రతినిధులకు పాలనలో స్థిరత్వం, బాధ్యత పెరుగుతాయని తెలిపారు. రాజకీయ అస్థిరతకు తావులేకుండా స్థానిక సంస్థలు సమర్థవంతంగా పనిచేయాలన్నదే టీడీపీ లక్ష్యమన్నారు. అందులో భాగంగానే ప్రత్యక్ష ఎన్నికల విధానాన్ని తిరిగి తీసుకురావాలని కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం అభినందనీయమని యనమల పేర్కొన్నారు. స్థానిక సంస్థల పాలనలో ప్రజల భాగస్వామ్యం పెరగడంతో పాటు ఎన్నికైన ప్రతినిధులకు ప్రజల పట్ల మరింత జవాబుదారీతనం ఉంటుందని తెలిపారు. ఈ మేరకు టీడీపీ మీడియా కోఆర్డినేటర్ రాంబాబు ప్రెస్‌నోట్ విడుదల చేశారు.

# పాస్టర్లంతా ఐక్యతగా ఉండాలి

### గండేపల్లిలో పాస్టర్ల సమావేశం



కాకినాడ జిల్లా గండేపల్లి మండలం ఉప్పలపాడు గ్రామంలోని ఇమ్మానియేల్ ప్రార్థన మందిరంలో గండేపల్లి యునైటెడ్ గాస్పల్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో మండల పాస్టర్ల సమావేశం నిర్వహించారు. యూనియన్ ఎగ్జిక్యూటివ్ సభ్యుల ఆధ్వర్యంలో నల్లి రత్నకుమార్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి గండేపల్లి యునైటెడ్ గాస్పల్ ఫెలోషిప్ అధ్యక్షులు బిషప్ గంధం సాల్మన్ రాజు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాస్టర్లంతా ఐక్యతగా ఉండాలని సూచించారు. ఏ పాస్టర్‌కు సమస్య వచ్చినా అండగా నిలిచేందుకు తాను ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటానని తెలిపారు. క్రైస్తవులంతా ఒకే తాటిపైకి వచ్చి పరస్పరం సహకరించుకోవాలని పిలుపునిచ్చారు. దుబాయ్, మస్కట్, ఖతార్ తదితర దేశాల్లో వాక్య పరిచర్య నిర్వహించి తిరిగి వచ్చిన బిషప్ గంధం సాల్మన్ రాజును ఇమ్మానియేల్ ప్రార్థన మందిరం నిర్వాహకులు ఘనంగా సన్మానించారు. అనంతరం గండేపల్లి యునైటెడ్ గాస్పల్ ఫెలోషిప్ ఎగ్జిక్యూటివ్ సభ్యులు కూడా ఆయనను సత్కరించారు. సేవా కార్యక్రమాలను సమన్వయంతో కొనసాగిస్తూ క్రైస్తవ సమాజంలో ఐక్యతను మరింత బలోపేతం చేయాలని సమావేశంలో పలువురు సూచించారు. కార్యక్రమంలో మండల, జిల్లా ఎగ్జిక్యూటివ్ సభ్యులు ఆర్. సాల్మన్ రాజు, బి. సాల్మన్ రాజు, పలివెల జాన్, చింతపల్లి సమర్పన్, పి. జయరావు, కె. దైవ ఆశీర్వాదం, ఏ. ఆమోస్, ఎస్. ఇస్సాక్ తదితర సేవకులు పాల్గొన్నారు.



# పాకిస్థాన్‌కు కొత్త కెప్టెన్

### బాబర్‌కు గాయం.. సల్మాన్‌కు పగ్గాలు

ఇంగ్లండ్‌తో హెడింగ్లీలో ఇవాళ ప్రారంభం కానున్న తొలి టెస్టుకు పాకిస్థాన్ స్టార్ బ్యాటర్ బాబర్ ఆజమ్ దూరమయ్యాడు. కుడిచేతికి గాయం పూర్తిగా తగ్గకపోవడంతో అతడిని తొలి టెస్టుకు అందుబాటులో లేడని పాకిస్థాన్ జట్టు ప్రకటించింది. దీంతో సల్మాన్ అలీ ఆఘా పాకిస్థాన్ టెస్టు జట్టుకు కొత్త కెప్టెన్‌గా బాధ్యతలు చేపట్టనున్నాడు. వార్మప్ మ్యాచ్‌లో ఇంగ్లండ్ అండర్ 19 పేసర్ మ్యానీ లమ్స్‌డెన్ బౌలింగ్‌లో బాబర్ కుడిచేతికి బంతి బలంగా తగిలింది. దీంతో ముందు జాగ్రత్తగా బ్యాటింగ్ నుంచి తప్పుకున్నాడు. ఇదే చేతికి వెస్టిండీస్‌తో జరిగిన రెండో టెస్టులోనూ బాబర్‌కు గాయం కావడం గమనార్హం. హెడింగ్లీలో సోమవారం నెట్స్‌లో బ్యాటింగ్ చేసినా.. పూర్తిస్థాయి ఫిట్‌నెస్ సాధించలేకపోయాడు. పాకిస్థాన్‌కు బాబర్ గైర్హాజరు భారీ ఎదురుదెబ్బగా మారింది. టెస్టుల్లో తొమ్మిది సెంచరీలు చేసిన బాబర్.. 43.68 సగటుతో జట్టుకు కీలక బ్యాటర్‌గా ఉన్నాడు. ఇంగ్లండ్‌పై 30 ఏళ్ల తర్వాత టెస్టు సిరీస్ గెలవాలనే లక్ష్యంతో బరిలోకి దిగుతున్న పాకిస్థాన్‌కు అతడి సేవలు లేకపోవడం సవాలుగా మారింది. బాబర్ స్థానంలో సౌద్ షకీల్ తుది జట్టులోకి వచ్చే అవకాశం ఉంది. వెస్టిండీస్‌తో ఇటీవల ముగిసిన రెండు టెస్టుల సిరీస్‌లో బాబర్ లేకపోయినా పాకిస్థాన్ సిరీస్‌ను 11తో ముగించింది. అయితే ఇంగ్లండ్ పరిస్థితులు, ముఖ్యంగా హెడింగ్లీ పిచ్.. గతంలో పాకిస్థాన్ ఆడిన స్పిన్‌కు అనుకూలమైన స్వదేశీ పిచ్‌ల కంటే పూర్తిగా భిన్నంగా ఉండటంతో కొత్త కెప్టెన్ సల్మాన్ ఆఘాకు తొలి టెస్టులోనే అసలు పరీక్ష ఎదురుకానుంది.

# నా జీవిత లక్ష్యం టెస్ట్ క్రికెట్

### రెడ్‌బాల్ ఆటపైనే పూర్తి దృష్టి

శ్రీలంకతో గాలేలో జరుగుతున్న తొలి టెస్టులో అద్భుత ప్రదర్శన చేసిన దేవదత్ పడిక్కల్.. టెస్టు క్రికెట్‌నే తన అంతిమ లక్ష్యంగా పేర్కొన్నాడు. దాదాపు రెండేళ్ల తర్వాత టెస్టు జట్టులోకి వచ్చిన పడిక్కల్ తొలి ఇన్నింగ్స్‌లో 167 పరుగులు, రెండో ఇన్నింగ్స్‌లో 44 పరుగులతో సత్తా చాటాడు. భారత్ విజయానికి చేరువ కావడంలో అతడి బ్యాటింగ్ కీలకంగా మారింది. రెడ్‌బాల్ క్రికెట్‌కు దూరం కాకుండా తన ఆటను రూపొందించుకుంటున్నానని చెప్పాడు. వైట్ బాల్ క్రికెట్‌లో ఎక్కువ షాట్లు ఆడేందుకు అనుకూలంగా ఉండే బ్యాటింగ్ సెటప్‌ను ఉపయోగిస్తానని, టెస్టుల్లో మాత్రం చేతులను దగ్గరగా ఉంచుకుని రక్షణాత్మకంగా ఆడటంపై దృష్టి పెడతానని వివరించాడు. ఫార్మాట్ల మధ్య మారడం సులభం కాదని, అయితే ఇప్పుడు ఆ మార్పును మెరుగ్గా అలవాటు చేసుకున్నానని చెప్పాడు.

### అవకాశం వస్తే పరుగులే ముఖ్యం

జట్టులో తనకు వరుసగా అవకాశాలు వస్తాయా అనే ఆలోచన కంటే.. వచ్చిన ప్రతి అవకాశాన్ని పరుగులుగా మలచడమే తన లక్ష్యమని పడిక్కల్ స్పష్టం చేశాడు. ఆధునిక క్రికెట్‌లో ఆటగాళ్లకు ఎక్కువకాలం స్థానం ఖాయమనే హామీ ఉండదని, ప్రదర్శనే జట్టులో స్థానాన్ని నిర్ణయిస్తుందని అన్నాడు. తన ఆలోచనలను సాధ్యమైనంత సరళంగా ఉంచుకుంటానని, ముందుగానే ఎక్కువగా ఆలోచించకుండా బంతిని బట్టి స్పందించడమే తన విధానమని తెలిపాడు. మాజీ కోచ్ రాహుల్ ద్రవిడ్ ఎప్పుడూ తనకు మద్దతుగా నిలిచారని గుర్తుచేశాడు.





# జురెల్ క్యాచ్‌పై రచ్చ

- లంక టెస్టులో వివాదాస్పద క్యాచ్
- థర్డ్ అంపైర్ తీర్పుతో వివాదం

శ్రీలంకతో గాలే వేదికగా జరుగుతున్న తొలి టెస్టు నాలుగో రోజు టీమిండియా వికెట్ కీపర్ ధ్రువ్ జురెల్ పట్టిన ఓ లో క్యాచ్ తీవ్ర చర్చకు దారితీసింది. శ్రీలంక రెండో ఇన్నింగ్స్‌లో 22వ ఓవర్‌లో మానవ్ సుతార్ వేసిన బంతిని లహిరు ఉదార డిఫెన్స్ చేయగా, బ్యాట్‌కు భారీ ఎడ్జ్ తీసుకుంది. గల్లీలో ఉన్న జురెల్ కిందకు వంగి బంతిని అద్భుతంగా అందుకున్నాడు. అయితే బంతి నేరుగా జురెల్ చేతిలో పడిందా? ముందుగా నేలను తాకిందా? అన్న అనుమానం తలెత్తింది. ఫీల్డ్ అంపైర్లు థర్డ్ అంపైర్‌కు నిర్ణయాన్ని పంపారు. రీప్లేలను పరిశీలించిన తర్వాత క్యాచ్‌ను ఔట్‌గా ప్రకటించారు. దీంతో ఉదార పెవిలియన్ చేరాడు. అయితే సోషల్ మీడియాలో ఈ నిర్ణయంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. కొందరు బంతి నేలను తాకిన తర్వాత జురెల్ అందుకున్నాడని వాదించగా, మరికొందరు రీప్లేల్లో బంతి చేతిలోనే ఉన్నట్లు కనిపిస్తోందని సమర్థించారు. అత్యంత సమీపంగా కనిపించిన ఈ క్యాచ్‌పై స్పష్టత లేకపోవడంతో మ్యాచ్‌లో కొత్త వివాదం మొదలైంది. భారత్ ఇప్పటికే విజయానికి చేరువగా ఉండగా, జురెల్ క్యాచ్ వ్యవహారం మ్యాచ్‌కు అదనపు ఉత్కంఠను తీసుకొచ్చింది.

# పంత్ మెరుపులు

- లంకపై బౌలర్ల దెబ్బ • కుప్పకూలిన బ్యాటింగ్
- విజయానికి చేరువలో భారత్



శ్రీలంకతో జరుగుతున్న తొలి టెస్టులో భారత్ భారీ విజయం దిశగా దూసుకెళ్తోంది. నాలుగో రోజు ఆట ముగిసే సమయానికి శ్రీలంక రెండో ఇన్నింగ్స్‌లో 84 పరుగులకు నాలుగు వికెట్లు కోల్పోయింది. భారత్ నిర్దేశించిన 372 పరుగుల భారీ లక్ష్యాన్ని ఛేదించేందుకు లంక ఇంకా 288 పరుగులు చేయాల్సి ఉంది. అంతకుముందు భారత రెండో ఇన్నింగ్స్‌లో రిషభ్ పంత్ 53 బంతుల్లో 66 పరుగులు చేసి కీలక పాత్ర పోషించాడు. దేవదత్ పడిక్కల్ 44, కేఎల్ రాహుల్ 35 పరుగులతో రాణించడంతో భారత్ రెండో ఇన్నింగ్స్‌లో 193 పరుగులు చేసి శ్రీలంక ముందు భారీ లక్ష్యాన్ని ఉంచింది. టెస్టు క్రికెట్‌లో గాలే వేదికపై అత్యధిక విజయవంతమైన ఛేజ్ 344 పరుగులు మాత్రమే కావడం భారత్‌కు మరింత అనుకూలంగా మారింది.

### పంత్‌కు అరుదైన రికార్డు

రిషభ్ పంత్ మరోసారి తన దూకుడు బ్యాటింగ్‌తో ఆకట్టుకున్నాడు. 53 బంతుల్లో అర్ధశతకం పూర్తి చేసిన పంత్.. లహిరు కుమార బౌలింగ్‌లో సిక్సర్ కొట్టి ఈ ఘనత సాధించాడు. ఈ క్రమంలో టెస్టుల్లో 100 సిక్సర్లు పూర్తి చేసిన తొలి భారత బ్యాటర్‌గా, అత్యంత వేగంగా ఈ మైలురాయిని చేరిన బ్యాటర్‌గా నిలిచాడు. రవీంద్ర జడేజాతో కలిసి ఆరో వికెట్‌కు 54 పరుగులు జోడించాడు. చి కేఎల్ రాహుల్ రెండు సిక్సర్లతో దూకుడుగా ఆడినా 35 పరుగుల వద్ద ఔటయ్యాడు. యశస్వి జైస్వాల్ తొలి ఓవర్‌లోనే వెనుదిరగగా, శుభ్‌మన్ గిల్ కూడా స్పిన్‌కు చిక్కి నిరాశపరిచాడు.

# డిసి చిత్రంపై అల్లు అర్జున్ ప్రశంసలు

తమిళ చిత్ర పరిశ్రమలో సంచలనం సృష్టిస్తున్న 'డీసీ' చిత్రంపై టాలీవుడ్ ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ ప్రశంసలు కురిపించారు. ఇప్పటికే రూ. 85 కోట్ల వసూళ్లను సాధించి, రూ. 100 కోట్ల క్లబ్ దిశగా దూసుకెళ్తున్న ఈ సినిమాపై ఆయన సోషల్ మీడియా వేదికగా తన అభిప్రాయాలను పంచుకున్నారు. 'ఈ సినిమా ఒక అద్భుతమైన తమిళ క్లాసిక్ అని, సినిమాను ప్రేమించే ప్రతి ఒక్కరూ ఖచ్చితంగా చూడాల్సిన చిత్రమని ఆయన కొనియాడారు. ఈ చిత్రాన్ని అర్థం చేసుకోగలిగే వారికి ఇది ఒక కవితలా ఉంటుందని' బన్నీ అభివర్ణించారు. ఇక దర్శకుడు అరుణ్ మాథేశ్వరన్ మేకింగ్ స్టైకు తాను ఫిదా అయ్యానని తెలుపుతూ, చిత్ర బృందం మొత్తానికి ఆయన అభినందనలు తెలియజేశారు. ముఖ్యంగా ఈ సినిమాకు ప్రాణం పోసిన సంగీత దర్శకుడు అనిరుధ్ రవిచందర్ పనితీరును అబ్సల్యూట్ మాస్టర్ బూస్టర్‌గా బన్నీ అభివర్ణించారు. సాంకేతికంగా కూడా ఈ చిత్రం అత్యున్నత ప్రమాణాలతో తెరకెక్కిందని ఆయన పేర్కొన్నారు. నటీనటుల విషయానికి వస్తే, వామికా గబ్బి నటన అద్భుతమని మెచ్చుకుంటూనే, ప్రధాన పాత్రలో హీరోగా నటించిన దర్శకుడు లోకేష్ కనగరాజ్ నటనను కూడా ప్రత్యేకంగా ప్రశంసించారు. తన మిత్రుడు లోకేష్ కనగరాజ్ తనకు ఎల్లప్పుడూ ఒక గొప్ప మద్దతుగా ఉంటారని అల్లు అర్జున్ సంతోషం వ్యక్తం చేశారు. విడుదలైన కొద్ది కాలంలోనే బాక్సాఫీస్ వద్ద భారీ వసూళ్లను రాబడుతూ, సినీ వర్గాల్లో 'డీసీ' మూవీ హాట్ టాపిక్‌గా మారింది.






# అక్టోబర్ 2న రానున్న సందీప్ కిషన్ సిగ్మా

కోలీవుడ్ స్టార్ హీరో, తమిళనాడు సీఎం విజయ్ తనయుడు జేసన్ సంజయ్ దర్శకుడిగా పరిచయమవు తున్న మోస్ట్ అంటెసిపేటెడ్ యాక్షన్ హీస్ట్ డ్రామా 'సిగ్మా'. టాలెంటెడ్ హీరో సందీప్ కిషన్ కథానాయకుడిగా నటిస్తున్న ఈ సినిమాకు సంబంధించిన అప్‌డేట్ వచ్చింది. ప్రముఖ నిర్మాణ సంస్థ లైకా ప్రొడక్షన్స్ పతాకంపై సుభాస్కరన్ అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఈ చిత్రానికి సంబంధించి మేకర్స్ తాజాగా అధికారిక విడుదల తేదీని ప్రకటించారు. గాంధీ జయంతి కానుకగా అక్టోబర్ 2వ తేదీన ఈ చిత్రాన్ని ప్రపంచవ్యాప్తంగా ఘనంగా థియేటర్లలో విడుదల చేయనున్నట్లు చిత్ర బృందం వెల్లడించింది. ఈ ప్రకటనతో పాటు విడుదల చేసిన సరికొత్త పోస్టర్‌లో సందీప్ కిషన్ మునుపెన్నడూ లేని విధంగా అత్యంత ఇంటెన్స్ లుక్‌లో కనికట్టు చేస్తున్నారు. ఈ చిత్రంలో సందీప్ కిషన్ సరసన టాలెంటెడ్ బ్యూటీ ఫరియా అబ్దుల్లా కథానాయికగా నటిస్తుండగా, నూతన దర్శకుడి ప్రతిభకు తగ్గట్టుగా భారీ తారాగణం ఈ సినిమాలో భాగమైంది. ప్రముఖ కొరియోగ్రాఫర్, నటుడు రాజు సుందరం, వర్సటైల్ యాక్టర్ సంపత్ రాజ్, శివ్ పండిట్, అన్బు దాసన్, యోగ్ జాపీ, షీలా రాజ్‌కుమార్ మరియు కిరణ్ కొండ వంటి ప్రముఖ నటీనటులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. సాంకేతిక నిపుణుల విషయానికి వస్తే, స్టార్ మ్యూజిక్ డైరెక్టర్ ఎస్. థమన్ ఈ సినిమాకు అదిరిపోయే సంగీతం అందిస్తుండగా, కృష్ణన్ వసంత్ సినిమాటోగ్రఫీ బాధ్యతలు మరియు ప్రవీణ్ కేఎల్ ఎడిటింగ్ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తున్నారు. ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఈ సినిమా విడుదల తేదీ ఖరారు కావడంతో, రాబోయే రోజుల్లో టీజర్, పాటలతో పాటు ప్రచార కార్యక్రమాలను వేగవంతం చేసేందుకు మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు. ఇకపోతే ఈ సినిమాలో అగ్ర కథానాయకుడు రామ్ చరణ్ అతిథి పాత్రలో కనిపించనున్నట్లు వార్తలు వచ్చాయి. ఈ సినిమాలో 'మల్లెపూల పల్లకి బంగారు పల్లకి' అంటూ సాగే పాటలో రామ్ చరణ్ అయ్యప్ప మాలధారణలో కనిపిస్తారని.. కొన్ని పోస్టులు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. వీటిపై రామ్‌చరణ్ టీమ్ తాజాగా స్పందించింది. అవి రూమర్స్ అంటూ ఖండించింది. అసత్యాలను ప్రచారం చేయొద్దని విజ్ఞప్తి చేసింది.







# సంక్రాంతి బరిలో మెగా 158 మూవీ

మెగాస్టార్ చిరంజీవి నటిస్తున్న అత్యంత ప్రతిష్టాత్మక చిత్రం మెగా 158 నుంచి సినీ అభిమానులకు అదిరిపోయే అప్‌డేట్ వచ్చింది. ఈ చిత్రాన్ని సంక్రాంతి 2027 కానుకగా థియేటర్లలోకి తీసుకురావడానికి మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు. అనుకున్న ప్లాన్ ప్రకారం షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఇప్పటికే దాదాపు 40 రోజుల చిత్రీకరణ విజయవంతంగా పూర్తయింది. సినిమాకు సంబంధించి ఫస్ట్ హాఫ్ ఎడిటింగ్ దాదాపు పూర్తయి లాక్ అయినట్లు సమాచారం. ప్రస్తుతం ఈ చిత్రానికి సంబంధించిన తాజా షెడ్యూల్ హైదరాబాద్‌లో శరవేగంగా జరుగుతోంది. ప్రముఖ నిర్మాణ సంస్థ కేవీఎన్ ప్రొడక్షన్స్ అత్యంత ప్రతిష్టాత్మకంగా, భారీ బ్జడెట్‌తో ఈ విజువల్ స్పెక్టాకిల్‌ను నిర్మిస్తోంది. మెగాస్టార్ పుట్టినరోజైన ఆగస్ట్ 22న సినిమా నుంచి అదిరిపోయే అఫీషియల్ అప్‌డేట్ విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. బాబీ డైరెక్ట్ చేస్తున్న ఈ సినిమా మీద భారీ అంచనాలు ఉన్నాయి. మన శంకర వరప్రసాద్ గారు లాంటి బ్లాక్ బస్టర్, వాల్తేరు వీరయ్య లాంటి కాంబో కావడంతో ఈ సినిమా మీద కూడా ముందు నుంచి అందరి ఫోకస్ ఉంది. ఇప్పటికే సంక్రాంతికి అనిల్ రావిపూడి వెంకటేష్ కళ్యాణ్ రామ్ సినిమా. రవితేజ శ్రీవిష్ణు ఎంటర్‌టైనర్, శర్వానంద్` శ్రీనువైట్ల కాంబో చిత్రం, ప్రశాంత్ వర్మ 'మహాకాళి', సాయి దుర్గా తేజ్ సంబరాల ఏటిగట్టు సినిమాలు ఉండగా ఇప్పుడు మెగాస్టార్ సినిమా కూడా అదే సీజన్ మీద కన్నేయడంతో ఏం జరగనుంది అనేది చూడాలి.




# ఇరుముడికి యూ/ఎ సర్టిఫికెట్

### రామ్‌చరణ్ గెస్ట్ రోల్ ప్రచారాలను ఖండించిన టీమ్

టాలీవుడ్ మాస్ మహారాజా రవితేజ నటిస్తున్న తాజా సంచలన చిత్రం 'ఇరుముడి' థియేట్రికల్ విడుదలకు సర్వం సిద్ధం చేసుకుంది. దర్శకుడు శివ నిర్వాణ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రంపై ప్రేక్షకుల్లో మరియు ట్రేడ్ వర్గాల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. అయితే తాజాగా సెన్సార్ కార్యక్రమాలను పూర్తి చేసుకున్న ఈ సినిమా 'యు/ఎ' సర్టిఫికేట్‌ను సొంతం చేసుకుంది. అలాగే సినిమా రన్‌టైమ్‌ను రెండు గంటల ఇరవై ఐదు నిమిషాల నిడివితో లాక్ చేసినట్లు మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. ఈ చిత్రంలో రవితేజ పూర్తి భిన్నమైన, సరికొత్త పాత్రలో కనిపించనున్నారు. మధ్యతరగతి కుటుంబసభ్యుడిగా, కూతురు పాత్రలో నటించిన బేబీ నక్షత్రాతో ఆయన సాగే అనుబంధం ఈ సినిమాకు ప్రధాన భావోద్వేగ బలంగా నిలవనుంది. ముఖ్యంగా ఆల్కహాల్ వ్యసనంతో పోరాడే ఒక మధ్యతరగతి వ్యక్తి జీవితం, భవిష్యత్తులో అయ్యప్ప దీక్షను స్వీకరించి మాల ధరించిన తర్వాత ఎలాంటి ఆధ్యాత్మిక పరివర్తన చెందుతుందనే కోణంలో ఈ కథ సాగనుంది. గ్రామీణ వాతావరణం, సహజసిద్ధమైన లొకేషన్లు మరియు ఏజెన్సీ ప్రాంతాల నేపథ్యంలో ఈ సినిమా సాగుతుందని, ఇది ప్రేక్షకులకు ఒక కొత్త అనుభూతిని పంచుతుందని చిత్ర యూనిట్ ధీమా వ్యక్తం చేస్తోంది. ఈ చిత్రంలో రవితేజ సరసన ప్రియా భవానీ శంకర్ హీరోయిన్‌గా నటిస్తుండగా, సాయి కుమార్, అజయ్ ఘోష్, స్వసిక తదితరులు కీలక పాత్రలలో కనిపించనున్నారు. ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతున్న ఈ సినిమా ఆగస్టు 21వ తేదీన ప్రపంచవ్యాప్తంగా భారీ ఎత్తున గ్రాండ్ థియేట్రికల్ విడుదలకు సిద్ధమవుతోంది.

This newspaper is Owned and Published by GUNDEBOINA VENKANNA from 2-7-76, GURUKRUPA COMPLEX, UPPAL, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500047. Phone Number: 9440906108.
Editor: GUNDEBOINA VENKANNA and Printed at 1-5-431/20/4, JONNABANDA, OLD ALWAL, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500010.
PRGI REGD No.: TGBIL/26/A6717. www.rajyasamskarana.com.